# దారి దీపం

మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 3 - సంచిక 2 | నవంబరు 2024 | వెల : రూ.15


**రాజ్యాంగ దినోత్సవాన్ని అర్థవంతంగా నిర్వహించాలి**

**వైరుధ్యాల జీవితాల్లోకి అడుగు పెడుతున్నాం.. అంబేడ్కర్ ప్రసంగం**

**రాజ్యాంగ రచన - ముఖ్యాంశాలు**

**రాజ్యాంగ పీఠిక - పద పరిచయం**


**రాజ్యాంగం-ప్రాథమిక హక్కులు**

**రాజ్యాంగం - ప్రాథమిక విధులు**

**రాజ్యాంగం - ఆదేశిక సూత్రాలు**

**రాజ్యాంగ రచనలో మహిళలు**

**రాజ్యాంగాన్ని పరిచయం చేద్దాం హక్కుదారుల ఉద్యమంగా నిర్వహిద్దాం**

భారత రాజ్యాంగము

భారత ప్రజలమైన మనము మన భారతదేశాన్ని
సార్వభౌమ సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర
రాజ్య వ్యవస్థగా నిర్మించేందుకు పవిత్రదీక్షతో తీర్మానించి
మన దేశ పౌరులందరికీ సామాజిక ఆర్థిక రాజకీయ
న్యాయాల్ని
ఆలోచనా భావప్రకటనా మతవిశ్వాస ఆరాధనా
స్వేచ్ఛను
హోదాల్లోనూ అవకాశాలలోను
సమానత్వాన్ని
సాధించేందుకు వ్యక్తి గౌరవాన్ని జాతి ఐక్యత సమగ్రతను కల్పించే
సౌభ్రాతృత్వాన్ని
పెంపొందించాలని మన రాజ్యాంగ నిర్ణాయక సభ లో
1949 నవంబర్ 26వ తేదీన ఈ రాజ్యాంగాన్ని
స్వీకరించి శాసనీకరించి ఆమోదించి
మనకు మనము సమర్పించుకుంటున్నాము


- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిక నోటీసు
- లౌకికతత్వం-లౌకిక రాజ్యం
- ఆర్థిక సిద్ధాంతాల మాయాజాలం
- సంక్షోభంలో పాలక పక్షాల రాజకీయం : ప్రత్యామ్నాయ రాజకీయం తక్షణ అవసరం
- వేద గణితం అబద్ధం : 'సున్నా'ను కనుగొంది బౌద్ధులే!
- కశ్మీరం ఎటు వెళుతోంది?
- సైన్సు, విద్యుత్తు - లెనిన్
- 'ప్రశ్న' ఒడుపు తెలిసి విసిరిన ఒడిశాల

నవంబరు - 2024 పేజీలు : 44

# దారి దీపం

## మాసపత్రిక

సంపుటి : 3 - సంచిక : 2


**డీవీవీఎస్ వర్మ**
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణమూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..

1) రాజ్యాంగ దినోత్సవాన్ని అర్థవంతంగా నిర్వహించాలి - సంపాదకీయం 3
2) వైరుధ్యాల జీవితాల్లోకి అడుగు పెడుతున్నాం.. - అంబేడ్కర్ ప్రసంగం 4
3) రాజ్యాంగ రచన - ముఖ్యాంశాలు 11
4) రాజ్యాంగ పీఠిక - పద పరిచయం 12
5) రాజ్యాంగం-ప్రాథమిక హక్కులు 13
6) రాజ్యాంగం - ప్రాథమిక విధులు 16
7) రాజ్యాంగం - ఆదేశిక సూత్రాలు 16
8) రాజ్యాంగ రచనలో మహిళలు 17
9) భావి పౌరులకు రాజ్యాంగాన్ని పరిచయం చేద్దాం 21
10) హక్కుదారుల ఉద్యమంగా రాజ్యాంగ దినోత్సవం 22
11) రాజ్యాంగ ప్రతిజ్ఞ 23
12) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిక నోటీసు - వడ్డే శోభనాద్రీశ్వరరావు 24
13) లౌకికతత్వం-లౌకిక రాజ్యం - సంగిరెడ్డి హనుమంతరెడ్డి 25
14) ఆర్థిక సిద్ధాంతాల మాయాజాలం - ప్రభాత్ పట్నాయక్ 27
15) సంక్షోభంలో పాలక పక్షాల రాజకీయం : ప్రత్యామ్నాయ రాజకీయం తక్షణ అవసరం - డి.వి.వి.ఎస్.వర్మ 29
16) వేద గణితం అబద్ధం : 'సున్నా'ను కనుగొంది బౌద్ధులే! - డాక్టర్ దేవరాజు మహారాజు 31
17) కశ్మీరం ఎటు వెళుతోంది? - రాహుల్ కుమార్ 33
18) సైన్సు, విద్యుత్తు - లెనిన్ - ప్రబీర్ పుర్కాయస్థ 35
19) కీర్తిశేషులు గజ్జెలు మల్లారెడ్డి - మాశర్మ 40
20) 'ప్రశ్న' ఒడుపు తెలిసి విసిరిన ఒడిశాల - వి.విజయ్‌కుమార్ 41
21) కార్టూన్లు 43
22) కొత్త పుస్తకాల స్వీకారం 44




కార్టూన్ : సతీష్ ఆచార్య ఫేస్‌బుక్ సౌజన్యంతో..

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : **DVVSVARMA.COM**

### దారి దీపం

### మాసపత్రిక

**మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి**

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను..
డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు
నంబరుకు విధిగా
వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి.
ఫోన్ నెంబరు 93971 14495



# రాజ్యాంగ దినోత్సవాన్ని అర్థవంతంగా నిర్వహించాలి


నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవాన్ని విద్యా సంస్థలు నిర్వహిస్తున్నాయి. అవి మొక్కుబడి కార్యక్రమాలు కాకూడదు. అర్థవంతంగా జరపాలి. భావి పౌరులకు రాజ్యాంగ స్ఫూర్తిని అందించాలి. రాజ్యాంగ పరిచయ కార్యక్రమాలు పిల్లల విద్యా స్థాయిని బట్టి జరగాలి. రాజ్యాంగ పీఠిక పఠనం - ప్రతిజ్ఞతో ప్రారంభించాలి. రాజ్యాంగానికి కొన్ని మౌలిక లక్షణాలు, లక్ష్యాలు వున్నాయి. వాటిని పీఠికలో పొందుపరిచారు. అందుకే పీఠిక రాజ్యాంగానికి ఆత్మ అయ్యింది. విద్యార్థులతో పీఠికను చదివించాలి. అందులో అన్నీ విలువైన పదాలే. వాటిని ఉపాధ్యాయులు పరిచయం చేయాలి. విద్యా సంస్థలు ఈ పద పరిచయాన్ని తప్పనిసరి కార్యక్రమంగా చెయ్యాలి. రాజ్యాంగ పీఠిక ఈ దేశాన్ని 'సార్వభౌమ, సామ్యవాద, సెక్యులర్, ప్రజాస్వామ్య, రిపబ్లిక్‌గా నిర్మించాలని స్పష్టం చేసింది. ఈ ఐదు పదాలను సులభ పద్ధతిలో విద్యార్థులకు బోధించాలి. పీఠిక దేశ ప్రజలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కల్పిస్తామని, భావ ప్రకటనకి, ఆలోచనకి, మత విశ్వాసాలకు స్వేచ్ఛను కల్పిస్తామని హామీ ఇచ్చింది. అలాగే ప్రజల మధ్య హోదాలలో ఎలాంటి హెచ్చుతగ్గులు లేని అందరికీ సమాన అవకాశాలను కల్పించాలనే సమానత్వాన్ని ప్రకటించింది. వైవిధ్యంగల

దేశంలో ప్రజలు కుల, మత, ప్రాంతీయ భాషా ద్వేషం లేకుండా సోదరభావాన్ని పెంపొందించుకుని దేశ సమైక్యత సమగ్రతలను కాపాడుకోవాలని పిలుపునిచ్చింది. రాజ్యాంగంలో ఈ అంశాలను ప్రజల ప్రాథమిక హక్కులుగా ప్రకటించి అందరూ నిర్వహించాల్సిన విధులను పేర్కొంది. రాజ్యాంగ లక్ష్యాలను సాధించడానికి ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలను ఆదేశిక సూత్రాలలో పొందుపరిచింది. ఇందులో అందరికీ విద్య, ఆరోగ్యంతోపాటు మత్తు పదార్థాలు, మద్య నిషేధం వంటి అంశాలు వున్నాయి. సహజ వనరులు, సంపద ప్రజలందరికీ చెందేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ అంశాలను విద్యార్థులకు వివరించాలి. వారిని ఆలోచింపజేయ్యడానికి వ్యాస రచన పోటీలు, ప్రసంగ పోటీలు నిర్వహించడం వంటి కార్యక్రమాలను విద్యా సంస్థలు నిర్వహించాలి. దీనికి అవసరమైన సమయాన్ని ఉపాధ్యాయులకు కేటాయించాలి. అంతిమంగా నవంబరు 26న విద్యార్థులతో 'పీఠిక పఠనం-పీఠిక ప్రతిజ్ఞ' కార్యక్రమాన్ని సామూహికంగా నిర్వహించి, విద్యార్థులలో రాజ్యాంగ స్ఫూర్తిని నింపాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

**పౌర సమాజం స్పందించాలి**

రాజ్యాంగం కేవలం విద్యార్థులకే పరిమితమైంది కాదు. అశేష ప్రజానీకానికి, ప్రత్యేకించి సామాన్యులకు, పేదలకు, వివక్ష తరగతులకు శ్రేయోరాజ్యాన్ని అందించే రాజ్యాంగంపట్ల, పీఠిక పట్ల అవగాహన అవసరం. విద్యా సంస్థలు, విద్యార్థులకు స్ఫూర్తినిచ్చే కార్యక్రమాలలాగే పేదలకు, సామాన్యులకు రాజ్యాంగాన్ని పరిచయం చేసే బాధ్యత పౌరసమాజంలోని సంస్థలు, ప్రజా సంఘాలు నిర్వహించాలి. మన రాజ్యాంగం ప్రజలను యజమానులను చేసింది. అధికారం ప్రజలది. వారి ఓటుతోనే ప్రభుత్వాలు ఏర్పడతాయి. అధికారాన్ని పొందుతాయి. ప్రజల పన్నుల సొమ్ముతోనే పరిపాలన, అభివృద్ధి సంక్షేమ కార్యకలాపాలు నడుస్తాయి. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వాలు, పాలనా యంత్రాంగం అంతా ప్రజలకు జవాబుదారీగా వుండి తీరాలి. పాలనా సమాచారం ప్రజలు పొంది తీరాలి. స్వేచ్ఛాయుతమైన, వివక్ష లేని సమాజాన్ని, అంతరాలు లేని సమాజాన్ని నిర్మించే లక్ష్యాన్ని రాజ్యాంగం ప్రకటించింది. వీటిని ఆచరణలోకి తెచ్చుకోవాలి. సహజ సంపదల మీద ప్రజల హక్కును, సంపద కేంద్రీకరణకు బదులు వికేంద్రీకరణను ప్రజలకు హామీ ఇచ్చింది. రాజ్యాంగం ప్రజలను హక్కుదారులుగా గుర్తించడమే కాదు వారినే యజమానులుగా ప్రకటించింది. కాని, రాజకీయం వారిని కేవలం ఓటర్లుగా లబ్ధిదారులుగా దిగజార్చింది. రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు, శ్రేయోరాజ్య సాధనకు ప్రజలు తాము హక్కుదారులుగా ప్రకటించుకుని ఉద్యమించాలి. అందుకు పౌర సంఘాలు "హక్కుదారుల ఉద్యమంగా" రాజ్యాంగ దినోత్సవాన్ని అర్థవంతంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ❑

- డీవీవీఎస్ వర్మ, సంపాదకులు, 85006 78977



# వైరుధ్యాల జీవితాల్లోకి అడుగు పెడుతున్నాం

**రాజ్యాంగ ముసాయిదా పూర్తయిన సందర్భంగా 25-11-1949న డా బి.ఆర్. అంబేడ్కర్ చారిత్రాత్మక ప్రసంగం**

## అధ్యక్షా !

1946 డిసెంబర్ 9న మొట్టమొదటగా సమావేశమైన నాటి నుంచి ఈ రాజ్యాంగ రచనా సభ నేటికి 2 సంవత్సరాల 11 నెలల 17 రోజులపాటు చర్చించింది. ఈ కాలంలో 11 సమావే శాలు జరిగాయి. మొదటి ఆరు సమావేశాల్లో ఆబ్జెక్టివ్స్ రిజల్యూ షన్ (ఆశయాల తీర్మానం), ప్రాథమిక హక్కులు, యూనియన్ (కేంద్ర రాజ్యాంగం, యూనియన్ అధికారాలు, ప్రొవిన్షియల్ (రాష్ట్రాల) రాజ్యాంగం, మైనార్టీలు, షెడ్యూల్ ఏరియాలు, షెడ్యూలు తెగలపై వివిధ కమిటీల నివేదికలు చర్చించాం. ఏడు, ఎనిమిది, తొమ్మిది, పది, పదకొండు సమావేశాల్లో ముసా యిదా రాజ్యాంగం గురించి చర్చించాం. ఈ 11 సమావేశాలు 165 రోజులు జరిగాయి. ఇందులో 114 రోజులు మనం ముసాయిదా రాజ్యాంగం గురించి మాట్లాడుకున్నాం. 29 ఆగస్టు 1947న ఈ రాజ్యాంగ రచనా సభ డ్రాఫ్టింగ్ కమిటీని ఎన్నుకొంది. డ్రాఫ్టింగ్ కమిటీ మొదటి సమావేశం ఆగస్టు 30న జరిగింది. 141 రోజులపాటు రాజ్యాంగ ముసాయిదా తయారు చేసేందుకు కృషి సల్పింది. రాజ్యాంగ సలహాదారు రూపొందిం చిన 243 ఆర్టికల్స్, 13 షెడ్యూళ్ల ప్రతిపై డ్రాఫ్ట్ కమిటీ కసరత్తు చేసింది. రాజ్యాంగ సభకు 315 ఆర్టికల్స్, 8 షెడ్యూల్స్ తొలి రాజ్యాంగ ముసాయిదాను సమర్పించింది. మొత్తం 7,635 సవరణలు ముందుంచగా అందులో 2.473 సవరణలు సభలో చర్చించాం. రాజ్యాంగ రచనకు మా కమిటీ ఎక్కువ సమయం తీసుకుందనీ, ప్రజాధనం వృథా అవుతోందనీ విమర్శలు వస్తున్నందున నేను ఈ వాస్తవాలను వెల్లడించాల్సి వస్తోంది. రోమ్ తగలబడుతోంటే నీరో ఫిడేలు వాయిస్తున్నట్టుందన్న పై విమర్శలో సత్యమేమైనా వుందా? ఇక, ఇతర దేశాల రాజ్యాంగ రచనకు ఆయా దేశాల రాజ్యాంగ రచనా సభలు తీసుకున్న సమయాన్ని లెక్కిద్దాం. అమెరికాలో 25 మే 1787న మొదలు పెట్టి నాలుగు నెలల కాలంలో అంటే 17 సెప్టెంబర్ 1787కల్లా రాజ్యాంగ రచన ముగించారు. కెనడాలో 10 అక్టోబర్ 1864న మొదలై మార్చి 1867కు రాజ్యాంగ చట్టం చేశారు. ఇందుకు పట్టిన కాలం 2 సంవత్సరాల 5 నెలలు. మార్చి 1891లో ప్రారంభిస్తే 9 జులై 1900 నాటికి, అంటే 9 సంవత్సరాలకు గానీ ఆస్ట్రేలియా రాజ్యాంగం రూపొందలేదు. 1908లో ప్రారం భించి ఒక సంవత్సర కాల శ్రమతో 1909, 20 సెప్టెంబరు నాటికి దక్షిణాఫ్రికా తన రాజ్యాంగాన్ని రచించుకొంది. అమె రికా, దక్షిణాఫ్రికా రాజ్యాంగాల రూపకల్పన కంటే అధిక సమ యం తీసుకున్నప్పటికీ, మనం కెనడా, ఆస్ట్రేలియా రాజ్యాంగాల రచనాకాలంతో పోల్చుకుంటే తక్కువ సమయం తీసుకున్నట్టే లెక్క. సమయంతో పోల్చే సందర్భంలో కూడా రెండు అంశాల ను మనం పరిగణనలోకి తీసుకోవాలి. అందులో ఒక అంశం: అమెరికా, కెనడా, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా దేశాల రాజ్యాం గాలు మన దేశ రాజ్యాంగం కన్నా చిన్నవి. మన రాజ్యాంగంలో 395 ఆర్టికల్స్ వుండగా అమెరికా రాజ్యాంగంలో కేవలం 7 ఆర్టికల్స్ మాత్రమే వున్నాయి. అందులో మొదటి 4 ఆర్టికల్స్‌లో 21 సెక్షన్స్ మాత్రం వుంటాయి. కెనడా రాజ్యాంగం 147 ఆర్టికల్స్, ఆస్ట్రేలియా రాజ్యాంగం 128 ఆర్టికల్స్, దక్షిణా ఫ్రికా రాజ్యాంగం 153 ఆర్టికల్స్ కలిగివున్నాయి. రెండో అంశం కెనడా, ఆస్ట్రేలియా, అమెరికా, దక్షిణాఫ్రికా రాజ్యాంగ రచనా

కర్తలు సవరణల సమస్యను ఎదుర్కొనలేదు. ఆ రాజ్యాంగాలు ప్రతిపాదించగానే ఎటువంటి సవరణల సమస్యలు లేకుండా యథాతథంగా ఆమోదించారు. మరోవైపు మన రాజ్యాంగం 2,473 సవరణల చర్చను ఎదుర్కోవలసివచ్చింది. అందువల్ల రాజ్యాంగ రచన ఆలస్యమైందన్న ఆరోపణ అసంబద్ధమైనది. ఇంత త్వరగా రాజ్యాంగ రచన పూర్తయినందుకు ఈ సభ తనను తాను అభినందించుకోవాలి.

డ్రాఫ్టింగ్ కమిటీ రచనా నాణ్యత విషయం గురించి వస్తే, నజీరుద్దీన్ అహ్మద్ అభిప్రాయంలో నాసిరకం, తక్కువస్థాయి. ఈ అభిప్రాయం కలిగి వుండే హక్కు ఆయనకుంది. డ్రాఫ్టింగ్ కమిటీకంటే తనకెక్కువ సామర్థ్యముందని ఆయన అభిప్రాయం. ఈ సభ డ్రాఫ్టింగ్ కమిటీలో ఆయన్నూ ఒక సభ్యునిగా ఎన్నుకొంటే మేం ఆయన్ను సాదరంగా ఆహ్వానించేవాళ్లం. కమిటీలో ఆయన లేకపోవడమన్నది మా తప్పుకాదు. డ్రాఫ్టింగ్ (రచనా) కమిటీని డ్రిఫ్టింగ్ (నీళ్లలో ఎటుబడితే అటు కొట్టుకొనిపోతున్న) కమిటీగా వర్ణించి ఆయన తన అసమ్మతిని తెలిపారు. అయితే నేర్పరితనంతో కూడిన వేగానికి(డ్రిఫ్ట్), నేర్పులేని వేగానికి(డ్రిఫ్ట్) తేడావుంది. పరిస్థితులకనుగుణంగా నేర్పుగానే ఈ కమిటీ కదిలింది. తెలియనిచోట కాక తెలిసిన చోటే చేపలవేట చేసింది. ఎటుబడితే అటు కొట్టుకుపోకుండా అన్వేషణతోనే కొన సాగింది. ఆయనే వుద్దేశ్యంతో ఆ వ్యాఖ్య చేసినా దాన్ని మేం అభినందనగానే స్వీకరిస్తున్నాం. అనవసరమైన సవరణ ప్రతిపాదనలను తొలగించి అవసరమైన ప్రతిపాదనలను కమిటీ స్వీకరించింది. అలా చేయకపోవడం బాధ్యత రాహిత్యం, అగౌరవమైన చర్చే కదా! అలా చేయడం పొరపాటైతే ఆ పొరపాటు సరిదిద్దుకొనేందుకు మాకు అభ్యంతరమేమీ లేదు.

ఒక్క సభ్యుడు మినహా మిగిలిన రాజ్యాంగ సభ అంతా మా కమిటీ పనితీరుపై సంతృప్తికరంగా అభినందనీయంగా వున్నందుకు సంతోషిస్తున్నాం. ఓ వైపు యావత్ సభ, మరోవైపు మా కమిటీ సభ్యుల అభినందనల వెల్లువ నన్ను ముంచెత్తింది. వారికి ఏ విధంగా కృతజ్ఞతలు చెప్పాలన్నా, నాకు సరైన మాటలు దొరకటం లేదు. షెడ్యూల్డు కులాల ప్రయోజనాలు పరిరక్షించే ఏకైక ప్రయోజనంతోనే నేను ఈ సభలో అడుగుపెట్టాను. అత్యంత బాధ్యతాయుతమైన పనులను నాకప్పగిస్తారని ఊహించలేదు. డ్రాఫ్టింగ్ కమిటీలో సభ్యునిగా ఎన్నుకున్నప్పుడు ఆశ్చర్యపడ్డాను. కమిటీ చైర్మన్‌గా ఎన్నుకున్నప్పుడు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యాను. నిజానికి డ్రాఫ్టింగ్ కమిటీలో నాకంటే సమర్థుడైన మిత్రుడు అల్లాడి కుప్పుస్వామి అయ్యర్ వున్నారు. అయినప్పటికీ నామీద నమ్మకం, విశ్వాసం వుంచి దేశానికి సేవ చేసేందుకు నన్ను ఎన్నుకొన్న ఈ సభకు నేనెంతగానో కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను (కరతాళ ధ్వనులు), డ్రాఫ్టింగ్ కమిటీ కోసం ముసాయిదా ప్రతిని తయారుచేసిన రాజ్యాంగ సలహాదారు బి.ఎన్.రావుకు కూడా ఈ అభినందనల్లో వాటా చెందాలి. 141 రోజులపాటు విభిన్న దృక్పథాలను సహనంతో పరిశీలించి వాటిని సర్దుబాటు చేసుకునే సమర్థతతో, నిజాయితీతో నూతన సూత్రాలను ఎప్పటికప్పుడు ఆవిష్కరించిన మా డ్రాఫ్టింగ్ కమిటీలోని సభ్యులకు ఈ అభినందనలు చెందాలి. చీఫ్ డ్రాఫ్ట్స్‌మన్(ముఖ్య రాయసగాడు) ఎన్.ఎన్.ముఖర్జీకి మరింతగా ఈ అభినందనలు చెందాలి. అత్యంత క్లిష్టమైన ప్రతిపాదనలను సులభతరం చేసి లీగల్ సూత్రాల ప్రకారం వాటిని రూపకల్పన చేసిన ఆయన ప్రతిభ అనితరసాధ్యం. ఆయన నిరంతర కృషీవలుడు. ఈ సభ సేకరించుకొన్న విలువైన వ్యక్తి. ఆయన సహాయం లేకుంటే ఈ రాజ్యాంగ రచనకు మరిన్ని సంవత్సరాలు పట్టేది. ముఖర్జీ సిబ్బందిని ఈ సందర్భంగా మనం గుర్తించి గౌరవించాలి. అర్థరాత్రులు దాటాక వారు చేసిన కష్టతరమైన శ్రమ గురించి నాకు తెలుసు. వారి శ్రమకు, సహకారానికి ధన్యవాదాలు (కరతాళ ధ్వనులు). ఇందులోని సభ్యులు ఒక గుంపుగా కాక, ఎగుడుదిగుడు రాళ్లతో కూడిన ఒక రోడ్డు పక్క కాలిబాటగా కాక, ఎవరికి వారే అన్న తీరున కాక.. వుండటంతో మా శ్రమ తప్పింది. లేకపోతే అయోమయ వాతావరణం నెలకొనేది. సభా కార్యక్రమాలు పద్ధతిగా, క్రమశిక్షణగా నడిపేందుకు కాంగ్రెస్ పార్టీ సహకరించింది. అందువల్ల అభినందనలు ఆ పార్టీకి కూడా చెందాలి. పార్టీ క్రమశిక్షణకు సభ్యులందరూ లొంగివుండకపోతే సభ కార్యకలాపాలు సజావుగా సాగేది కాదు. పార్టీ క్రమశిక్షణ సభ్యులను 'అవును' అని ఆమోదించేవారిగా మలచింది. అదృష్టవశాత్తు తిరుగుబాటు దారులు వున్నారు. వారు కామత్, డా॥ పీఎస్ దేశముఖ్, సిధ్వ, ప్రొ॥ సక్సేనా, పండిట్ ఠాకూర్, దాస్ భార్గవ, ప్రొ॥ కె.టి.షా, పండిట్ హృదయనాథ్ కుంజ్రూలు. వారు లేవనెత్తిన అంశాలు సైద్ధాంతికమైనవి. వారు లేవనెత్తిన అంశాలు నేను అంగీకరించలేదంటే ఆ సలహాలు విలువైనవి కావని మాత్రం అర్థంకాదు. సభ నిర్వహణలో వారందించిన సేవలకు ధన్యవాదాలు. ఈ సందర్భంగా రాజ్యాంగాన్ని కేవలం యాంత్రికంగా ఆమోదించడం కాకుండా రాజ్యాంగ మౌలిక ఆదర్శాలను గురించి సవివరంగా పరిశోధించి చర్చించే అవకాశం కలిగింది.

చివరగా సభ కార్యకలాపాలను సజావుగా నిర్వహించిన సభాధ్యక్షులకు కృతజ్ఞతలు. ఈ సందర్భంగా మీరు చూపిన చొరవ, సమన్వయం సభికులెవరూ మర్చిపోలేరు. కొన్ని సందర్భాల్లో డ్రాఫ్టింగ్ కమిటీ సవరణలకు సాంకేతిక అంశాలు అడ్డు వచ్చిన సందర్భాల్లో నేనెంతో ఆందోళనకు గురయ్యాను. అయితే రాజ్యాంగ రచనా పద్ధతిని న్యాయ సాంకేతిక అంశాలు అడ్డుకోనివ్వకుండా సభాధ్యక్షులు చూపిన చొరవకు ధన్యవాదాలు. రాజ్యాంగానికి మద్దతుగా అన్ని అంశాలనూ సవివరంగా నా మిత్రుడు సర్ అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, టి.టి. కృష్ణమా

చారులు మాట్లాడారు. కాబట్టి ఇక నేను ఆ అంశాల జోలికి పోను. ఎందుకంటే ఒక రాజ్యాంగం ఎంత మంచిదయినా, అది అమలు చేయాల్సినవారు చెడ్డవారైతే అది చెడుపు చేస్తుంది. అదేవిధంగా ఒక రాజ్యాంగం ఎంత చెడ్డదైనా. దాన్ని అమలు చేసేవారు మంచివారైతే, ఆ రాజ్యాంగం మంచే చేస్తుంది. రాజ్యాంగ ప్రవృత్తిపై పూర్తిగా రాజ్యాంగ ఆచరణ ఆధారపడి వుండదు. రాజ్యం యొక్క ముఖ్య అంగాలైన చట్టసభ వ్యవస్థ, అధికార వ్యవస్థ, న్యాయ వ్యవస్థల గురించి రాజ్యాంగం చెబుతుంది. రాజకీయ పార్టీలు, వ్యక్తులు, వారి కోరికలు, రాజకీయాలవంటి అంశాలపైన రాజ్యం యొక్క ఈ ముఖ్య అంగాల పనితీరు ఆధారపడి వుంటుంది. భారత ప్రజలు, వారి ఆకాంక్షలు. ఆశయాలు ఎలా వుండగలవో ఎవరు చెప్పగలరు? తమ ఆశయాల సాధన కోసం వారు విప్లవ పద్ధతులను అవలంభిస్తారా? ఒకవేళ వారు విప్లవ మార్గం అనుసరిస్తే, రాజ్యాంగం ఎంత మంచిదైనా అది కూలిపోతుందని చెప్పడానికి ప్రవక్తలేం దిగిరావాల్సిన అవసరం లేదు. ప్రజలు, రాజకీయ పార్టీలు అనుసరించే పద్ధతులు, మార్గాల గురించి తెలియకుండా రాజ్యాంగంపై ఎటువంటి తీర్పులూ తీర్చడం వ్యర్థం. ప్రధానంగా కమ్యూనిస్టు, సోషలిస్టు పార్టీలు రెండూ రాజ్యాంగాన్ని ఖండించాయి. వారు రాజ్యాంగాన్నెందుకు ఖండిస్తున్నారు? నిజంగా ఈ రాజ్యాంగమంత చెడ్డదా? 'కాదు' అని చెప్పేందుకు నేను సంశయించను. శ్రామికవర్గ నియంతృత్వ సూత్రం ఆధారంగా రాజ్యాంగం కావాలన్నది కమ్యూనిస్టు పార్టీ ఆదర్శం. సోషలిస్టులకు రెండు అంశాలు కావాలి. సోషలిస్టులు అధికారంలోకి రాగానే ఎటువంటి పరిహారమూ చెల్లించకుండా వ్యక్తిగత ఆస్తినంతా జాతిపరం లేదా సమాజపరం చేయాలన్నది సోషలిస్టులు కోరే మొదటి అంశం. రాజ్యాంగంలో పొందుపర్చిన ప్రాథమిక హక్కులు పరిపూర్ణంగా వుండాలనీ, వాటికి ఎటువంటి పరిమితులూ వుండకూడదనీ, అలా వుంటే ఒకవేళ వారు అధికారంలోకి రాలేకపోయినా, ఆ అపరిమిత స్వేచ్ఛనుపయోగించి కేవలం విమర్శించడానికే పరిమితం కాకుండా రాజ్యాన్ని కూలదోయవచ్చన్నది వారు ఆశించే రెండో అంశం. పై కారణాలతో వారు రాజ్యాంగాన్ని ఖండిస్తున్నారు. రాజకీయ ప్రజాస్వామ్య వ్యవస్థలో కేవలం పార్లమెంటరీ ప్రజాస్వామ్య పద్ధతి మాత్రమే ఉన్నతాదర్శ పద్ధతి అని నేను చెప్పబోవడం లేదు. పరిహారమివ్వకుండా వ్యక్తిగత ఆస్తిని స్వాధీనం చేసుకోకూడదనే సూత్రం అత్యంత పవిత్రమైనదనీ, ఆ పద్ధతి నుంచి వైదొలగాల్సిన అవసరం లేదనీ నేను చెప్పలేదు. ప్రాథమిక హక్కులు పరిపూర్ణంగా వుండకూడదనీ, వాటిపై విధించిన పరిమితులు తొలగించకూడదనీ కూడా నేను చెప్పలేదు. నేను చెప్పాలనుకుంటుందల్లా రాజ్యాంగంలో పొందుపరచిన సూత్రాలు ప్రస్తుత తరానికి సంబంధించిన దృక్పథాలు, లేదా, ఒకవేళ ఈ ప్రకటన అతిశయోక్తి అనుకుంటే, ఇవి ఈ రాజ్యాంగ రచనా సభ సభ్యుల అభిప్రాయాలు. ఈ అభిప్రాయాలను రాజ్యాంగంలో చేర్చినందుకు డ్రాఫ్టింగ్ కమిటీని ఎందుకు నిందిస్తారు? రాజ్యాంగ సభ సభ్యులను ఎందుకు నిందించాలి? అమెరికా రాజ్యాంగాన్ని రూపొందించటంలో ముఖ్యపాత్ర వహించిన రాజనీతిజ్ఞుడు థామస్ జెఫర్సన్ వెలిబుచ్చిన బలమైన అభిప్రాయాలు రాజ్యాంగ రూపశిల్పులు విస్మరించరానివి.

> **భారతీయుడు తన దేశం కంటే కులాన్ని అధికంగా గౌరవిస్తాడా? లేక కులం కంటే దేశాన్ని అధికంగా గౌరవిస్తాడా? ఏమో నాకు తెలియదు. కానీ, రాజకీయ పార్టీలు దేశం కంటే తమ కులాన్నే అధికంగా గౌరవిస్తే, మన దేశ స్వాతంత్ర్యం చిక్కుల్లో పడి, రెండోసారి, బహుశా ఎప్పటికీ తన స్వాతంత్ర్యాన్ని కోల్పోవడం మాత్రం ఖాయం. ఈ పరిస్థితి రాకుండా మనం నిరంతరం జాగరూకతతో వ్యవహరించాలి. చివరి రక్తపుబొట్టు ధారపోసైనా సరే మనం మన స్వాతంత్ర్యాన్ని పరిరక్షించుకోవాలి**

ఒక సందర్భంలో జెఫర్సన్ ఇలా అన్నారు: "ఒక హక్కుగా ప్రతీ తరం ఒక ప్రత్యేక జాతిగా ఒకే విధంగా కలిసివుంటుంది. అయితే ఆ తరం మరొక దేశాన్ని.. ప్రజలను చూసే విధంగా తన తరువాతి తరాన్ని చూడకూడదు". మరో సందర్భంలో ఆయనిలా అన్నారు: జాతి కోసం ఏర్పరచిన సంస్థలు ప్రజలకు జవాబుదారీగా వుండాల్సినపుడు ఎట్టి పరిస్థితుల్లో వాటిని కదిలించకూడదనీ, మార్చకూడదనీ, ఎందుకంటే వాటిని నిర్వహించేవారు ప్రజల విశ్వాసం కోసం పనిచేస్తున్నారనీ చెప్పడం అభినందనీయమే. కానీ అది జాతి వ్యతిరేకం. కానీ మన పూజారులూ, లాయర్లూ గత తరం వారు ఈ భూమిపై మహోన్నతులనీ, కనుక వారి చట్టాలను శిరసావహించాలనే సిద్ధాంతాన్ని మనపై రుద్దుతారు. వాటిని మార్చరాదంటారు. అదే విధంగా మనమూ చట్టాలు చేసి తరువాతి తరం వారిపై రుద్దుతాము. వాటిని వారు మార్చ వీల్లేదంటాము. దీనర్థం ఏమంటే ఈ భూమి చనిపోయిన వారికే చెందినది కానీ బతికున్నవారికి చెందినది కాదని". జెఫర్సన్ చెప్పింది పాక్షిక సత్యం కాదు. సంపూర్ణ సత్యమని నేనంటాను. నిస్సందేహంగా, ఈ సూత్రాన్నుంచి మన రాజ్యాంగ సభ వైదొలిగితే నిందకేకాదు, ఖండనకు అర్హమౌతుంది. అయితే మనం ఈ సూత్రాన్నుంచి వైదొలగలేదు. ఇందుకోసం మనం రాజ్యాంగ సవరణ నిమిత్తం చేసిన ఆర్టికల్ చూడాలి. కెనడా తరహాలో ఈ రాజ్యాంగమే అంతిమం. ఖచ్చితం అనే ముద్ర వేయకుండా సంయమనం పాటిస్తూ, అమెరికా, ఆస్ట్రేలియాల తరహాలో అసాధారణ విషయాలు, పరిస్థితులు నిర్వహించేందుకు సవరణ వీలు కల్పించే విధంగా అవకాశమిస్తూ, రాజ్యాంగాన్ని సవరించేందుకు సుగమమైన పద్ధతి ఏర్పరచాం. ప్రపంచంలో ఎక్కడైనా మన రాజ్యాం

గ సభ ఏర్పరచిన విధంగా సులభతరమైన రాజ్యాంగ సవరణ విధానం వుందేమో చూపాలని నేను విమర్శకులకు సవాలు విసురుతున్నాను. రాజ్యాంగంలోని ఒక అంశాన్ని నేను ప్రస్తావించదలచుకున్నాను. కేంద్రీకృత రాజ్యంగా తీర్చిదిద్దామనీ, రాష్ట్రాలను మునిసిపాలిటీల స్థాయికి దిగజార్చామనీ తీవ్రమైన ఫిర్యాదు చేశారు. ఈ విమర్శ సరైనది కాదు. ఇది వాస్తవాన్ని వక్రీకరించడమే. రాజ్యాంగం ఏం ఆశిస్తుందో తెలుసుకోవడంలో విఫలం చెందడమే. కేంద్ర, రాష్ట్ర సంబంధాలు ఏ ప్రాథమిక సూత్రంపై ఆధారపడి ఏర్పడతాయో అర్థం చేసుకోగలగాలి. సమాఖ్య సిద్ధాంతం ప్రాథమిక సూత్రమేమంటే, చట్ట సభలు – అధికార వ్యవస్థలు కేంద్ర, రాష్ట్రాల మధ్య కేవలం చట్టాల ద్వారా విభజించబడవు. అవి రాజ్యాంగాన్ని బట్టి తమ వ్యవస్థల అధికారాన్ని పంచుకుంటాయి. రాజ్యాంగం చేసిందదే. మన రాజ్యాంగం ప్రకారం ఏ రాష్ట్రమూ తన చట్టసభల, అధికార వ్యవస్థల కోసం కేంద్రంపై ఆధారపడదు. ఈ వ్యవహారంలో

**మన దేశంలో ప్రజాస్వామ్యం చాలా కాలం నుండీ లేకపోవడం వల్ల ప్రజా స్వామ్య భావన కొత్తగా వచ్చినట్లు భావించి, మన దేశంలాంటి దేశంలో ఈ ప్రజాస్వామ్యం నియంతృత్వంగా మారే ప్రమాదం వుంది. కొత్తగా జన్మించిన ఈ ప్రజాస్వామ్య శిశువు తన రూపాన్ని కోల్పోయి నియంతృత్వానికి చోటిచ్చే పరిస్థితి వుంది. ఏ మాత్రం పొరపాటు జరిగినా నియంతృత్వం వచ్చే ప్రమాదమే అత్యధికంగా కనబడుతోంది.**

కేంద్రమూ, రాష్ట్రాలూ సమానంగానే వుంటాయి. ఇటువంటి రాజ్యాంగాన్ని కేంద్రీకృత వ్యవస్థ ప్రోత్సహించలేదని ఎలా అనగలరు? అయితే రాజ్యాంగం కేంద్రానికి అత్యధికంగా చట్టసభల, అధికార వ్యవస్థల పనితీరుకు ఆస్కారమిచ్చిందనీ, ఇది ఇతర సమాఖ్య రాజ్యాంగాలిచ్చిన అధికారాలకంటే అధికమనీ అనిపించవచ్చు. అవశేష అధికారాలు (రెసిడ్యుయరీ పవర్స్) కేంద్రానికే ఇచ్చారనీ, రాష్ట్రాలకు ఇవ్వలేదని కూడా అనిపించవచ్చు. అయితే సమాఖ్య స్వభావసారం ఇదికాదు. సమాఖ్య స్వభావసారంలో ముఖ్యమైన విషయమేమంటే, ఇంతకు ముందు నేను చెప్పినట్లు కేంద్రమూ, రాజ్యాంగ విభాగాలలో చట్టసభల, అధికార వ్యవస్థల విభజన. ఈ సూత్రం మన రాజ్యాంగంలో పొందుపరచబడింది. ఇందులో ఏ సందేహమూ లేదు. అందువల్ల కేంద్ర పెత్తనంలో రాష్ట్రాలున్నాయన్నది అపోహ మాత్రమే. ఈ విభజన రేఖను కేంద్రం అతిక్రమించలేదు. అదే విధంగా న్యాయ వ్యవస్థ కూడా. ఎందుకంటే ఈ విధంగా ఒక మంచి వాక్యముంది – అదేమంటే: "కోర్టులు మార్చగలవు కానీ అవి ప్రత్యామ్నాయం కాలేవు. అవి ఇంతకు ముందటి వ్యాఖ్యానాలను తిరగ రాయగలవు. కొత్త చర్చ చేయగలవు. నూతన దృక్పథాలను ప్రవేశపెట్టగలవు. చిన్న కేసులను వేరు చేయగల గీతలను మార్చగలవు, అయితే దాటి పోరాని అడ్డుగోడలు కోర్టులకూ వున్నాయి, ప్రత్యేకించి ఇవ్వబడ్డ అధికారాలను తిరిగి అటూ ఇటూ కేటాయించి మార్చేందుకు వాటికి వీలుండదు, ఒకరికి సంపూర్తిగా కేటాయించిన అధికారాలను మరొకరికి కోర్టులు బదలాయించలేవు".

సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రీకృత రాజ్య వ్యవస్థ అన్న మొదటి చర్చ వీగిపోయింది. రాష్ట్రాలపై కేంద్ర పెత్తనం అనేది రెండో ఆరోపణ. ఈ ఆరోపణ పరిశీలించ దగ్గది. కేంద్రానికి ఇటువంటి అధికారాలిచ్చామని రాజ్యాంగాన్ని ఖండించే ముందు కొన్ని అంశాలను గమనంలో వుంచుకోవాలి. మొదటిది. ఈ అధికారాలు రాజ్యాంగంలో సాధారణ స్వభావంగా పొందుపర్చిన అధికారాలు కావు. ఎమర్జెన్సీ (అత్యవసర) కాలంలోనే ఉపయోగించే అధికారాలివి. ఇక గుర్తుంచుకోవాల్సిన రెండో అంశం: అత్యవసర సమయాల్లో కేంద్రానికి ఇటువంటి అధికారాలుండటాన్ని మనం నివారించగలమా? అత్యవసర సమయంలో కూడా కేంద్రానికి ఇటువంటి అధికారాలుండటం అంగీకరించనివారు ఈ విషయంలో సమస్య ప్రాతిపదిక ఏమిటో స్పష్టమైన అవగాహన కలిగివుండాలి. ఈ సమస్య గురించి 1935 డిసెంబర్ "రౌండ్ టేబుల్" పత్రికలో ఒక రచయిత ఇలా స్పష్టంగా వివరించారు. "హక్కులు, అధికారాల సమ్మిళితంగా రాజకీయ వ్యవస్థలుంటాయి. ఇక్కడ ప్రశ్నేమంటే ఎవరి హక్కులు, అధికారాలు, అవి ఎంతవరకూ, ఏ స్థాయి వరకూ.. పౌరుడు విధేయంగా రుణపడి వుండవల్సిందేనా? సాధారణ పరిస్థితులలో ప్రశ్న తలెత్తదు. ఒక వ్యక్తి ఒక చోట ఒక అధికారానికి లొంగి. మరోచోట నియమిత పద్ధతుల్లో మరో అధికారం వద్ద తన పని తాను చేసుకుంటూ వుంటాడు. సంక్షోభ సమయంలో, ఎవరి అధికారం కోసం వారి హక్కుల సంఘర్షణ తలెత్తవచ్చు అప్పుడు నిజమైన (అంతిమ) విధేయతను విభజించలేమని స్పష్టంగా.. తెలుస్తుంది. చట్టాలను న్యాయపరంగా వ్యాఖ్యానించి విధేయత సమస్యను నిర్ధారించి నిర్ణయించలేం. వాస్తవాలకు పరిమితమై చట్టం వ్యవహరించాలి. లేకపోతే చట్టం భ్రష్టుపడుతుంది. లాంఛనాలన్నీ తొలగించివేస్తే చివరకు మిగిలే ప్రశ్నేమిటంటే, పౌరుని అవశేష విధేయతను శాసించే అధికారమేమిటని? కేంద్రమా? లేక అందులో భాగమైన రాష్ట్రమా?" అసలు సమస్యకు ఆయువుపట్టేమిటన్న ప్రశ్నకు మనమిచ్చే సమాధానమే ఈ సమస్యకు పరిష్కారం. అత్యవసర సమయంలో పౌరుని అవశేష విధేయత కేంద్రంపట్టే వుండాలనీ, రాష్ట్రాలపట్ల కాదనీ అత్యధిక ప్రజల అభిప్రాయంగా వుంటుందనటంలో ఎటువంటి సందేహమూ లేదు. ఎందుకంటే ఏకీకృత

లక్ష్యంతో దేశ ఆసక్తుల కోసం పనిచేయగలిగేది కేంద్రమే కాబట్టి. అందువల్లే అత్యవసర సమయాల్లో కేంద్రానికి కొన్ని విశేష అధికారాలు ఇవ్వడంలో అర్థముంది. ఈ అత్యవసర సమయ అధికారాలు రాష్ట్రాలపై విధించే బాధ్యత ఏమిటి? వారి రాష్ట్ర ప్రాంతీయ ఆసక్తులను పరిగణనలోకి తీసుకుంటూనే, మొత్తంగా జాతి అభిప్రాయాలనూ, అసక్తులనూ పరిగణించాల్సి వస్తుంది. అంతకంటే మరేం వుండబోదు. ఈ సమస్యను అర్థం చేసుకోలేని వారే ఆరోపణలు చేస్తారు. నా మస్తిష్కం ఈ దేశ భవిష్యత్తు గురించి ఆలోచిస్తోంది. అందువల్ల నా భావాలను వెలిబుచ్చేందుకు నేను ఈ అవకాశాన్ని వినియోగించుకుంటున్నాను. 26 జనవరి, 1950 నుంచీ భారతదేశం స్వతంత్ర దేశం కాబోతోంది. (కరతాళ ధ్వనులు) ఈ దేశ స్వాతంత్ర్యం భవిష్యత్లో ఎలా వుం డబోతుంది? ఏం కాబోతుంది? స్వతంత్రాన్ని ఈ దేశం నిలబెట్టు కోగలుగుతుందా? లేక తిరిగి స్వతంత్రం కోల్పోతుందా? నా మదిలో మెదిలిన తొలి ప్రశ్న ఇదే. మన దేశం ఇంతకుముందు స్వతంత్ర దేశం కాదని కాదు. ఒకప్పుడు వున్న స్వాతంత్ర్యాన్ని మన దేశం కోల్పోయింది. రెండోసారి కూడా ఈ దేశం స్వతంత్రాన్ని కోల్పోతుందా? ఈ ప్రశ్నే నన్ను భవిష్యత్తు పట్ల ఉద్యోగంగా అశీలించ చేసేట్లు చేసింది. గతంలో దేశం స్వాతంత్రం కోల్పోయిందన్న వాస్తవమే కాక ఆ స్వాతంత్రం కొందరు వ్యక్తుల శీలంలేని వ్యక్తిత్వం, ద్రోహాల కారణంగా జరిగిందన్న వాస్తవం నన్ను చలింపజేస్తోంది. మహ్మద్ బిన్ కాసిం సింధ్‌లపై దండయాత్ర చేసినపుడు దహర్ రాజు సేనాధిపతులు కాసిం ప్రతినిధులిచ్చిన లంచాలు మరిగి రాజుకు ద్రోహం చేశారు. జయచంద్రుడు మహ్మద్ ఘోరీని స్వయంగా ఆహ్వానించి పృథ్వీరాజును ఓడించేందుకు తానూ, సోలంకి రాజులు సహాయపడుతామని వాగ్దానం చేశాడు. హిందువుల కోసం శివాజీ పోరాడుతున్న సమయంలో ఇతర మరాఠా రాజులు మొగల్ చక్రవర్తుల సరసన చేరారు. బ్రిటీషు వారు సిక్కులపై దండెత్తినప్పుడు వారి సేనాధిపతి గులాబ్ చంద్ ఉలుకూ పలుకూ లేకుండా చూస్తూ వుండిపోయాడు. 1857లో దేశంలో బ్రిటీషు వ్యతిరేక స్వతంత్ర సమరం మొదలైనప్పుడు సిక్కులు మౌనప్రేక్షకులుగా చూస్తూ నిలబడ్డారు. చరిత్ర మరలా దానంతటదే పునరావృతమౌతుందా? ఈ ఆలోచన నన్ను ఉద్విగ్నుణ్ణి చేస్తోంది. మన పురాతన కులాలూ, వర్గాలూవంటి శత్రువులతోపాటు ఇప్పుడు భిన్న, వ్యతిరేక రాజకీయ ఆసక్తులు కలిగిన రాజకీయ పార్టీలు తోడవడంతో, ఆ వాస్తవ పరిస్థితులను గమనించి నాలో ఉద్విగ్నత మరింత బలపడుతోంది. భారతీయుడు తన దేశం కంటే కులాన్ని అధికంగా గౌరవిస్తాడా? లేక కులం కంటే దేశాన్ని అధికంగా గౌరవిస్తాడా? ఏమో నాకు తెలియదు. కానీ, రాజకీయ పార్టీలు దేశం కంటే తమ కులాన్నే అధికంగా గౌరవిస్తే, మన దేశ స్వాతంత్రం చిక్కుల్లో పడి, రెండోసారి, బహుశా ఎప్పటికీ తన స్వాతంత్ర్యాన్ని కోల్పోడం మాత్రం ఖాయం. ఈ పరిస్థితి రాకుండా మనం నిరంతరం జాగరూకతతో వ్యవహరించాలి. చివరి రక్తపుబొట్టు ధారపోసైనా సరే మనం మన స్వాతంత్రాన్ని పరిరక్షించుకోవాలి.

26 జనవరి, 1950 నుంచీ ఇండియా ప్రజాస్వామ్య దేశం అవుతోందంటే అర్థం. ఈ దేశంలో ప్రజల చేత, ప్రజల వలన, ప్రజల కొరకు ప్రభుత్వం ఏర్పడబోతోందని అర్థం. ఈ ఆలోచనే మరలా నా మస్తిష్కంలోకి వస్తోంది. ఈ దేశ ప్రజాస్వామ్య రాజ్యాంగానికి ఏం కాబోతోంది? ఈ రాజ్యాంగాన్ని దేశం నిలబెట్టుకుంటుందా లేక కోల్పోతుందా? ఇది నాకు వెనువెంబడి వచ్చిన రెండో ఆలోచన. ఈ ఆలోచన మొదటి ఆలోచన వలే నన్ను ఉద్విగ్నభరితుణ్ణి చేస్తోంది. భారత దేశానికి ప్రజాస్వామ్యం గురించి ఇంతకుముందు చరిత్రలో తెలియదని కాదు. ఒకప్పుడు మన దేశం నిండా గణతంత్ర రాజ్యాలుండేవి. ఏకచ్ఛత్రాధిపత్య రాజ్యాలున్నప్పటికీ అవి కూడా ఎన్నికలతోనో లేదా అతి కొద్దిగానో వున్న రాజ్యాలు. అవి పరిపూర్ణమైన రాజ్యాలు కావు, పార్లమెంట్ గురించి పార్లమెంటరీ సంప్రదాయాల గురించి చరిత్రలో ఈ దేశానికి తెలియదని కాదు. బౌద్ధ బిక్కు సంఘాల అధ్యయనాలు తెలిపేదేమంటే దేశ చరిత్రలో కేవలం పార్లమెంటే కాదు (నిజానికి బౌద్ధ సంఘాలే వాటంతటకవి పార్లమెంట్లు), నేడు ఆధునిక కాలంలో అనుసరిస్తున్న పార్లమెంటరీ సంప్రదాయ పద్ధతులన్నీ అనాడు వుండేవి. సీటింగ్ అరేంజ్‌మెంట్, మోషన్స్, రిజల్యూషన్స్, కోరం, విప్. బాలట్ ఓటింగ్, సెన్సూర్ మోషన్, రెగ్యులరైజేషన్, రెస్ జుడికటా, ఓట్ కౌంటింగ్... వంటి నేటి పార్లమెంటరీ పద్ధతులను ఆనాడు బౌద్ధ సంఘాలు పాటించి చూపాయి. ఈ పార్లమెంటరీ పద్ధతులన్నింటినీ బుద్ధుడే తన భిక్కు సంఘాలలో ప్రవేశపెట్టాడు. ఆనాడు దేశంలో వున్న గణతంత్రాల అసెంబ్లీల నుంచి ఆయన ఈ పార్లమెంటరీ పద్ధతుల సూత్రాలను అరువు తెచ్చుకున్నాడు. ఇటువంటి గొప్ప ప్రజాస్వామ్య వ్యవస్థను భారతదేశం కోల్పోయింది. మరలా రెండోసారి కోల్పోతుందా? ఏమో? మన దేశం

> **‘ఏ వ్యక్తీ తన గౌరవాన్ని కోల్పోయి, ఏ స్త్రీ తన శీలాన్ని కోల్పోయి. ఏ దేశమూ తన స్వాతంత్రాన్ని కోల్పోయి కృతజ్ఞతలు చెల్లించకూడదు. ఈ హెచ్చరిక ఇతర దేశం కన్నా భారతదేశానికి ఎంతగానో అవసరం. ప్రపంచంలో ఏ దేశంలోనూ లేని విధంగా భారతదేశ రాజకీయాల్లో భక్తి, నాయకారాధన విపరీతంగా రాజ్యమేలుతున్నాయి. మతంలో భక్తి ఆత్మకు మోక్షం కలిగించవచ్చు. కానీ రాజకీయాల్లో భక్తి, నాయకారాధన దిగజారుడుతనానికి, నియంతృత్వానికి దారి తీస్తుంది.**

లో ప్రజాస్వామ్యం చాలా కాలం నుండీ లేకపోవడంవల్ల ప్రజాస్వామ్య భావన కొత్తగా వచ్చినట్లు భావించి, మన దేశంలాంటి దేశంలో ఈ ప్రజాస్వామ్యం నియంతృత్వంగా మారే ప్రమాదం వుంది. కొత్తగా జన్మించిన ఈ ప్రజాస్వామ్య శిశువు తన రూపాన్ని కోల్పోయి నియంతృత్వానికి చోటిచ్చే పరిస్థితి కూడా వుంది. ఏ మాత్రం పొరపాటు జరిగినా నియంతృత్వం వచ్చే ప్రమాదమే అత్యధికంగా కనబడుతోంది. ప్రజాస్వామ్యం కేవలం ఒక రూపంగానే కాక ఒక వాస్తవంగా వుండాలంటే మనం ఏం చేయాలి? మొదటగా, మన సాంఘిక, ఆర్థికలక్ష్యాలు సాధించాలంటే మనం రాజ్యాంగబద్ధ పద్ధతులకు కట్టుబడి వుండాలన్నది నా తీర్పు. రక్తపాత విప్లవ పద్ధతులను మనం వదులుకోవాలి. పౌర సహాయ నిరాకరణ, సత్యాగ్రహ పద్ధతులను వదిలేయాలి. అయితే, సాంఘిక ఆర్థిక లక్ష్యాలను చేరుకునేందుకు రాజ్యాంగబద్ధ పద్ధతులు అందుబాటులో లేకపోతే రాజ్యాంగేతర పద్ధతులకు సర్వత్రా మద్దతు లభిస్తుంది. నిజానికి రాజ్యాంగబద్ధ పద్ధతులు అందుబాటులో వున్నట్లయితే రాజ్యాంగేతర పద్ధతులకు మద్దతు లభించదు. రాజ్యాంగేతర పద్ధతులను మనం 'అరాచక వ్యాకరణం' (Grammer of anarchy)గా భావించాలి. వీటిని త్వరగా వదిలించుకోవాలి. అప్పుడే మనకు క్షేమం.

**మన సమాజంలో సమానత్వం లేదు. భారత సాంఘిక రంగంలో నిచ్చెన మెట్ల అసమానత్వ వ్యవస్థ వుంది. ఇందువల్ల కొందరు అధికులుగా, మిగిలిన వారు అల్పులుగా గుర్తించబడుతున్నారు. ఆర్థికరంగంలో అనంతైశ్వర్యాలతో కొందరు తులతూగుతుంటే బహుజనులు పేదరికంలో మగ్గిపోతున్నారు. 1950 జనవరి 26 నుంచీ మనం వైరుధ్యాల జీవితంలోకి అడుగిడుతున్నాం. రాజకీయాల్లో సమానత్వం వుంటుంది కానీ సాంఘిక ఆర్థిక రంగాలలో అసమానత్వం వుంటుంది.**

మనం పాటించాల్సిన రెండో అంశం జాన్ స్టువర్ట్ మిల్ చేసిన హెచ్చరిక. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సినవారు ఆయన చెప్పినట్టు "తమ స్వాతంత్ర్యాన్ని ఎటువంటి గొప్ప వ్యక్తి పాదాల వద్ద వుంచకూడదు. అదే విధంగా నమ్మకూడదు. అధికారమివ్వకూడదు. అందువల్ల ఆ వ్యక్తి సంస్థలను/ వ్యవస్థలను మార్చివేసే అవకాశముంది". దేశానికి జీవితాంతం సేవ చేసిన గొప్ప వ్యక్తికి కృతజ్ఞతలు చెల్లించడంలో తప్పులేదు. కృతజ్ఞతాస్తుతికి కూడా ఒక స్థాయి వరకూ మాత్రమే. డేనియల్ ఓ కన్నెల్ చెప్పినట్టు 'ఏ వ్యక్తీ తన గౌరవాన్ని కోల్పోయి, ఏ స్త్రీ తన శీలాన్ని కోల్పోయి. ఏ దేశమూ తన స్వాతంత్ర్యాన్ని కోల్పోయి కృతజ్ఞతలు చెల్లించకూడదు. ఈ హెచ్చరిక ఏ ఇతర దేశం కన్నా భారతదేశం వంటి దేశానికి ఎంతగానో అవసరం, ప్రపంచంలో ఏ దేశంలోనూ లేనివిధంగా భారతదేశ రాజకీయాల్లో భక్తి, నాయకారాధన విపరీతంగా రాజ్యమేలుతున్నాయి. మతంలో భక్తి ఆత్మకు మోక్షం కలిగించవచ్చు. కానీ రాజకీయాల్లో భక్తి, నాయకారాధన దిగజారుడుతనానికి, నియంతృత్వానికి దారి తీస్తుంది. కేవలం రాజకీయ ప్రజాస్వామ్యంతోనే సంతృప్తి చెందరాదన్నది మూడో అంశం. మన రాజకీయ ప్రజాస్వామ్యాన్ని మనం సామాజిక ప్రజాస్వామ్యంగా పరివర్తన చెందించుకోగలగాలి. సామాజిక ప్రజాస్వామ్య పునాది లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యం మనజాలదు. సామాజిక ప్రజాస్వామ్యమంటే ఏమిటి? జీవితాదర్శాలుగా స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను గుర్తించి జీవన విధానంగా మార్చుకునేదే సామాజిక ప్రజాస్వామ్యం. ఈ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం సూత్రాలు మూడూ విడదీయరాని అంశాలు. ఈ 'త్రిత్వ' అంశాలు ఒకదానితో ఒకటి పెనవేసుకున్నవి. వాటిని ఒకదానితో ఒకటి విడదీస్తే ప్రజాస్వామ్యం ఓడిపోతుంది. స్వేచ్ఛను సమానత్వం నుంచీ, సమానత్వాన్ని సౌభ్రాతృత్వం నుంచి, అదేవిధంగా స్వేచ్ఛా సమానత్వాలను సౌభ్రాతృత్వం నుంచీ విడదీయకూడదు. సమానత్వం లేని స్వేచ్ఛ బహుజనంపై అల్పజనుల ఆధిక్యతను స్థిరీకరిస్తుంది. సౌభ్రాతృత్వంలేని స్వేచ్ఛ, సమానత్వాలు తమ సహజ గుణాలు కోల్పోతాయి. అప్పుడు వాటిని అమలుచేసేందుకు ఒక పోలీస్ కానిస్టేబుల్ అవసరమవుతాడు. భారత సమాజంలో రెండు అంశాలు పూర్తిగా లేవని మనం ముందుగా గుర్తించాలి. మొదటిది, మన సమాజంలో సమానత్వం లేదు. భారత సాంఘిక రంగంలో నిచ్చెన మెట్ల అసమానత్వ వ్యవస్థ వుంది. ఇందువల్ల కొందరు అధికులుగా, మిగిలినవారు అల్పులుగా గుర్తించబడుతున్నారు. ఆర్థికరంగంలో అనంతైశ్వర్యాలతో కొందరు తులతూగుతుంటే బహుజనులు పేదరికంలో మగ్గిపోతున్నారు. 1950 జనవరి 26 నుంచీ మనం వైరుధ్యాల జీవితంలోకి అడుగిడుతున్నాం. రాజకీయాల్లో సమానత్వం వుంటుంది కానీ సాంఘిక ఆర్థిక రంగాలలో అసమానత్వం వుంటుంది. రాజకీయాల్లో ఒక మనిషికి ఒక ఓటు. ఒక ఓటుకు ఒక విలువ అనే సూత్రాన్ని గుర్తిస్తున్నాం. కానీ మన సాంఘిక ఆర్థిక నిర్మాణ రీత్యా మన సాంఘిక ఆర్థిక జీవితంలో ఒక మనిషికి ఒక విలువ అనే సూత్రాన్ని మనం నిరాకరిస్తూనే వుంటాం. ఈ నైరుధ్యాల జీవిత జీవనాన్ని సునం ఎంతకాలం కొనసాగిస్తాం? సాంఘిక ఆర్థిక జీవితంలో అసమానత్వాన్ని ఇంకా ఎంతకాలం మనం కొనసాగిస్తాం? ఇలా అసమానః కొనసా వడం ద్వారా మన రాజకీయ ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టివేస్తాం. సాధ్యమైనంత రగా మనం ఈ వైరుధ్యాన్ని పోగొట్టాలి లేకుంటే ఎంతో కష్టపడి ప్రజాస్వామ్యాన్ని అసమ సభ రూపకల్పన చేసిన రాజకీయ దుతున్న ప్రజలు పేలి చేస్తారు.. తృత్వ సూత్రాన్ని కూడా గుర్తించాలన్న అవసరాన్ని మనం గుర్తిస్తున్నాం. అంటే

ఏమిటి? భారతీయులమందరమూ ఒక్కటే అన్న భావనే సాంఘి క జీవితంలో ఐక్యత, సంఘీభావాన్ని ఈ సౌభ్రాతృత్వ సూత్రం కలిగిస్తుంది. ఈ భావన కలిగించడం అత్యంత కష్టతరమైన అం శం. ఈ భావన సాధించడం ఎంత కష్టమైనదో తెలిపేందుకు యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా గురించి జేమ్స్ తన 'అమెరికన్ కామన్వెల్త్'లో చెప్పిన కథ నుంచి మనం తెలుసుకోవచ్చు. జేమ్సు మాటల్లోనే చెప్పాలంటే ఆ కథ ఇలా వుంది. 'కొన్నేళ్ల క్రితం అమెరికన్ ప్రొటస్టంట్ ఎపిస్కోపల్ చర్చి 300 ఏళ్ల సమావేశం జరిగింది. ప్రార్థనలో కొన్ని అంశాలను మార్చాలని ఆ సమా వేశం నిర్ణయించింది. ప్రార్ధనలో ఒక వాక్యం చేర్చాలని న్యూ ఇంగ్లాండుకు చెందిన ప్రసిద్ధ క్రైస్తవ మత బోధకుడు ప్రతిపాదిం చగా సమావేశం ఆమోదించింది. ఆ వాక్యం "ఓ దేవుడా, మా జాతి(నేషన్)ని ఆశీర్వదించు". మరుసటిరోజు ఆ వాక్యాన్ని ప్రార్థనలో ప్రస్తావించినపుడు 'జాతి' అనే పదాన్ని భక్తులు తీవ్రంగా వ్యతిరేకించారు. అందువల్ల ఆ పదాన్ని తీసివేసి "ఓ దేవుడా, యునైటెడ్ స్టేట్స్‌ను ఆశీర్వదించు" అని ప్రార్థనా వాక్యాన్ని మార్చారు. ఆ సమయంలో అమెరికా ప్రజలు తామంతా ఒకే 'జాతి' అని అంగీకరించడానికి సిద్ధంగా లేరు. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా ప్రజలే తమను ఒక జాతిగా అంగీకరించడానికి సిద్ధంగా లేకపోతే, ఇక భారతదేశంలో ఆ పదాన్ని అంగీకరించడం ఇంకెంత కష్టమో ఒకసారి ఆలోచిం చండి. రాజకీయ స్పృహ కలిగిన భారతీయులు "భారత ప్రజ లు" అనే పదాన్ని నిరసించి "భారత జాతి" అనే పదాన్ని కోరు కున్న విషయం నాకు తెలుసు. మనమంతా ఒకే జాతి అని భావించడం ద్వారా మనం ఒక పెద్ద భ్రమలో వున్నాం. వేల కులాలుగా విభజనకు గురైన ప్రజలు ఒకే జాతిగా ఎలా మన గలరు? సామాజికంగా, మానసికపరంగా మనమింకా ఒకే జాతిగా మారలేదన్న వాస్తవాన్ని మనం ఎంత తొందరగా గుర్తిస్తే అంత మంచిది. అప్పుడే మనం ఒక జాతిగా రూపొందాలన్న స్పృహ కలిగి ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెడతాం. కానీ, యునైటెడ్ స్టేట్స్ కంటే కూడా మన దేశంలో ఈ వాస్తవాన్ని గుర్తించడం చాలా కష్టం. అమెరికాలో కులం లేదు. ఇండియాలో కులాలున్నా కులాలు జాతి వ్యతిరేకం. ఎందుకంటే మొదటగా అవి సామాజిక జీవితంలో విడివిడిగా వుండేందుకు ప్రజలను ప్రోత్సహిస్తాయి. రుణాలు జాతి వ్యతి రేకం, ఎందుకంటే అవి అసూయనూ, పరస్పర విద్వేషాన్నీ కలిగి స్తాయి. మనం ఒక వాస్తవ జాతిగా, రూపొందాలంటే మనం ఈ అడ్డంకుల్ని అధిగమించాలి. ఒక జాతి ఏర్పడినపుడే సౌభ్రాతృ త్వం సాధ్యమౌతుంది. సౌభ్రాతృత్వం లేని స్వేచ్ఛ, సమానత్వం గోడకు వేసిన సున్నంలాంటివి. మనముందు భవిష్యత్‌లో మనకెదురయ్యే సవాళ్లివి. ఈ విషయాలు చాలా మందికి రుచిం చకపోవచ్చు. ఈ దేశంలో రాజకీయాధికారం చాలా కాలంగా అల్పజనుల గుత్తాధికారంగా వుండి, బహుజనులను బరువులు



**రాజ్యాంగ ముసాయిదా ప్రతిని డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాద్‌కు అందజేస్తున్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్**

మోసే పశువుల్లా చూసింది. వారిని వధించింది. ఈ గుత్తాధిపత్యం బహుజనుల అభివృద్ధి అవకాశాలను దెబ్బ తీయటమే కాక వారి జీవితాన్ని, జీవనసారాన్నీ పిండి పీల్చి పిప్పి చేసింది. ఈ పీడిత వర్గాలు పాలితులుగా వుండి అలిసిపోయారు. వారు తమను తామే పాలించుకోవాలన్న ఆతృతతో వున్నారు. పీడిత వర్గ ప్రజల్లో వస్తున్న ఈ స్వీయ స్పృహ వర్గ పోరాటం లేదా వర్గ యుద్ధానికి దారి తీయకముందే మనం మేల్కోవాలి. అటువంటి ఒకరోజు వచ్చినవాడు మహా ప్రళయం సంభ విస్తుంది. అబ్రహాం లింకన్ చెప్పినట్టు చీలిపోయిన ఏ ఇల్లూ (సభ) మనజాలదు. ఎక్కువ కాలం నిలబడలేదు. అందువల్ల పీడితవర్గ ప్రజల ఆకాంక్షలను ఎంత త్వరగా మనం గుర్తించగ లిగితే ఈ దేశానికి, దేశ స్వాతంత్రానికి, ప్రజాస్వామ్య వ్యవస్థకు అంత మంచిది. సమస్త జీవన రంగాల్లో సమానత్వం, సౌభ్రా తృత్వం సాధించినప్పుడు అది సాధ్యం. అందువల్లే నేను స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం గురించి నొక్కి చెబుతున్నాను. స్వాతంత్ర్యం సంతోషకరమే. కానీ ఈ స్వాతంత్రం మనపై అనేక బాధ్యతలుంచింది. ఇక ఇప్పటి నుంచీ జరిగే తప్పులకు మనం బ్రిటీషువారిని బాధ్యులు చేసి నిందించలేం. ఇప్పటి నుంచి జరిగే తప్పులకు మనమే బాధ్యులమౌతాం. తప్పు పరిస్థితులు ఏర్పడే పెద్ద ప్రమాదం పొంచివుంది. కాలం వేగంగా మారు తోంది. మన ప్రజలు వినూత్న భావజాలాలతో కదులుతున్నారు. ప్రజల చేత ప్రభుత్వంతో ప్రజలు విసిగిపోయారు. ప్రజల కొరకు ప్రభుత్వం కావాలంటున్నారు. ప్రజల చేత, ప్రజల వలన ప్రభుత్వం అనే అంశాల గురించి వారికంత ఆసక్తిలేదు. ప్రజలు ప్రజల చేత ప్రభుత్వం బదులు ప్రజల కొరకు ప్రభుత్వం కోరుకుంటారు. రాజ్యాంగ ముసాయిదా ప్రతిని ప్రజల చేత, ప్రజల కొరకు, జల వలన ప్రభుత్వం అనే రాజ్యాంగంలో మనం. రాజ్యాంగాన్ని కాపాడాలంటే మన మార్గంలో ఎదురయ్యే దుష్ట శక్తులను గుర్తించాలి. అలా చేయడమే దేశ సేవ. ఇంతకంటే వేరు మార్గం లేదు. ❑

**(దుర్గం సుబ్బారావు, కొమ్ముపాల శ్రీనివాస్ సంపాదకత్వంలో వెలువడిన వ్యాసాల సంకలనం నుంచి..)**

# రాజ్యాంగ రచన - ముఖ్యాంశాలు

1946లో క్యాబినెట్ మిషన్ ప్లాన్ ద్వారా మొట్ట మొదటిసారిగా రాజ్యాంగ పరిషత్‌కు 1946లో ఎన్నికలు జరిగాయి. రాజ్యాంగ పరిషత్‌లో మొత్తం సభ్యుల సంఖ్య 389. వీరిలో 292 మంది రాష్ట్రాల నుంచి, 93 మంది సంస్థానాల నుంచి, నలుగురు చీఫ్ కమిషనర్ ప్రావిన్సెస్ ఆఫ్ ఢిల్లీ, అజ్మీర్, కూర్గ్, బ్రిటిష్ బలోచిస్తాన్ నుంచి ఎన్నికయ్యారు. ఆగస్టులో ఎన్నికలు పూర్తయ్యి కాంగ్రెస్ 208 స్థానాలను, ముస్లిం లీగ్ 73 స్థానాలు గెలుచుకున్నాయి. తర్వాత కాంగ్రెస్‌తో విభేదించి ముస్లిం లీగ్ తప్పుకుని పాకిస్తాన్‌కు వేరే పరిషత్‌ని మౌంట్ బాటన్ ప్లాన్ ప్రకారం జూన్ 3న స్థాపించారు. అలా విడిపోయిన తర్వాత భారత రాజ్యాంగ పరిషత్‌లో 299 స్థానాలు ఉన్నాయి. రాజ్యాంగ పరిషత్ తొలి సమావేశం 1946 డిసెంబరు 9న జరిగింది. రాజ్యాంగ పరిషత్‌కు తాత్కాలిక స్పీకర్‌గా సచ్చిదానంద సిన్హా వ్యవహరించారు. 1946 డిసెంబరు 11న జరిగిన సమావేశంలో డాక్టర్ బాబు రాజేంద్ర ప్రసాద్‌ను రాజ్యాంగ పరిషత్ శాశ్వత అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అంతర్జాతీయంగా పేరొందిన న్యాయవాది బెనగల్ నర్సింగరావును రాజ్యాంగ పరిషత్ ముఖ్య సలహాదారుగా నియమించారు. తొలి రాజ్యాంగ ముసాయిదాను ఆయనే రాశారు. 1946 డిసెంబర్ 13న జవహర్‌లాల్ నెహ్రూ చారిత్రాత్మక 'లక్ష్యాల తీర్మానాన్ని(ఆబ్జెక్టివ్ రెజల్యూషన్)' రాజ్యాంగ పరిషత్‌లో ప్రవేశపెట్టారు. భారతదేశాన్ని ఒక సార్వభౌమాధికార, స్వతంత్ర, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా రూపొందించ మని రాజ్యాంగ పరిషత్‌కు విన్నవించారు. నెహ్రూ ప్రవేశపెట్టిన లక్ష్యాల తీర్మానం రాజ్యాంగ తత్వానికి, ఆదర్శాలకు, లక్ష్యాలకు మూలం. ఇది ప్రవేశికకు ప్రధాన ఆధారం. రాజ్యాంగ పరిషత్ రాజ్యాంగ రచనకు 22 కమిటీలను నియమించింది. ఈ కమిటీల్లో అత్యంత ముఖ్యమైంది రాజ్యాంగ రచనా కమిటీ (డ్రాఫ్టింగ్ కమిటీ). ఇది 1947 ఆగస్టు 29న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అధ్యక్షతన ఆరుగురు సభ్యులతో ఏర్పాటైంది. అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, ఎన్.గోపాల స్వామి అయ్యంగార్, సయ్యద్ సాదుల్లా, డాక్టర్ కె.ఎం.మున్షీ, బి.ఎల్.మిత్తర్, డి.పి. ఖైతాన్ సభ్యులు. తర్వాత మరో సభ్యుడిగా ఎన్.మాధవ రావును కమిటీలోకి నామినేట్ చేశారు. డి.పి.ఖైతాన్ మరణంతో ఏర్పడిన ఖాళీని టి.టి.కృష్ణ మాచారితో భర్తీ చేశారు.




డ్రాఫ్టింగ్ కమిటీ మొదటి సమావేశం 1947 ఆగస్టు 30న జరిగింది. ముసాయిదా కమిటీ రెండు డ్రాఫ్ట్‌లను తయారు చేసింది. రాజ్యాంగ ముసాయిదాను 1948 ఫిబ్రవరి 21న ప్రచురించారు. ఈ రాజ్యాంగ ప్రతిపై 7,635 సవరణలు ప్రతిపా దించగా, 2,473 సవరణలు ఆమోదం పొందాయి. రాజ్యాంగ పరిషత్ ఈ ముసాయిదాను 114 రోజులు పరిశీలించి 1949 నవంబర్ 26న ఆమోదించింది. మొత్తం మీద రాజ్యాంగ రచనకు 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు పట్టింది. భారత రాజ్యాంగం 1950 జనవరి 26వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది.

**రాజ్యాంగం అనేది ప్రతి దేశంలో అత్యున్నత చట్టం. మన దేశంలో కూడా రాజ్యాంగం అత్యున్నత చట్టం. రాజ్యాంగం ద్వారానే రాజ్యంలో శాసనవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయ వ్యవస్థలకు అధికారాలు సంక్రమిస్తాయి. ప్రజలకు సైతం వారి ప్రాథమిక హక్కులు, స్వేచ్ఛలు రాజ్యాంగం ద్వారానే లభిస్తాయి. అందుకే రాజ్యాంగాన్ని దేశ భవిష్యత్ విధాతగా పేర్కొంటారు. భారత రాజ్యాంగాన్ని రూపొందించడానికి 1946 నుంచి 1949 వరకు దాదాపు 60కి పైగా సమావేశాలు జరిగాయి. వాటిలో రాజ్యాంగానికి సంబంధించి రాజ్యాంగ పరిషత్ సభ్యులు, ముసాయిదా కమిటీ సభ్యులు**

తమ అభిప్రాయాలను వెల్లడించారు.

**ఆమోదానికి మూడు పఠనాలు**

- 1948 నవంబర్ 4న అంబేద్కర్ రాజ్యాంగం తుది ముసాయిదాను అధికారికంగా రాజ్యాంగ సభలో ప్రవేశపెట్టారు. సభ సభ్యులందరికీ దీని కాపీని అందించారు. దీన్నే రాజ్యాంగం ప్రథమ పఠనం అంటారు. అనంతరం, రాజ్యాంగ సభ సభ్యులు అందించిన సలహాలు, సూచనలతో రాజ్యాంగాన్ని మరోసారి సవరించారు.
- 1948 నవంబర్ 15న ద్వితీయ పఠనం ప్రారంభమైంది. రాజ్యాంగం ముసాయిదాలోని ప్రతి ఆర్టికల్‌ను రాజ్యాంగ సభ కూలంకషంగా చర్చించింది. ఈ ప్రక్రియ 1949 అక్టోబర్ 17వ తేదీ వరకు కొనసాగింది. డ్రాఫ్టింగ్ కమిటీ రాజ్యాంగం ముసాయిదాను మళ్లీ రివైజ్ చేసింది.
- చివరిగా, 1949 నవంబర్ 14న తిరిగి రాజ్యాంగ సభలో ముసాయిదాను ప్రవేశపెట్టారు. దీన్ని తృతీయ పఠనం అంటారు. ఈ ముసాయిదాను సభలో ప్రవేశపెట్టినప్పుడు అంబేద్కర్ ప్రసంగిస్తూ, "అసెంబ్లీ ద్వారా నిర్ణయించిన ఈ రాజ్యాంగాన్ని ఆమోదించాలి" అని ప్రతిపాదించారు.



- ఈ ప్రతిపాదనను రాజ్యాంగ సభ సభ్యులు అంగీకరించారు. ఎట్టకేలకు 1949 నవంబర్ 26న రాజ్యాంగం ఆమోదం పొందింది. రాజ్యాంగ సభ సభ్యులు అందరూ దీనిపై సంతకాలు చేశారు.
- రాజ్యాంగ సభలో ఎక్కువ చర్చలు డ్రాఫ్టింగ్ కమిటీ రూపొందించిన రాజ్యాంగం ముసాయిదాలపైనే జరిగాయి.
- రాజ్యంగ సభ నిర్వహించిన 166 సమావేశాల్లో 114 రాజ్యాంగం ముసాయిదాలపై జరిగినవే.

## రాజ్యాంగ పీఠిక.. పూర్తి పాఠం

**"భారత ప్రజలమైన మేము, భారతదేశాన్ని సర్వసత్తాక సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా నిర్మించుకోవడానికి, పౌరులందరికీ : సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని, ఆలోచన, భావప్రకటన, విశ్వాసం, ధర్మం, ఆరాధనల స్వాతంత్ర్యాన్ని, అంతస్తుల్లోనూ, అవకాశాల్లోనూ, సమానత్వాన్ని చేకూర్చడానికి, వారందరిలో వ్యక్తిత్వ గౌరవాన్ని, జాతీయ సమైక్యతను సంరక్షిస్తూ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడానికి మన ఈ రాజ్యాంగ పరిషత్‌లో 1949, నవంబర్ 26వ తేదీన ఎంపిక చేసుకొని, శాసనంగా రూపొందించుకున్న ఈ రాజ్యాంగాన్ని మాకు మేము సమర్పించుకుంటున్నాము".**

## రాజ్యాంగ పీఠిక - పద పరిచయం

- **సార్వభౌమ (సర్వసత్తాక):** భారతదేశం ఒక సర్వసత్తాక దేశం అనగా దేశంలోని అన్ని వ్యవహారాలను రాజ్యాంగాని కి లోబడి మనమే నిర్వహించుకోవడం. బయటి వారెవరూ దేశ వ్యవహారాలను నిర్దేశించలేరు.
- **సామ్యవాద** : ఈ పదం 42వ రాజ్యాంగ సవరణలో చేర్చినప్పటికీ, రాజ్యాంగంలోని కొన్ని ఆదేశిక సూత్రాలలో సామ్యవాద భావాలు వున్నాయి. సామ్యవాద దేశంలో సంపదలో ప్రజలకు తగిన భాగస్వామ్యం వుండాలి. అతి కొద్ది మంది చేతుల్లో డబ్బు, పరపతి, సంపద ఉండిపో కూడదు. భూమి, పరిశ్రమలు, పెట్టుబడులపై ప్రభుత్వం నియంత్రణ చేస్తూ అందరికీ హక్కు ఉండేలా చూడాలి.
- **లౌకికతత్వం** : లౌకిక దేశమనగా ప్రజలకు, ప్రభుత్వానికి గల సంబంధం కేవలం రాజ్యాంగం, చట్టం, న్యాయం ద్వారా ఉండాలి. 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ పదం పీఠికలోకి చేర్చబడింది. ప్రజల మతాల ఆధారంగా ఎక్కువ తక్కువలు ఉండవు. అన్ని మతాలు సమానంగా గౌరవించబడతాయి. దేశానికి అధికార మతమంటూ ఏదీ లేదు. పౌరులందరూ వారికి ఇష్టమున్న మతాన్ని ఆచరించుకోవచ్చును.
- **ప్రజాస్వామ్యం** : భారతదేశంలో ప్రజలే ప్రభువులు (దేశానికి స్వాములు). అందువలన భారతదేశం ఒక ప్రజాస్వా

మ్య దేశం. ప్రజలే పాలకులను ఎన్నికల విధానం ద్వారా ఎన్నుకుంటారు. ఒక వ్యక్తి – ఒక ఓటు అనే సిద్ధాంతంపై భారత ప్రజాస్వామ్యం ఆధారపడింది. ప్రజాస్వామ్యం కేవలం రాజకీయ పరంగానే కాకుండా సామాజిక, ఆర్థికపరంగా కూడా అన్వయించుకోవాలి.

- **గణతంత్రం** : గణతంత్ర ప్రభుత్వంలో, పాలకులను ప్రజలే ఎన్నుకుంటారు, వారసత్వ రాచరికంగానో, నియంత నియం త్రణలోనో ఉండదు. ఒక పరిమిత కాలం వరకు ప్రజల ద్వారా నేరుగా గానీ, పరోక్షంగా గానీ, దేశాధినేత ఎన్నుకోబడతాడు.
- **న్యాయం** : భారతదేశం తన పౌరులకు సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందించాలి.

(i) **సామాజిక న్యాయం** : సామాజిక న్యాయమనగా సమాజంలో ఎలాంటి ఉన్నతి తరగతి వర్గాలు ఉండకపోవటమే. కుల, సంప్రదాయ, మత, వర్ణ, లింగ, స్థాన భేదాల ఆధారంగా ఎవరినీ ఎక్కువ తక్కువ చేసి చూడకూడదు. సమాజంలోని అన్ని రకాల వివక్షలను నిర్మూలించడమే భారతదేశ లక్ష్యం.

(ii) **ఆర్థిక న్యాయం:** ఆర్థిక న్యాయమనగా జీతం, ఆస్తులు, ఆర్థిక హోదా ఆధారంగా స్త్రీ, పురుషుల మధ్య ఎలాంటి వ్యత్యా సాన్ని చూపకపోవడం. ఆర్థిక వనరులను వికేంద్రీకరిస్తూ, ఆర్థి కంగా బాగుపడేందుకు అందరికీ సమాన అవకాశాలను అంది వ్వడమే భారత ప్రభుత్వ లక్ష్యం. తద్వారా అందరికీ గౌరవంగా జీవనోపాధి సంపాదించుకునేందుకు అవకాశాలు ఇవ్వాలి.

(iii) **రాజకీయ న్యాయం** : రాజకీయ న్యాయమనగా సమానంగా, స్వేచ్ఛగా, న్యాయంగా అవకాశాలు ప్రజలకు కల్పిస్తూ వారిని రాజకీయాలలో పాల్గొనేలా చేయడం. ఎలాంటి పక్షపాతం లేకుండా అందరికీ సమానంగా రాజకీయ హక్కులు ప్రదానం చేయటమే లక్ష్యం.

- **స్వేచ్ఛ** : ఆలోచనలో, భావ ప్రకటనలో, విశ్వాసంలో, ఆరాధనలో ప్రతి పౌరుడికి స్వేచ్ఛ ఉంటుంది.
- **సమానత్వం** : ప్రజాస్వామ్యంలో అతి ముఖ్య ఆదర్శం సమానత్వం. అంటే అన్ని రకాల అసమానతలను, వివక్షలను రద్దు చేసి, ప్రతి వ్యక్తి వికాసానికి అవసరమైన అవకాశాలను కల్పించాలి.
- **సోదరభావం** : వైవిధ్యంగల దేశంలో ప్రజలు కుల, మత, ప్రాంతీయ భాషా ద్వేషం లేకుండా సోదరభావాన్ని పెంపొందించుకుని దేశ సమైక్యత సమగ్రతలను కాపాడుకోవాలి.

# రాజ్యాంగం-ప్రాథమిక హక్కులు

ప్రాథమిక హక్కులు, పౌరులకు తమ వ్యక్తిత్వాన్ని అభివృద్ధి పరచుకొనుటకు, బాధ్యతగలిగిన పౌరులుగా హుందాగా జీవించుటకు, ప్రభుత్వపరంగా, చట్టరీత్యా ఇవ్వబడిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు. ఇక్కడ ప్రభుత్వమనగా, భారత దేశంలో అధికారం గల అన్ని రంగాలు. వీటిలో భారత ప్రభుత్వం, పార్లమెంటు, భారతదేశంలోని రాష్ట్రాలూ, రాష్ట్రాలలో గల, జిల్లా పరిషత్తులూ, కార్పొరేషన్లు, పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీలు వగైరా.

- **సమానత్వపు హక్కు** : సమానత్వపు హక్కు, రాజ్యాంగం అధికరణలు 14, 15, 16, 17, 18ల ప్రకారం ప్రసాదించబడింది. ఈ హక్కు చాలా ప్రధానమైనది, స్వేచ్ఛా సమానత్వాలు ప్రసాదించే ఈ హక్కు క్రింది విషయాలకు గ్యారంటీనిస్తుంది..
- **చట్టం ముందు సమానత్వం** : రాజ్యాంగ అధికరణ (ఆర్టికల్) 14 ప్రకారం, భారత భూభాగంలో ఉన్న వ్యక్తులందరూ సమానంగా, భారత చట్టాల ప్రకారం కాపాడబడాలి. అనగా ప్రభుత్వం వ్యక్తుల పట్ల కుల, మత, వర్గ, వర్ణ, లింగ, పుట్టినప్రదేశాల ఆధారంగా ఎలాంటి వివక్ష చూపరాదు.
- **పౌరప్రదేశాలలో సామాజిక సమానత్వం, సమాన ప్రవేశాలు** : అధికరణ 15 ప్రకారం, పౌరులు పౌర (పబ్లిక్) ప్రదేశాలయిన, పార్కులు, మ్యూజియంలు, బావులు, స్నాన ఘాట్‌లు, దేవాలయాలు మొదలగు చోట్ల ప్రవేశించుటకు సమాన హక్కులు కలిగి ఉన్నారు. ప్రభుత్వాలు పౌరుల పట్ల ఎలాంటి వివక్ష చూపరాదు. కానీ, కొన్ని సందర్భాలలో ప్రభుత్వం స్త్రీలకు, పిల్లలకు ప్రత్యేక వసతులు కల్పించవచ్చు. అలాగే సామాజికంగా వెనుకబడిన వారికి ప్రత్యేక సదుపాయాలు, ప్రభుత్వాలు కలుగజేయవచ్చు.
- **పౌర ఉద్యోగాల విషయాలలో సమానత్వం** : అధికరణ 16 ప్రకారం, ఉద్యోగాలు పొందేందుకు, ప్రభుత్వాలు పౌరులందరికీ సమాన అవకాశాలు, హక్కులు కల్పించవలెను. ప్రభుత్వాలు, పౌరులకు ఎలాంటి వివక్షలూ చూపరాదు. 2003 'పౌర (సవరణ) బిల్లు' ప్రకారం, ఈ హక్కు, ఇతర దేశాల పౌరసత్వాలు పొందిన భారతీయులకు వర్తించదు.
- **అంటరానితనం నిషేధాలు** : అధికరణ 17 ప్రకారం, అంటరానితనాన్ని ఎవరైనా అవలంబిస్తూ వుంటే చట్ట ప్రకారం శిక్షార్హులు. అంటరానితనం నేర చట్టం (1955),

1976లో పౌరహక్కుల పరిరక్షణ చట్టం పేరు మార్పు పొందింది.

- **బిరుదుల నిషేధాలు** : అధికరణ 18 ప్రకారం, భారత పౌరులు, ఎలాంటి బిరుదులూ పొందరాదు. ఇతర దేశాల నుంచి కూడా ఎలాంటి బిరుదులు పొందరాదు. ఉదాహరణకు బ్రిటిష్ ప్రభుత్వం, రాయ్ బహాదుర్, ఖాన్ బహాదుర్ వంటి, "ప్రభుత్వ లేక రాజ్య సంబంధ బిరుదులు", సైన్య పరమైన బిరుదులూ ప్రకటించేది. ఇలాంటివి నిషేధం. కానీ విద్య, సంస్కృతి, కళలు, శాస్త్రాలు మొదలగు వాటి బిరుదులు ప్రసాదించనూ వచ్చు, పొందనూ వచ్చు. భారతరత్న, పద్మవిభూషణ్ లాంటి వాటిని పొందినవారు, వీటిన తమ "గౌరవాలు" గా పరిగణించవచ్చు గాని, 'బిరుదులు'గా పరగణించ రాదు. 1995 డిసెంబరు 15న సుప్రీంకోర్టు, ఇలాంటి బిరుదుల విలువలను నిలుపుదల చేసింది.
- **స్వాతంత్ర్యపు హక్కు** : భారత రాజ్యాంగము, తన అధికరణలు 19, 20, 21, 22ల ద్వారా స్వాతంత్ర్యపు హక్కును ఇస్తున్నది. ఇది వైయుక్తిక హక్కు. ప్రతి పౌరుడూ ఈ హక్కును కలిగి వుండడం, రాజ్యాంగ రచనకర్తల అసలు అభిలాష. అధికరణ 19, క్రింది ఆరు స్వేచ్ఛలను పౌరులకు ఇస్తున్నది.

(i) వాక్-స్వాతంత్ర్యపు హక్కు, భావవ్యక్తీకరణ స్వాతంత్ర్యం.


(ii) సమావేశాలకు స్వేచ్ఛ, ఈ సమావేశాలు శాంతియుతం గా, ఆయుధాలు కలిగి వుండరాదు. దేశం, ప్రజా శ్రేయస్సులను దృష్టిలో వుంచుకుని, ప్రభుత్వాలు వీటి అనుమతులు నియంత్రించనూవచ్చు.

(ii) సంస్థలు, సొసైటీలు స్థాపించే హక్కు. దేశ, ప్రజా శ్రేయస్సుల దృష్ట్యా ప్రభుత్వం వీటిని నియంత్రించనూ వచ్చు లేదా నిషేధించనూ వచ్చు.

(iv) భారత పౌరుడు, భారతదేశం అంతర్భాగంలో ఏ ప్రాంతంలోనైనా పర్యటించవచ్చు. కొన్నిసార్లు ప్రభుత్వం ప్రజా శ్రేయస్సు దృష్ట్యా అంటు రోగం గల సమయాలలో వాటిని అరికట్టే ప్రయత్నాలలో, పౌరుల ప్రయాణాలను నిషేధించవచ్చు.

(v) భారత అంతర్భాగంలో ఏ ప్రదేశంలోనైనా, పౌరులు, నివాసాన్ని ఏర్పరచుకోవచ్చు. కానీ, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్ తెగల పరిరక్షణ దృష్ట్యా, ప్రభుత్వం కొన్ని నియంత్రణలు చేయవచ్చును.

(vi) భారతదేశంలోని ఏ ప్రాంతంలోనైనా, పౌరులు వ్యాపారాలు, వర్తకాలూ, ఉద్యోగాలూ చేపట్టవచ్చును. కానీ, నేరాలు గల వ్యాపారాలు, చీకటి వ్యాపారాలు, నీతి బాహ్య వ్యాపారాలు చేపట్టరాదు.



(vi) ఏ వ్యక్తిని అక్రమంగా నిర్బంధించకూడదు. అక్రమ నిర్బంధం నుంచి వ్యక్తి స్వేచ్ఛ స్వాతంత్ర్యాలకు రక్షణ కల్పించడం కోసం 20వ అధికరణ ఉద్దేశించబడినది.

(viii) ప్రాణాలు కాపాడుకోవడం వ్యక్తిగత స్వేచ్ఛ క్రిందనే పరిగణింపబడుతుంది. అధికరణ 21 ప్రకారం, ఏ పౌరుడూ తన స్వేచ్ఛనూ, జీవితాన్ని కోల్పోయే హక్కు కలిగిలేదు, చట్టాన్ని తప్పించి.

(ix) 22వ అధికరణ నిర్బంధ నివారణ చట్టం. అధికరణ ప్రకారం ఏ ఒక్క వ్యక్తిని కారణం లేకుండా నిర్బంధంలోకి తీసుకొనరాదు. నిర్బంధంలోకి తీసుకున్న 24 గంటల్లోపు సమీప న్యాయమూర్తి ఎదుట హాజరు పరచాలి.

- **దోపిడిని నివారించే హక్కు** : బాలకార్మికుడు, 'స్వేచ్ఛా రహిత కార్మికులు' (కట్టు బానిసలు) గల విధానం నిషేధం. The right against exploitation అధికర ణలు 23, 24ల ప్రకారం, కట్టు బానిసత్వం, బాలకార్మిక విధానాలు నిషేధం. 14 ఏళ్లకు లోబడి గల బాలబాలికలకు అపాయకరమైన పనులు (కర్మాగారాలలో, గనులలో) చేయించుట నిషేధం. బాలకార్మిక విధానం, రాజ్యాంగ ఊపిరికే విఘాతం వంటిది. కట్టు బానిసత్వం, విధానంలో భూస్వాములు లేదా పెత్తందార్లు, మానవ హక్కులకు విఘాతాలు కలుగజేసేవారు. మానవులను కట్టు బానిసలుగా ఉంచుకుని, తరతరాల స్వాతంత్ర్యాన్ని హరించివేసేవారు. ఈ దురాగతాన్ని మాన్పించడానికే ఈ హక్కు కల్పించబ డింది. మానవులకు 'బానిస వర్తకాలు', 'వ్యభిచారం' లాంటి అశ్లీల వృత్తులయందు బలవంతంగా ప్రవేశించేలా చేయు వారికి చట్టప్రకారం కఠిన శిక్షలున్నాయి. కానీ కొన్ని అత్యవసర సమయాలలో ప్రభుత్వాలు, జీతభత్యాలు లేని ఉద్యోగాలు, తప్పనిసరి సైనిక భర్తీలను చేపట్టుట వంటి వాటిని, ప్రత్యేక పరిస్థితులలో అనుమతించవచ్చును.
- **మత స్వాతంత్రపు హక్కు** : భారతదేశంలో పౌరులందరికీ మత స్వాతంత్ర్యపు హక్కును, అధికరణలు

(ఆర్టికల్స్) 25, 26, 27, 28ల ప్రకారం ఇవ్వబడింది. ఈ స్వేచ్ఛా స్వాతం త్ర్యం సెక్యులరిజం సూత్రాలను స్థాపించుటకు ఉద్దేశించి నవి. భారత రాజ్యాంగం ప్రకారం, భారతదేశంలోని అన్ని మతాలు సమానమే. ఏ మతమూ ఇతర మతంపై ప్రాధాన్య తను కలిగి లేదు. ప్రతి పౌరుడు తన ఇష్టానుసారం మతాన్ని అవలంబించుటకు స్వేచ్ఛ కల్పింపబడ్డాడు. పౌరులు తమ మతాల గూర్చి ఉపన్యసించవచ్చు. అవలంబించవచ్చు. మత వ్యాప్తి కోసం పాటుపడవచ్చు. అలాగే, మతపరమైన సంప్ర దాయాలను ఉదాహరణకు సిక్కులు కిర్పాన్‌లను తమ ఉద్యో గాలు చేయు సమయాన ధరించడానికి, ప్రజల శ్రేయస్సును, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టించడానికి నిరోధించవచ్చు.

- ధార్మిక సంస్థలు, ప్రజోపయోగ స్వచ్ఛంద సంస్థలను స్థాపించుకొనవచ్చు. ఇతరత్రా, మత సంబంధం కాని కార్యకలాపాలను, ప్రభుత్వం నిర్దేశించిన చట్టాల ప్రకారం చేపట్టవచ్చు. చారిటబుల్ సంస్థలను ప్రజాపయోగం, సుహృద్భావన, నియమాలను పురస్కరించుకొని, తమ కార్యకలాపాలు చేయునట్లుగా ప్రభుత్వం నిర్దేశించవచ్చును. మతపరమైన కార్యకలాపాలకు ఎలాంటి పన్నులను విధించగూడదు, నిర్దేశించగూడదు. ప్రభుత్వాలు నడిపే విద్యా సంస్థలలో, ప్రత్యేక మతాన్ని రుద్దే బోధనలు చేపట్టకూడదు. అలాగే, ఈ ఆర్టికల్స్‌లోని విషయాలు, ప్రభుత్వాలు చేపట్టే ప్రజోపయోగ కార్యక్రమాలపై ఎలాంటి విఘాతాలు కలిగించగూడదు. ప్రభుత్వాలు చేపట్టే ప్రజల ఆర్థిక, సామాజిక, రాజకీయ విషయాలలో, ధార్మిక సంస్థల కార్యకలాపాలు అడ్డంకులుగా వుండరాదు.

(i) 25వ అధికరణ ప్రకారం ప్రతి వ్యక్తి తనకు నచ్చిన మతాన్ని స్వీకరించవచ్చు.

(ii) 26వ అధికరణ ప్రకారం మత అభివృద్ధికి అవసరమైన ధార్మిక సంస్థలను స్థాపించుకోవచ్చు.

(iii) 27వ అధికరణ ప్రకారం మతపరంగా ఏ వ్యక్తి పైన ఏ విధమైన పన్నులు విధించరాదు.

(iv) 28వ అధికరణ ప్రకారం ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే సంస్థల యందు మత ప్రబోధం చేయరాదు.

**సాంస్కృతిక, విద్యాహక్కులు**

- **భారత జాతీయపతాకం** : భారతదేశం, అనేక మతాలకు, భాషలకు, సంస్కృతులకు నిలయం. రాజ్యాంగం వీరికి కొన్ని ప్రత్యేక హక్కులను ఇస్తూంది. అధికరణ 29, 30ల ప్రకారం, మైనారిటీలకు కొన్ని హక్కులు ఇవ్వబడినవి. ఏ మైనారిటీలకు చెందిన వాడైననూ, ప్రభుత్వం వీరికి, ప్రభుత్వ, ప్రభుత్వ సహాయం పొందిన సంస్థలలో ప్రవేశానికి నిషేధించరాదు.
- మైనారిటీలు, అనగా మతం, భాష, సాంస్కృతిక పరమైన మైనారిటీలు, తమ మతాన్ని, భాషలనూ, సంస్కృతినీ రక్షిం చుకొనుటకు, మైనారిటీ సంస్థలు స్థాపించుకొనవ చ్చును. ఆ సంస్థలద్వారా వారు, తమ అభ్యున్నతికి పాటుపడవచ్చు. ఈ సంస్థలలో దుర్వినియోగాలు జరుగుతున్న సమయాన ప్రభుత్వాలు తమ ప్రమేయాలు కలుగజేసుకోవచ్చును.
- 29వ అధికరణ భారతదేశంలోని ప్రతి పౌరుడు తమ స్వీయ భాషను, లిపిని, సంస్కృతిని సంరక్షించుకోవచ్చు.
- 30వ అధికరణ దేశంలోని ఏ ప్రాంతం వారైనా తమ భాష, లిపి, సంస్కృతిని సంరక్షించుకోవడానికి అవసరమైన విద్యాసంస్థలను స్థాపించి నిర్వహించుకొనవచ్చు.
- **రాజ్యాంగ పరిహారపు హక్కు** : 32వ అధికరణ రాజ్యాంగ పరిహారపు హక్కు. ప్రాథమిక హక్కులకు ఏ పాటియైనా భంగం కలిగితే, రాజ్యాంగ పరిహారపు హక్కును కోరుతూ న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు. ఉదాహరణకు.. పౌరుడు, జైలు శిక్షను పొందితే, ఆ వ్యక్తి, న్యాయస్థానాలను ఆశ్రయించి, ఇది దేశ చట్టాలనుసారంగా వున్నదా లేదా అని ప్రశ్నించే హక్కును కలిగి ఉన్నాడు. ఒకవేళ, న్యాయస్థానం నుండి జవాబు "కాదు" అని వస్తే, ఆ వ్యక్తిని తక్షణమే విడుదల చేయవలసి వస్తుంది. పౌరుల హక్కులను వాటి సంరక్షణలను గూర్చి న్యాయస్థానాలను అడిగే విధానాలు కొన్ని ఉన్నాయి. న్యాయస్థానాలు కొన్ని దావాలను ప్రవేశపెట్టవచ్చు. ఆ దావాలు, హెబియస్ కార్పస్, మాండమస్, ప్రొహిబిషన్, కో వారంటో, సెర్టియోరారి. ఒక వేళ దేశంలో అత్యవసర పరిస్థితి ఏర్పడితే, ఈ హక్కులన్నీ యూనియన్ ప్రభుత్వంచే 'సస్పెండు' చేయబడుతాయి.
- **ఆస్తి హక్కు-ప్రాథమిక హక్కు** : భారత రాజ్యాంగం, ఆర్టికల్ 19, 31 వరకు గల విషయాలలో ఆస్తి హక్కును పౌరుల ప్రాథమిక హక్కుగా పరిగణించింది. ఆర్టికల్ 19, పౌరులందరికీ, ఆస్తులను సంపాదించడం, ఉంచుకొనడం, అమ్మడం వంటి హక్కులను కలుగజేసింది. ఆర్టికల్ 31 ప్రకారం.. 'పౌరులెవరూ తమ ఆస్తి హక్కును, ప్రభుత్వాల ద్వారా కోల్పోగూడదు'. ప్రభుత్వం ప్రజల అవసరాల రీత్యా పౌరుల ఆస్తిని గైకొన్న యెడల, ఆ ఆస్తిదారునికి 'కాంపెన్ జేషన్' చెల్లించవలెనని కూడా నొక్కి వక్కాణిస్తుంది. కానీ, భారత రాజ్యాంగం 44వ సవరణ ద్వారా, 1978లో ఈ ఆస్తి హక్కును, ప్రాథమిక హక్కుల జాబితా నుంచి తొలగిం చింది. ఓ క్రొత్త ఆర్టికల్ 300-ఏ, సృష్టింపబడింది. ఈ ఆర్టికల్ ప్రకారం "చట్టం ప్రకారం, పౌరుడు పొందిన ఆస్తిని, భంగం కలిగించరాదు". ఆస్తి హక్కు రాజ్యాంగ


పరమైన హక్కుగా పరిగణించబడుతున్ననూ, ప్రాథమిక హక్కు హోదాను కోల్పోయింది.

## రాజ్యాంగం - ప్రాథమిక విధులు

1976 భారత రాజ్యాంగ 42వ సవరణ ప్రకారం భారత దేశపు పౌరులకు ప్రాథమిక విధులు ఇవ్వబడినవి. అధికరణ 51-ఏ, ప్రకారం పది ప్రాథమిక విధులు ఇవ్వబడినవి. పౌరులకు ఇవ్వబడిన ఈ పది విధులు, వ్యక్తగత, పరిసరాల పట్ల, సమాజం పట్ల, దేశం పట్ల తమ విద్యుక్త ధర్మాన్ని తెలియ జేస్తాయి. 2002 భారత రాజ్యాంగ 86వ సవరణ ప్రకారం 11వ విధి ఇవ్వబడింది. ఈ విధి, "తండ్రి గాని, సంరక్షకుడు గాని, తమ బిడ్డలకు 6-14 వయస్సు వరకు విద్యా బోధన చేపట్టాలి" అని బోధిస్తుంది. పౌరులందరూ తమకు ఇవ్వబడిన విధులను గౌరవించి, దేశం పట్ల, సమాజం పట్ల, పరిసరాల పట్ల తమ వ్యక్తిగత బాధ్యతను గుర్తించి మసలుకోవలెను.

**అధికరణ 51-ఏ ప్రకారం ప్రాథమిక విధులు..**
**భారతదేశంలో ప్రతి పౌరునికి గల ప్రాథమిక విధులు**

- 1.భారత రాజ్యాంగాన్ని గౌరవించవలెను. రాజ్యాంగపు ఆదర్శాలను, సభలను, జాతీయ పతాకాన్ని, జాతీయ గీతాన్ని గౌరవించవలెను.
- 2.భారత స్వతంత్ర సంగ్రామంలో, ప్రోత్సహింపబడ్డ ఆదర్శాలను గౌరవించాలి.
- 3.భారతదేశపు సార్వభౌమత్వాన్ని, అఖండత్వాన్ని, ఏకత్వాన్ని గౌరవించి, పెంపొందింపవలెను.
- 4.అవసరం లేదా అవకాశం గలిగితే భారతదేశానికి సేవచేయుటకు ఎల్లవేళలా సిద్ధంగా వుండవలెను.
- 5. భారతదేశంలో, కుల, మత, వర్గ, లింగ, వర్ణ విభేదాలు లేకుండా ప్రజలందరినీ గౌరవించవలెను. సోదరభావాన్ని, సౌభ్రాతృత్వాన్నీ పెంపొందించవలెను. స్త్రీల యొక్క గౌరవ మర్యాదలను భంగపరిచే అమర్యాదకరమైన ఆచారాలను పద్ధతులను విడనాడాలి.
- 6. మన భారతదేశంలో గల మిశ్రమ సంస్కృతినీ, మిశ్రమ, అద్భుత వారసత్వాన్ని కాపాడుకొనవలెను.
- 7. ప్రకృతీ పరిసరాలైన అడవులను, సరస్సులను, నదులను, వన్య ప్రాణులను, ఇతర జీవులను సంరక్షించుకొనవలెను.
- 8.శాస్త్రీయ దృక్పథాన్ని, వైజ్ఞానిక విషయాలను పెంపొందించి జ్ఞానాభివృద్ధికి ఎల్లవేళలా పాటుపడాలి.
- 9.ప్రభుత్వ ఆస్తులను, ప్రజల ఆస్తులను కాపాడవలెను. హింసను విడనాడవలెను.
- 10.భారతదేశం అభివృద్ధి చెందునట్లు, వ్యక్తిగతంగా, సామాజికంగా లేదా మిశ్రమంగా పాటుపడుతూ, దేశ ఉజ్వల భవిష్యత్తును కాంక్షిస్తూ, దానిని సాధించుటకు కృషి చేయాలి.




- 11.6-14 సంవత్సరాల పిల్లలకి నిర్బంధ విద్యనందించాలి.

## రాజ్యాంగం - ఆదేశిక సూత్రాలు

- ఆర్టికల్ 36 నుండి 51 వరకు.. రాజ్యాంగంలో 4వ భాగంలో ఆదేశ సూత్రాలను వివరించబడింది.
- ఆర్టికల్ 36 : రాజ్యం గురించి నిర్వచిస్తుంది.
- ఆర్టికల్ 37 : వీటికి న్యాయ సంరక్షణ లేదు. కానీ ప్రభుత్వాలు చట్టం ద్వారా అమలు చేయవచ్చు.
- ఆదేశ సూత్రాలను 3 రకాలుగా విభజించవచ్చు. అవి :
  1.ఉదార వాద నియమాలు (44,49,50,51)
  2.గాంధేయ వాద నియమాలు (40,43,47,48)
  3.సామ్యవాద నియమాలు (38,39,41,43,46,42)

**ఉదారవాద నియమాలు**

- ఆర్టికల్ 44 : ఉమ్మడి పౌర స్మృతి (యూనిఫార్మ్ సివిల్ కోడ్), (గోవధ నిషేదం).
- ఆర్టికల్ 49 : ప్రాచీన వాస్తు శిల్ప సంపదను రక్షించాలి.
- ఆర్టికల్ 50 : ఎగ్జిక్యూటివ్ నుంచి జుడిషియల్ సిస్టమ్‌ను వేరు చేయాలి.
- ఆర్టికల్ 51: అంతర్జాతీయంగా శాంతిని పెంపొందించడం..

**గాంధేయవాద నియమాలు : (40,43,47,48):**

- ఆర్టికల్ 40 : గ్రామ పంచాయితీల ఏర్పాటు.
- 73వ సవరణ ద్వారా పంచాయతీరాజ్ వ్యవస్థ ఏర్పాటైంది. ఇందులో 29 అంశాలున్నాయి. గ్రామ స్వరాజ్యం రావాలని గాంధీజీ ఆకాంక్షించారు.
- ఆర్టికల్ 43: వ్యక్తిపరంగా లేదా సామాజికపరంగా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేయాలి.
- ఆర్టికల్ 47: ప్రజారోగ్యాన్ని పరిరక్షించే బాధ్యత ప్రభుత్వాలది. మత్తు పదార్థాలు, మద్య పానం నిషేదించాలి.

**(మిగతా 20వ పేజీలో)**

# రాజ్యాంగ రచనలో మహిళలు

భారతదేశానికి నూతన రాజ్యాంగం తయారు చేయడానికి 1946లో 389 సభ్యులతో భారత రాజ్యాంగ నిర్మాణ సంఘం (Constituent Assembly) ఏర్పడింది. దీనికి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ అధ్యక్షులయ్యారు. రాజ్యాంగ రచనకు భారత రాజ్యాంగ నిర్మాణ సంఘం అనేక కమిటీలుగా విడిపోయింది. ఆ కమిటీలలో ఒకటైన రాజ్యాంగ ముసాయిదా కమిటీ (Draft Committee) తయారుచేసిన రాజ్యాంగాన్ని 1949 నవంబరు 26న రాజ్యాంగ నిర్మాణ సంఘం (Constituent Assembly) ఆమోదించింది. నూతన భారత రాజ్యాంగం 1950 జనవరి 26 నుండి అమలులోకి వచ్చింది. రాజ్యాంగ పితామహుడిగా పిలువ బడిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నాయకత్వంలో ఏడుగురు మగ సభ్యులతో కూడిన రాజ్యాంగ ముసాయిదా కమిటీ (డ్రాఫ్ట్ కమిటీ) రాజ్యాంగాన్ని తయారుచేసినా, భారత రాజ్యాంగ రూప కల్పనకు విశేషంగా తోడ్పడిన రాజ్యాంగ నిర్మాణ సంఘం (Constituent Assembly) లోని పదిహేను మంది మహిళా సభ్యుల సహకారం మర్చిపోరాదు.

- **1. అమ్ము స్వామినాథన్**

అమ్ము స్వామినాథన్ కేరళలోని పాలఘాట్ జిల్లాలోని అన క్కారాలో ఒక ఉన్నత కుల హిందూ కుటుంబంలో జన్మించారు. ఆమె 1917లో ఉమెన్స్ ఇండియా అసోసియేషన్‌ను (Womens India Association) మద్రాసులో, అనిబిసెంట్, మార్గరెట్ కజిన్స్, మలాతీ పట్వర్ధన్, శ్రీమతి దాదాభాయ్, శ్రీ అంబుజామల్లతో కలిపి ఏర్పాటుచేశారు. ఆమె 1946లో మద్రాస్ నియోజకవర్గం నుంచి రాజ్యాంగ సభ నిర్మాణ సంఘానికి ఎన్నికయ్యారు. 1949 నవంబరు 24న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నాయకత్వంలో రూపొందించిన ముసాయిదా రాజ్యాంగ ఆమోదంపై చర్చ సందర్భంగా ప్రసంగంలో ఒక ఆశావహ మరియు విశ్వాసంతో కూడిన అమ్ము స్వామినాథన్ ఇలా అన్నారు. 'భారతదేశం తన మహిళలకు సమాన హక్కులు ఇవ్వలేదని భారతదేశం వెలుపల ప్రజలు పేర్కొన్నారు. భారతీయ ప్రజలు తమ రాజ్యాంగాన్ని రూపొందించినప్పుడు వారు దేశంలోని ప్రతి ఇతర పౌరులతో సమానంగా మహిళలకు హక్కులు ఇచ్చారని ఇప్పుడు మనం చెప్పవచ్చు' అని అన్నారు. ఆమె 1952లో లోక్‌సభకు, 1954లో రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1959లో అమ్ము స్వామినాథన్, సత్యజిత్ రే అధ్యక్షుడిగా వున్న 'ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీ' వైస్ ప్రెసిడెంట్ అయ్యారు. ఆమె భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్(1960-65) మరియు సెన్సార్ బోర్డులకు అధ్యక్షత వహించారు.



- **2.ద్రాక్షాయణి వేలాయూదన్**

ఈమె 1912 జూలై 4న కొచ్చిన్‌లోని బోల్గట్టి ద్వీపంలో జన్మించారు. ఆమె అణగారిన వర్గాల(డిప్రెస్స్ క్లాస్) నాయకురాలు. తీవ్ర వివక్షతకు గురైన పులాయ కమ్యూనిటీకి చెందిన ఆమె, ఆ కమ్యూనిటీలో విద్యనభ్యసించిన, ఆ కమ్యూనిటీలో పై వస్త్రం(బ్లౌస్) ధరించిన మొదటిమహిళ. 1945లో ఆమె కొచ్చిన్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు నామినేట్ అయ్యారు. 1946లో రాజ్యాంగ సభకు ఎన్నికైన మొదటి మరియు ఏకైక దళిత మహిళ. రాజ్యాంగ అసెంబ్లీ చర్చల్లో షెడ్యూల్డ్ కులానికి సంబంధించిన అనేక అంశాలపై ఆమె బీఆర్ అంబేద్కర్‌ను అనుసరించారు.

- **3.బేగం ఐజాజ్ రసూల్**

మాలెర్కోట రాజరిక కుటుంబంలో జన్మించిన ఆమె యువ భూస్వామి నవాబ్ ఐజాజ్ రసూల్‌ను పెళ్లి చేసుకున్నారు. ఆమె రాజ్యాంగ అసెంబ్లీకి చెందిన ఏకైక ముస్లిం మహిళ. 1935 భారత ప్రభుత్వం చట్టం అమలుతో రసూల్, ఆమె భర్త ముస్లిం లీగ్‌లో చేరి ఎన్నికల రాజకీయాలలో ప్రవేశించారు. 1937 ఎన్నికలలో, ఆమె U.P(యునైటెడ్ ప్రావిన్స్) శాసనసభకు ఎన్నికయ్యారు. 1950లో దేశంలో ముస్లిం లీగ్ రద్దు చేయడంతో ఆమె, రసూల్ కాంగ్రెస్‌లో చేరారు. ఆమె 1952లో రాజ్యసభకు ఎన్నికయ్యారు. 1969 నుంచి 1990 వరకు ఉత్తంప్రదేశ్ శాసనసభ్యురాలుగా ఉన్నారు. 1969, 1971 మధ్య సోషల్ వెల్ఫేర్ మరియు మైనారిటీల మంత్రిగా పనిచేశారు.

ఆమె చేసిన సాంఘిక కృషికి 2000లో ఆమె పద్మభూషణ్ పురస్కారం అందుకుంది.

## • 4.దుర్గాబాయి దేశ్‌ముఖ్

దుర్గాబాయి దేశ్‌ముఖ్ 1909 జూలై 15న రాజమండ్రిలో జన్మించారు. 12 ఏళ్ల వయసులో ఆమె ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంగారితో కలిసి నాన్ కో ఆపరేషన్ ఉద్యమంలోను, 1930 మేలో మద్రాస్ నగరంలో ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలోను పాల్గొన్నారు. 1936లో ఆంధ్రప్రదేశ్ మహిళా సభను స్థాపించారు. తర్వాత ఒక దశాబ్దంలో అది మద్రాసు నగరంలో విద్య మరియు సామాజిక సంక్షేమ రంగాలలో గొప్ప సంస్థగా అవతరించింది. సెంట్రల్ సోషల్ వెల్ఫేర్ బోర్డ్, నేషనల్ కౌన్సిల్ ఫర్ వుమెన్స్ ఎడ్యుకేషన్ మరియు నేషనల్ కమిటీ ఆన్ గర్ల్స్ అండ్ వుమెన్స్ ఎడ్యుకేషన్ వంటి అనేక కేంద్ర సంస్థలలో ఆమె చైర్-పర్సన్‌గా పనిచేశారు. ఆమె పార్లమెంటు సభ్యురాలితోపాటు కేంద్ర ప్రణాళికా సంఘం సభ్యురాలు. ఆమె ఆంధ్ర ఎడ్యుకేషనల్ సొసైటీ, న్యూఢిల్లీతో సంబంధం కలిగి ఉన్నారు. దేశంలో అక్షరాస్యత ప్రోత్సాహానికి చేసిన అసాధారణ కృషికి 1971లో దుర్గబాయ్ నాలుగవ నెహ్రూ సాహిత్య పురస్కారం అందుకున్నారు. 1975లో ఆమెకు పద్మ విభూషణ్ పురస్కారం లభించింది.

## • 5.హంసా జీవరాజ్ మెహతా

1897 జూలై 3న ఆమె దేవన్ ఆఫ్ బరోడా మనుభాయ్ నంద్ శంకర్ మెహతాకు జన్మించారు. జర్నలిజం, సోషియాలజీ ఇంగ్లాండ్‌లో చదివారు. ఆమె ఒక సంస్కర్త, సాంఘిక కార్యకర్త, విద్యావేత్త మరియు రచయిత్రి. ఆమె గుజరాతీలో పిల్లలకు అనేక పుస్తకాలు రాశారు. గలివర్స్ ట్రావెల్స్‌తో సహ పలు ఆంగ్ల కథలను అనువదించారు. 1926లో బాంబే స్కూల్స్ కమిటీకి ఎన్నికయ్యారు. 1945-46లో ఆల్ ఇండియా వుమెన్స్ కాన్ఫరెన్స్ అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా ఉమెన్స్ కాన్ఫరెన్స్ కన్వెన్షన్‌లో ఆమె తన అధ్యక్ష ఉపన్యాసంలో మహిళల హక్కుల బిల్లును ప్రతిపాదించారు. ఆమె 1945-1960 మధ్య SNDT మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్, ఆల్ ఇండియా సెకండరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ సభ్యురాలు, ఇంటర్-యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు మరియు మహారాజా శాయాజీ రావు యూనివర్శిటీ ఆఫ్ బరోడా వైస్-ఛాన్సలర్‌గా పనిచేశారు.

## • 6.కమలా చౌదరి

కమలాచౌదరి లక్నోలోని ఒక సంప్రదాయ ధనిక కుటుంబంలో జన్మించారు. ఆమె తన విద్యను కొనసాగించటానికి పోరాటం జరిపారు. ఆమె జాతీయవాది మరియు 1930లో గాంధీ ప్రారంభించిన శాసనోల్లంఘన ఉద్యమంలో చురుకైన భాగస్వామిగా ఉన్నారు. ఆమె 54వ సెషన్‌లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. 70 దశకంలో లోక్‌సభ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. చౌదరి ఒక ప్రసిద్ధ రచయిత్రి. ఆమె కథలు సాధారణంగా మహిళల అంతర్గత ప్రపంచాన్ని ఆవిష్కరిస్తాయి. ఆధునిక దేశంగా భారతదేశం ఆవిర్భావాన్ని చిత్రీకరించారు.

## • 7. లీలా రాయ్

ఆమె 1900వ సంవత్సరం అక్టోబర్‌లో గోయల్పరా, అస్సాంలో జన్మించారు. తండ్రి డిప్యూటీ మేజిస్ట్రేట్. జాతీయవాద ఉద్యమంపై సానుభూతి కలిగి ఉన్నారు. ఆమె 1921 లో బెతున్ కాలేజీ నుంచి పట్టభద్రులై, ఆల్ బెంగాల్ ఉమెన్స్ సఫ్రేజ్ కమిటీ(All Bengal Womens Suffrage Committee) కి సహాయ కార్యదర్శి అయ్యారు. మహిళల హక్కులను డిమాండ్ చేయటానికి సభలు, సమావేశాలు ఏర్పాటు చేశారు. 1923లో, ఆమె తన స్నేహితులతో దిపాలి సంఘాన్ని స్థాపించారు. దిపాలి సంఘం స్థాపించిన పాఠశాలలు రాజకీయ చర్చకు కేంద్రాలుగా మారాయి. తరువాత 1926లో, ఢాకా మరియు కోలకతాలో మహిళ విద్యార్థిని సంఘం 'చాత్రీ సంఘం'ను స్థాపించారు. దీక్షా మహిళా సత్యాగ్రహ సంఘాన్ని ఏర్పాటు చేయడంలో ఆమె కీలకపాత్ర పోషించారు. ఇది ఉప్పు-పన్ను వ్యతిరేక ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించింది. రవీంద్రనాథ్ ఠాగూర్ ఆశీర్వాదాన్ని కలిగిన జయశ్రీ పత్రిక సంపాదకురాలుగా పనిచేశారు. 1937లో ఆమె కాంగ్రెస్‌లో చేరారు. మరుసటి సంవత్సరం, బెంగాల్ ప్రాంతీయ కాంగ్రెస్ మహిళా సంఘాన్ని స్థాపించారు. సుభాష్‌చంద్రబోస్ రూపొందించిన మహిళల సబ్ కమిటీ సభ్యురాలిగా పనిచేశారు. బోస్ 1940లో జైలుకు వెళ్ళినప్పుడు, ఆమె ఫార్వర్డ్ బ్లాక్ వీక్లీ సంపాదకురాలిగా నామినేట్ అయ్యింది. భారతదేశం వదిలివెళ్ళటానికి ముందు, లీలా రాయ్ మరియు ఆమె భర్తకు పార్టీ కార్యక్రమాల పూర్తి బాధ్యత నేతాజీ ఇచ్చారు. 1947లో ఆమె పశ్చిమ బెంగాల్లోని మహిళా సంస్థ అయిన జాతీయ మహిళా సంఘటిని స్థాపించారు. 1960లో, ఫార్వర్డ్ బ్లాక్(సుభాషిస్ట్) మరియు ప్రజా సోషలిస్ట్ పార్టీల విలీనంతో ఏర్పడిన నూతన పార్టీకి ఆమె అధ్యక్షురాలుగా పనిచేశారు.

## • 8. మాలతీ చౌదరి

1904లో ఈస్ట్ బెంగాల్ (ఇప్పుడు బంగ్లాదేశ్)లోని ఒక ప్రముఖ కుటుంబంలో జన్మించారు. ఆమెను కుటుంబ సభ్యులు 16 ఏళ్ళ వయసులో శాంతినికేతన్‌కు పంపారు. అక్కడ ఆమె విశ్వభారతి విశ్వవిద్యాలయంలో చేరారు. ఆమె నవక్రుష్ణ చౌదరిని వివాహం చేసుకున్నారు. తర్వాత ఆయన ఒడిశా ముఖ్యమంత్రి అయ్యారు. 1927లో ఆమె ఒడిషాకు మారారు. భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరి ఆమె భర్తతోపాటు ఉప్పు సత్యాగ్రహ

ఉద్యమంలో పాల్గొన్నారు. సత్యాగ్రహం కోసం అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించేందుకు ఆ దంపతులు ప్రజలను విద్యావంతులను చేశారు. 1933లో ఆమె తన భర్తతో కలిసి ఉత్కల్ కాంగ్రెస్ సమాజ్ వాది కార్మిక్ సంఘ్‌ను స్థాపించారు. ఆ తరువాత అది అఖిల భారత కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీకి చెందిన ఒరిస్సా ప్రొవిన్షియల్ బ్రాంచ్‌గా పిలవబడింది. 1934లో ఒరిస్సాలో తన ప్రసిద్ధ 'పాదయాత్ర'లో ఆమె గాంధీజీ తోపాటు పాల్గొన్నారు. ఒరిస్సాలోని బలహీన వర్గాల అభివృద్ధికి "బజారత్ చత్రావాస్" వంటి అనేక సంస్థలను ఆమె ఏర్పాటు చేసింది. ఆమె ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ ప్రకటనను నిరసిస్తూ ఖైదు చేయబడ్డారు.

## • 9. పూర్ణిమ బెనర్జీ

పూర్ణిమబెనర్జీ ఉత్తరప్రదేశ్ అలహాబాద్‌లోని ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా ఉన్నారు. ఉత్తరప్రదేశ్‌లో 1930 మరియు 40లలో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న తీవ్రవాద భావాలు గల మహిళలలో ఒకరు. సత్యాగ్రహ క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు ఆమెను అరెస్టు చేశారు. రాజ్యాంగ అసెంబ్లీలో పూర్ణిమ బెనర్జీ ప్రసంగాలు ఆమె సోషలిస్టు భావజాలానికి అద్దం పడతాయి. నగర కమిటీకి కార్యదర్శిగా, ఆమె ట్రేడ్ యూనియన్స్, కిసాన్ సమావేశాలు, గ్రామీణ వికాసం కోసం పనిచేశారు.

## • 10. రాజకుమారి అమ్రిత్ కౌర్

అమ్రిత్‌కౌర్ ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో 1889 ఫిబ్రవరి 2న జన్మించారు. ఆమె భారతదేశ మొదటి ఆరోగ్య శాఖ మంత్రిగా పదేళ్లపాటు పనిచేసారు. కపుర్తాల మాజీ మహారాజు హర్నం సింగ్ కుమార్తె అయిన ఆమె ఇంగ్లాండ్‌లోని డోర్సెట్‌లోని షెర్బోర్ గర్ల్స్ స్కూల్‌లో విద్యాభ్యాసం చేశారు. 16 ఏళ్లపాటు మహాత్మాగాంధీ కార్యదర్శిగా పనిచేశారు. ఆమె ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ స్థాపకురాలు(ఎయిమ్స్). మరియు దాని స్వయంప్రతిపత్తి కోసం ఆమె వాదించారు. ఆమె మహిళల విద్య, క్రీడల్లో వారి ఆరోగ్య సంరక్షణపై ఆసక్తి చూపేవారు. ఆమె ట్యుబర్క్యోసిస్ అసోషియేషన్ అఫ్ ఇండియా, సెంట్రల్ లెప్రొసీ అండ్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్‌ను స్థాపించారు. సెయింట్ జాన్ అంబులెన్స్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ అధ్యక్షురాలిగా మరియు లీగ్ ఆఫ్ రెడ్ క్రాస్ సొసైటీ గవర్నర్ల బోర్డుకు వైస్ చైర్ పర్సన్‌గా వ్యవరించారు. ఆమె 1964లో మరణించినప్పుడు, ది న్యూయార్క్ టైమ్స్ ఆమెను 'తన దేశ సేవలో పాల్గొన్న యువరాణి' అని పిలిచింది.

## • 11. రేణుకా రాయ్

ఆమె ఐసీఎస్ అధికారి సతీష్‌చంద్ర ముఖర్జీ, చారులతా ముఖర్జీల కుమార్తె. ఆల్ ఇండియా వుమెన్స్ కాన్ఫరెన్స్ (AIWC)లో ఒక సామాజిక కార్యకర్త. ఆమె కొంతకాలం లండన్‌లో నివసించారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుండి ఆమె BA పూర్తిచేశారు. 1934లో AIWC న్యాయ కార్యదర్శిగా ఆమె భారతదేశంలో "మహిళల చట్టపరమైన అవరోధాలు- ఎ ప్లీ ఫర్ ఏ కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ" (Legal Disabilities of Women in India; A Plea for a Commission of Enquiry). శారదా బిల్ మరియు భారతదేశంలో చట్టం ముందు మహిళల పరిస్థితిపై చట్టపరమైన సమీక్షను కోరారు. రేణుకా ఏకరీతి వ్యక్తిగత చట్టం కోడ్ uniform personal law code కోసం వాదించారు. భారత మహిళల స్థానం ప్రపంచంలో అత్యంత అన్యాయమైనది అని చెప్పారు. 1943 నుంచి 1946 వరకు ఆమె సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ సభ్యురాలు. తరువాత రాజ్యాంగ అసెంబ్లీ, తాత్కాలిక పార్లమెంటు సభ్యురాలు. 1952-57లో పశ్చిమ బెంగాల్ రిలీఫ్ మరియు పునరావాస మంత్రిగా పనిచేశారు. 1957లో మరలా 1962లో ఆమె లోక్‌సభకు మాల్దా నుంచి ఎన్నికయ్యారు. ఆమె 1952లో AIWC అధ్యక్షురాలిగా వ్యవహరించారు. ప్రణాళికా సంఘం మరియు శాంతినికేతన్‌లోని విశ్వభారతీయ విశ్వవిద్యాలయం పాలక మండలిలో పనిచేశారు. ఆమె ఆల్ బెంగాల్ ఉమెన్స్ యూనియన్ అండ్ ది ఉమెన్స్ కో-ఆర్డినేటింగ్ కౌన్సిల్‌ను స్థాపించారు.

## • 12. సరోజినీ నాయుడు

సరోజినీ నాయుడు 1879 ఫిబ్రవరి 13న హైదరాబాదులో జన్మించారు. ఆమె ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మరియు తొలి రాష్ట్ర గవర్నర్‌గా నియమించబడిన మొదటి భారతీయ మహిళ. "ది నైటింగేల్ ఆఫ్ ఇండియా"గా పిలుస్తారు. ఆమె లండన్‌లోని కింగ్స్ కళాశాలలో, తరువాత కేంబ్రిడ్జిలోని గిర్టన్ కాలేజీలో చదువుకుంది. ఇంగ్లండ్‌లో ఓటు హక్కు ప్రచారంలో కొంత అనుభవం పొందిన తరువాత, ఆమె ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ మరియు మహాత్మా గాంధీ యొక్క నాన్ కో-ఆపరేటివ్ ఉద్యమాలపై ఆకర్షితురాలయ్యారు. 1924లో ఆమె ఆఫ్రికా, తర్వాత ఉత్తర అమెరికాలో పర్యటించారు. 1928-29లో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఉద్యమాలలో పాల్గొన్నారు. భారతదేశంలో బ్రిటీష్-వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొన్నందుకు ఆమెకు జైలు శిక్ష విధించారు. (1930, 1932 మరియు 1942-43). ఆమె 1931లో రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ రెండవ సెషన్ కోసం గాంధీజీతో కలిసి లండన్ వెళ్లారు. సరోజినీ నాయుడు సాహిత్య పరంగా ప్రసిద్ధి చెందారు. 1914లో ఆమె రాయల్ సొసైటీ ఆఫ్ లిటరేచర్‌లో సభ్యురాలిగా ఎన్నికయ్యారు.

## • 13. సుచేత కృపలానీ

సుచేతా కృపలానీ 1908లో ప్రస్తుత హర్యానా-అంబాలా పట్టణంలో జన్మించారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో ఆమె పాల్గొన్నారు. 1940లో కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగాన్ని కృపలానీ స్థాపించారు. స్వాతంత్ర్యం తర్వాత, కృపాలానీ ఎంపిగా, తరువాత ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంలో లేబర్, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ అండ్ ఇండస్ట్రీ మంత్రిగా పని చేశారు. ఆమె చంద్రభాను గుప్తా తర్వాత యూపీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 1967 వరకు ముఖ్యమంత్రిగా కొనసాగారు. ఆమె భారతదేశ మొదటి మహిళా ముఖ్యమంత్రి.

## • 14. విజయలక్ష్మి పండిట్

విజయాలక్ష్మీ పండిట్ 1900 ఆగస్టు 18న అలహాబాద్లో జన్మించారు. జవహర్‌లాల్ నెహ్రూ సోదరి. ఆమె 1932-1933, 1940, 1942-1943లలో మూడు వేర్వేరు సందర్భాలలో బ్రిటిష్ వారిచే ఖైదు చేయబడ్డారు. రాజకీయాల్లో పండిట్ దీర్ఘకాల జీవితం అలహాబాద్ మున్సిపల్ బోర్డుకు ఆమె ఎన్నికతో అధికారికంగా ప్రారంభమైంది. 1936లో ఆమె యునైటెడ్ ప్రావిన్స్(UP) అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1937లో స్థానిక స్వీయ-ప్రభుత్వం మరియు ప్రజా ఆరోగ్యమంత్రిగా అయ్యారు. క్యాబినెట్ మంత్రిగా ఎన్నికైన మొదటి భారతీయ మహిళ. 1939లో బ్రిటీష్ ప్రభుత్వం, ఇండియా రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొంటున్నది అని ప్రకటించినందుకు ఆమె నిరసన వ్యక్తం చేశారు. తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. సెప్టెంబరు 1953లో ఆమె U.N జనరల్ అసెంబ్లీ అధ్యక్షురాలిగా ఎన్నికైన మొట్ట మొదటి ఆసియా మహిళ.

## • 15. అన్నీ మస్కారేన్

ఆమె కేరళలోని తిరువనంతపురానికి చెందిన లాటిన్ కాథలిక్ కుటుంబంలో జన్మించారు. ట్రావెన్కోర్ స్టేట్ కాంగ్రెస్‌లో చేరిన మొట్ట మొదటి మహిళలలో ఆమె ఒకరు. ట్రావెన్కోర్ స్టేట్ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో ఎన్నికైన మొట్ట మొదటి మహిళగా గుర్తింపు పొందింది. ట్రావెన్కోర్ రాష్ట్రానికి స్వాతంత్ర్యం ఇచ్చి భారతదేశంలో విలీనం చేయాలనే ఉద్యమ నాయకులలో ఆమె ఒకరు. ఆమె తన రాజకీయ జీవితంలో 1939-47 నుంచి వివిధ కాలాలపాటు ఖైదు చేయబడ్డారు. 1952లో జరిగిన భారతదేశ సాధారణ ఎన్నికలలో తొలి లోక్‌సభకు మస్కారేన్ ఎన్నికయ్యారు. కేరళ నుంచి మొదటి మహిళా ఎంపీగా ఎన్నికయ్యారు. పార్లమెంటుకు ఎన్నికయ్యే ముందు, 1949-1950 మధ్యకాలంలో హెల్త్ అండ్ పవర్ మంత్రి పదవిలో కొంతకాలం పనిచేశారు. ❑

# రాజ్యాంగ రచన - ముఖ్యాంశాలు

**16వ పేజీ తరువాయి**

- ఆర్టికల్ 48: పాడిపశువుల అభివృద్ధి, పెంపుడు, అటవీ జంతువుల రక్షణ గురించి ఈ నిబంధన పేర్కొంటుంది.

**సామ్యవాద నియమాలు : సమసమాజ స్థాపనే సామ్యవాద లక్ష్యం**

- ఆర్టికల్ 38: ప్రజలందరికీ ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం అందించాలి. (సంక్షేమ రాజ్యం)
- ఆర్టికల్ 39: ప్రభుత్వాలు ఈ కింది నిబంధనలు అమలు చేయాలి.
- 39(ఎ) ఉచిత న్యాయం అందించాలి.
- 39(బి) దేశ సంపద, సహజ వనరులు ప్రజలందరికి పంచాలి.
- 39(సి) దేశ సంపద సహజ వనరులు ఏ ఒక్కరివద్ద కేంద్రీకృతం కాకూడదు. వికేంద్రీకరణ చేయాలి.
- ఆర్టికల్ 41: జీవనోపాధి కల్పించాలి. పనిహక్కు కల్పించాలని అర్థం.
- ఆర్టికల్ 42: మహిళలకి ప్రసూతి సౌకర్యం కల్పించాలి.
- కార్మికులకు హేతుబద్ధమైన పనిగంటలు, పని చేసే వాతావరణం కల్పించాలి.
- ఆర్టికల్ 43(ఎ) కార్మికులకు యాజమాన్యంలో భాగస్వామ్యం కల్పించాలి.
- 43(ఎ) సహకార సంస్థలు స్థాపించాలి.
- ఆర్టికల్ 45 : ఆరేళ్లలోపు బాల బాలికలకు విద్య అందించాలి. ఈ అంశం 86వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా ప్రాథమిక హక్కుల్లో 21(A) చేర్చారు.
- ఆర్టికల్ 21(ఎ): 6 14 ఏళ్లలోపు పిల్లలకి ఉచిత నిర్బంధ విద్య అందించాలి. దీనిని అమలు బాధ్యత ప్రభుత్వాలది.
- 51(ఎ) 6 నుంచి 14 ఏళ్లలోపు బాల బాలికలకు ఉచిత విద్యను అందించడం తల్లిదండ్రుల విధి. (ఈ అంశం ప్రాథమిక విధుల్లో పేర్కొన్నారు)
- ఆర్టికల్ 45 : 6 ఏళ్లలోపు పిల్లలకి ఉచిత నిర్బంధ విద్య.
- ఆర్టికల్ 46 : సామాజిక పరంగా, విద్యాపరంగా వెనుకబడిన వారికి ప్రత్యేక మినహాయింపులు కల్పించాలి

**ఆదేశిక సూత్రాల లక్షణాలు**

- సంక్షేమ రాజ్యస్థాపన. • శ్రేయోరాజ్య స్థాపన.
- సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం.
- ప్రభుత్వాలకి చట్టాలు రూపొందించడంలో సలహాలు.
- ప్రభుత్వాలకి మార్గదర్శకాలు చట్టం ద్వారా అమల్లోకి వస్తాయి.
- న్యాయ సంరక్షణ లేదు (39(ఎ), 39(సి).❑

# భావి పౌరులకు రాజ్యాంగాన్ని పరిచయం చేద్దాం

## తణుకులో విద్యా సంస్థల అధ్యాపకుల వర్క్ షాప్ నిర్ణయం



రాజ్యాంగ ప్రచార వేదిక నిర్వహిస్తున్న "భావి భారత పౌరులకు రాజ్యాంగ పీఠిక పఠనం-ప్రతిజ్ఞ "కార్యక్రమానికి తణుకులోని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల నుండి విశేష స్పందన వచ్చిందని ఇది రాజ్యాంగ విలువల పరిరక్షణకు ఎంతగానో దోహదం చేస్తుందని ప్రచారవేదిక సమన్వయకర్త డి.వి.వి.యస్.వర్మ ప్రకటిం చారు. రాజ్యాంగ స్ఫూర్తిని తరగతి గదుల్లో విద్యార్థులకు సులభంగా బోధించే పద్ధతి మీద స్థానిక యస్.సి.ఐ.యం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెమినార్ హాలులో నిర్వహించిన వర్క్ షాప్‌కు ప్రభుత్వ-ప్రయివేటు రంగా లకు చెందిన కళాశాలలు, హైస్కూల్స్‌కి ప్రాతినిధ్యం వహించే 25 సంస్థల నుండి 40 మంది అధ్యాపకులు, 15 మంది ఇతర ప్రముఖులు హాజరయ్యారని తెలిపారు. ఈ వర్క్ షాపులో విద్యా ర్థులకు బోధించే విధంగా "రాజ్యాంగ పీఠిక-పద పరిచయం" అంశాన్ని విశ్రాంత ప్రిన్సిపాల్ సంకు మనోరమ, "ప్రాథమిక హక్కులు" అంశాన్ని సామాజిక న్యాయపోరాట సమితి వ్యవ స్థాపకులు పేరూరి మురళీకుమార్, "ప్రాథమిక విధులు" అంశా న్ని శ్రీశ్రీ సేవాసమితి కన్వీనర్ పి.దక్షిణామూర్తి, "ఆదేశిక సూత్రాలు" అంశాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు విష్ణువర్ధన్‌లు వివరించగా ప్రతి అంశం బోధనా పద్ధతి మీద ప్రతినిధులు పలు సూచనలు చేశారని వర్మ తెలియజేశారు. తణుకు స్టడీ సర్కిల్ కార్యదర్శి డాక్టర్ రమేష్ చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ వర్క్ షాప్‌ను విశ్రాంత ప్రభుత్వ డిగ్రీ కళా శాల ప్రిన్సిపాల్ గుబ్బల తమ్మయ్య ప్రారంభించారు. విద్యా సంస్థలలో నిర్వహించవలసిన కార్యక్రమాలపై సమన్వయకర్త డివివియస్ వర్మ చేసిన ఈ కింది ప్రతిపాదనలను విద్యా సంస్థల ప్రతినిధులు ఆమోదించారు.

- కళాశాల/ఉన్నత పాఠశాల విద్యార్థులందరితో రాజ్యాంగ పీఠికను చదివించి, అందులోని పదాల ప్రాముఖ్యతను తప్పనిసరిగా వివరించాలి.
- ప్రాథమిక హక్కులు, విధులు, ఆదేశిక సూత్రాలను తరగతి లో ఒకసారి వివరించాలి.
- భారత రాజ్యాంగం - విద్యార్థుల కోసం రాసిన పుస్తకాలను గ్రంథాలయంలో అందుబాటులో వుంచాలి.
- పై అంశాల మీద క్విజ్‌లు, వ్యాసరచన, ప్రసంగ పోటీలు నిర్వహించాలి.
- నవంబరు 26 రాజ్యాంగ దినోత్సవం రోజున విద్యార్థులతో సామూహికంగా పీఠిక పఠనం-పీఠిక ప్రతిజ్ఞ చేయించాలి. ముఖ్య అతిథులతో సందేశాలను ఏర్పాటు చేసుకోవాలి. ఈ కార్యక్రమాల నిర్వహణలో వేలాది మంది విద్యార్థులకు రాజ్యాంగ స్ఫూర్తిని కలిగించడానికి ముందుకు వచ్చిన అన్ని

**మిగతా 22వ పేజీలో**



# హక్కుదారుల ఉద్యమంగా రాజ్యాంగ దినోత్సవం

**రాజ్యాంగ ప్రచార వేదిక సమన్వయ కర్త డి వి వి యస్ వర్మ**



నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవాన్ని తణుకులో కార్మిక సంఘాలు, పౌరసంఘాలు, వివిధ తరగతుల ప్రజాసంఘాల ఐక్య ఉద్యమంగా నిర్వహించడానికి స్థానిక సురాజ్య భవనంలో జరిగిన సన్నాహక సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన రాజ్యాంగ ప్రచార వేదిక సమన్వయ కర్త డి.వి.వి.యస్ వర్మ మాట్లాడుతూ మన ఓటుతోనే ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయని, మన పన్నుల సొమ్ముతోనే ప్రభుత్వాలు నడుస్తున్నాయని భారత రాజ్యాంగం ప్రజలనే యజమానులను చేసిందని అన్నారు . మన రాజకీయం ప్రజలను కేవలం ఓటర్లగా పాలకులు విదిలించే సంక్షేమాన్ని పొందే లబ్ధిదారులను చేసిందని దీనికి భిన్నంగా రాజ్యాంగం ప్రకారం మనం హక్కుదారులం అన్న గుర్తింపుతో రాజ్యాంగాన్ని అమలు చేసేలా నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకోవాలని అన్ని ప్రజా సంఘాలకు విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలకు అనుగుణంగా దేశంలో ఒక శాతం దగ్గర పోగుపడ్డ సంపదను వివిధ పన్నుల ద్వారా వికేంద్రీకరించి ప్రజలకు స్వతంత్ర జీవనాన్ని అందించాలన్న లక్ష్యాన్ని సాధించాలని పిలుపునిచ్చారు. సన్నాహక సమావేశంలో పివి ప్రతాప్ (సిఐటియు), దేవ పెద్దిరాజు(ఎఐటియుసి), పేరూరి మురళీ కుమార్, గొల్లపల్లి అంబేద్కర్ (సామాజిక న్యాయ పోరాట సమితి), నీలం మాల్యాద్రి (సమతా ఎడ్యుకేషన్ సొసైటీ) డా. రమేశ్ చంద్రబాబు (తణుకు స్టడీ సర్కిల్), కామన మునుస్వామి (ఇండియన్ లాయర్స్ యూనియన్), కౌరు వెంకటేశ్వర్లు (పౌరహక్కుల సంఘం), యస్.మనోరమ(రాజ్యాంగ పరిరక్షణ సమితి), జి.కరుణాకరచౌదరి (సీనియర్ సిటిజన్స్) టి.అప్పల స్వామి (ఎఐయస్ఎఫ్), కట్టా గోపాలకృష్ణ(బిసి సంఘం), టి.పాండురంగారావు (టైలర్స్ సంఘం) ఎ.శ్రీనివాస్(నాయీ బ్రాహ్మణ సంఘం), జి.హనుమంతరావు (సైకిల్ వర్కర్స్ యూనియన్), జి.శ్రీనివాసరావు (విశ్వ బ్రాహ్మణ సంఘం ఇంకా మోటార్ సైకిల్ మెకానిక్స్ యూనియన్-స్వర్ణకార సంఘం, అరుంధతీయ యువజన సంఘం-దళిత సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. ❑

# భావి పౌరులకు రాజ్యాంగాన్ని పరిచయం చేద్దాం

**21వ పేజీ తరువాయి**

విద్యాసంస్థలను ప్రచార వేదిక అభినందించింది.

సమావేశంలో విశ్రాంత ప్రిన్సిపాల్స్ చల్లా హైమావతి, అడ్డాల సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్టు బెల్లంకొండ బుచ్చిబాబు, యస్.సి.ఐ.యం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏడుకొండలు పాల్గొన్నారు. సామాజిక కార్యకర్త జి.ఉష, సామాజిక న్యాయ పోరాట సమితి నాయకులు గొల్లపల్లి అంబేద్కర్ సందేశాలు ఇచ్చారు. పెనుగొండ వాసవీ కళాశాల ప్రతినిధులుగా వచ్చిన అధ్యాపకులు తమ కళాశాలలో ఈ కార్యక్రమాలను చేపడతామని ప్రకటించారు. ఏలూరు నుండి వచ్చిన విశ్రాంత జిల్లా జడ్జి అడబాల లక్ష్మి, పిపి శాస్త్రి ఈ కార్యక్రమాన్ని కొన్ని విద్యాసంస్థలలో నిర్వహిస్తామని చెప్పారు. ❑



# ప్రతిజ్ఞ

**భావి భారత పౌరులమైన మేము భారత రాజ్యాంగ పీఠిక ప్రకటించిన ఆశయాలకు బద్ధులమై వుంటామని, దేశ ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం ద్వారా సమాన అవకాశాలు పొందేలా కృషి చేస్తామని, కుల, మత, భాషాపరమైన విద్వేషాలకు లోను కాకుండా సోదర భావం పెంచుకుని దేశ సమైక్యతకు దోహదం చేస్తామని, రాజ్యాంగ పీఠిక ప్రస్తావించిన లక్ష్యాల సాధనకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేస్తున్నాము.**

**పాఠశాలలో - కళాశాలలో నిర్వహించవలసిన కార్యక్రమాలు**

- 1) ప్రతి హైస్కూల్‌లో 8–10 తరగతుల విద్యార్థులకు కళాశాలలో అందరు విద్యార్థులకు "రాజ్యాంగాన్ని – పీఠికను" పరిచయం చేయాలి. ప్రతి తరగతిలోనూ 10–15 నిమిషాలపాటు వివరించాలి.
- 2) కళాశాలలో వీలైనచోట పట్టణంలోని ప్రముఖులతో ప్రత్యేక ప్రసంగ కార్యక్రమం నిర్వహించాలి.
- 3) విద్యాసంస్థలోని విద్యార్థులకు వ్యాస రచనలు, క్విజ్ పోటీలు నిర్వహించాలి.
- 4) నవంబరు 26 రాజ్యాంగ దినోత్సవం ప్రతి విద్యా సంస్థలోని విద్యార్థులందరితో సామూహికంగా లేదా తరగతి గదులలో "పీఠికను చదివించి ప్రతిజ్ఞ చేయించాలి.
- 5) మీ విద్యా సంస్థలో మీరు నిర్వహించిన ప్రతి కార్యక్రమాన్ని, ఫొటోలను ప్రచురణ కోసం పత్రికా ప్రకటనలు పంపండి. వాటి కాపీలను "రాజ్యాంగ ప్రచార వేదిక–తణుకు" కోఆర్డినేటర్ డి.వి.వి.యస్.వర్మ 85006 78977 నంబరుకు WhatsApp Message పంపించండి. రాజ్యాంగ బద్ధులుగా భావి భారతపౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దే ఈ కార్యక్రమాన్ని మీ విద్యాసంస్థలో పలు రూపాల్లో అర్థవంతంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నాము.

**రాజ్యాంగ ప్రచార వేదిక -తణుకు**

**డి.వి.వి.యస్.వర్మ : కో ఆర్డినేటర్–85006 78977**

**డా॥గుబ్బల తమ్మయ్య (విశ్రాంత ప్రిన్సిపాల్) – యస్.మనోరమ (విశ్రాంత ప్రిన్సిపాల్)**

**ఎ.ఎన్.ఎస్.సత్యనారాయణ (విశ్రాంత ప్రిన్సిపాల్) – ఆకుల వెంకటేశ్వరరావు (మాజీ మున్సిపల్ ఛైర్మన్)**

**డా॥ రమేష్ చంద్రబాబు (తణుకు స్టడీ సర్కిల్) – పేరూరి మురళీకుమార్ (సామాజిక న్యాయ పోరాట సమితి)**

**పి.దక్షిణామూర్తి (శ్రీశ్రీ సేవా విజ్ఞాన కేంద్రం) – బి.బుచ్చిబాబు (సీనియర్ జర్నలిస్ట్)**

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిక నోటీసు

## 2024 నవంబరు 26 ప్రదర్శనలు, ధర్నాలు

- వడ్డే శోభనాద్రీశ్వరరావు



భారత రాజ్యాంగం దేశ ప్రజలందరికీ కుల, మత, ప్రాంతీయ ఆర్థిక స్థోమతులతో నిమిత్తం లేకుండా స్వాతంత్ర ఫలాలు అందాలని, యావన్మంది ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, దేశ సహజ వనరులు, సంపద ప్రజలందరికీ ఉపయోగపడాలని ఆకాంక్షించింది.. ప్రాథమిక హక్కులకు హామీ ఇస్తూ ప్రజలందరికీ మేలు చేకూర్చేందుకు ప్రభుత్వాలకు ఆదేశిక సూత్రాలను పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సూత్రాలకు భిన్నంగా ప్రాథమిక హక్కులకు, పౌరుల స్వేచ్ఛా స్వాతంత్రాలకు, ఫెడరల్ స్ఫూర్తికి,లౌకికతత్వానికి హాని కలిగిస్తుంది. క్రోనీ క్యాపిటలిజాన్ని పెంచి, పోషిస్తూ వుంది. అత్యధిక ప్రజానీకానికి వ్యవసాయం జీవనాధారం. వ్యవసాయదారులు మరియు కార్మికుల ప్రయోజనాలకు భంగం కలిగిస్తూ ఉంది. దీర్ఘకాలంగా సంయుక్త కిసాన్ మోర్చా మరియు కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక కేంద్ర ప్రభుత్వం ముందు ఉంచిన డిమాండ్లలో ఏ ఒక్క దానిని ఆమోదించలేదు. ఈ నేపథ్యంలో అత్యంత పవిత్రమైన “నవంబరు 26 రాజ్యాంగ దినోత్యవం” రోజున దేశవ్యాప్తంగా 500 జిల్లాలలో భారీ ఎత్తున రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పట్టణ పేదలు, కార్మికులు, మహిళలు, ప్రజా సంఘాలు యావన్మంది సమీకృతమై అత్యంత న్యాయమైన మన డిమాండ్లను కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా పరిష్కరించనిచో, భవిష్యత్ కాలంలో మరింత తీవ్రంగా ప్రజా ఉద్యమాలు నిర్వహించవలసిన పరిస్థితి వస్తుందనే హెచ్చరిక నోటీసులను జిల్లా కలెక్టర్ల ద్వారా కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలకు పంపబడతాయి.

**మన డిమాండ్లు**

- 1) వ్యవసాయ పంటలకు సరైన మద్దతు ధరలు లేనందున భారత రైతాంగానికి ఏటా సుమారు రూ.3 లక్షల కోట్ల మేర నష్టం వాటిల్లుతుందని పలు నివేదికలు పేర్కొన్న నేపథ్యంలో, డాక్టర్ ఎం.ఎస్. స్వామినాధన్ రైతు కమిషన్ సిఫార్సు చేసిన విధంగా సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి (d¾2+50) చట్టబద్ధ ఎమ్.ఎస్.పి.లను ప్రకటించాలి.
- 2) ప్రకృతి వైపరీత్యాలు, చీడ పీడలు, ధరల పతనం, రుణభారం వల్ల లక్షలాది మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడిన నేపథ్యంలో ఒక్క పర్యాయం పంట రుణాల బకాయిలను మాఫీ చేయాలి. (ఐదేండ్లు పైనుండి కోరుతున్నా స్పందించని మోదీ ప్రభుత్వం బడా పారిశ్రామిక వేత్తలకు రూ.14.65 లక్షల కోట్లు మాఫీ చేయటం సబబా?)
- 3) రైతుల ఆత్మహత్యల నివారణకై కేరళ రాష్ట్రంలో వలే ‘రైతు రుణ ఉపశమన చట్టం’ను పార్లమెంటులో ఆమోదించి అన్ని రాష్ట్రాలలో అమలు చేయాలి.
- 4) రైతులు, వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.10వేలు పెన్షన్ సౌకర్యాన్ని వర్తింపజేయాలి.
- 5) కౌలు రైతుల చట్టంలో భూయజమాని సంతకం ఉండాలన్న నిబంధనను తొలగించాలి.
- 6) దశాబ్దాలపాటు సంఘటిత శక్తితో కార్మిక లోకం సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి తెచ్చిన కార్మిక వ్యతిరేక కార్పోరేట్ అనుకూల నాలుగు లేబర్ కోడ్లను వెంటనే ఉపసంహరించాలి.
- 7) విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను విరమించాలి. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలి.
- 8) రైతులు, పేదల పాలిట ఉరితాడు కాగల ఎలక్ట్రిసిటీ బిల్లును ఉపసంహరించాలి. గృహ వినియోగదారులకు, చిన్న వ్యాపారులకు, వ్యవసాయ మోటార్లకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను బిగించరాదు.
- 9) 2013 భూసేకరణ చట్టం అమలు చేయాలి. నిర్బంధ భూసేకరణ చట్టం విరమించాలి.
- 10) కరువు, వరదలు, చీడ పీడల వల్ల పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించేందుకు ప్రభుత్వ రంగ బీమా కంపెనీల ద్వారానే పథకం అమలు చేయాలి. ప్రీమియంను కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలే చెల్లించాలి.
- 11) కనీస వేతనం రూ.26,000/-లుగా నిర్ణయించి అమలు చేయాలి కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, డెయిలీవేజ్, ‘కంటినెంట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చెయ్యాలి.
- 12) ఉపాధి హామీ పని దినాలను 200లకు పెంచి, రోజు వేతనం రూ.600/-లకు పెంచాలి. పట్టణ ప్రాంతాలలోను ఉపాధి హామీ చట్టం అమలు చేయాలి.
- 13) అటవీ హక్కుల పరిరక్షణ చట్టానికి సవరణ చట్టం 2023ను ఉపసంహరించాలి. ఆదివాసీలు, అటవీ, నివాసుల హక్కులను పరిరక్షించాలి. అటవీ సంపదను, వనరులను పరిరక్షిస్తున్న ఆదివాసీలు, షెడ్యూల్డు ట్రైబ్స్ ప్రజలపై

మిగతా 26వ పేజీలో

# లౌకికతత్వం-లౌకిక రాజ్యం



- సంగిరెడ్డి హనుమంతరెడ్డి

'తల్లి సత్యం.. తండ్రి నమ్మకం' అన్నది పాత నానుడి. "పిల్లలు మన ద్వారా వస్తారు.. మన కోసం రారు" అన్న లెబనీస్ అమెరికన్ కవి, రచయిత, దార్శనిక కళాకారుడు ఖలీల్ గిబ్రన్ అర్థ తాత్వికతలను గ్రహించాలి. మతం, దేవుడు మనిషి సృష్టి. వ్యక్తిగతాలు. బాహ్య ప్రపంచంలో మనిషి లౌకిక మానవునిగా మారాలి. పూర్తిగా భౌతిక ప్రపంచంపై ఆధారపడిన అర్థ సూత్రాలను ప్రకృతి, ప్రాణకోటి జీవితాలకు అన్వయించడం లౌకికతత్వం. ఇది దైవమతాల ఆశ్రయం, రక్షణ, సహాయం కోరదు. దైవ మత విశ్వాసాల నుండి భౌతిక, ప్రాకృతిక, పాదార్థిక విషయాలపై ఆలోచనలను మరలిస్తుంది.

మనిషి వ్యవహారాలు, జీవన విధానం విజ్ఞానశాస్త్రం, హేతువాదాల ఆధారంగా ఉంటాయంటుంది. లౌకికీకరణ మత విశ్వాసాలను, ఆచరణలను నిరాకరిస్తుంది. చారిత్రక సత్యాలను నమ్ముతుంది. మతరహిత పౌర, నైతిక భావంలో ఆంగ్లజ్ఞాన చింతకుడు, రచయిత జార్జ్ హోల్యోక్ 1851లో లౌకికత్వం పదాన్ని వాడారు. క్రీ.పూ. 1200 నుండి ప్రాచీన గ్రీకు సామ్రాజ్యంలో, ఇండియాలో క్రీ.పూ. 300 నాటి అశోక చక్రవర్తి, క్రీ.శ.1556-1605ల మధ్య అక్బర్ చక్రవర్తి కాలంలో, క్రీ.శ.1299-1922ల మధ్య ఇస్లామిక్ ఒట్టొమాన్ వ్యవస్థలో లౌకికరాజ్య పాలన సాగింది.

'బతుకు చావులిక్కడే. వీటి కోసం ఎక్కడికి వెళ్లాలి ? స్వర్గమిదే నరకమిదే. వీటి కోసం ఎక్కడికి పోవాలి ?' మేరా నామ్ జోకర్ సినిమా కోసం శైలేంద్ర రాసిన పాటలో ఒక చరణమిది. మన జీవన్మరణాలు ఈ భూమ్మీదే. స్వర్గ నరకాలు పౌరాణిక కల్పనలలో కాదు కాని, సుఖ దు:ఖాలని అర్థం. రాజ్యం సుఖాలను సంపన్నులకే అందిస్తుంది. తొంభై శాతం మందికి దు:ఖాలను పంచుతుంది. పూర్వ జన్మను ఎవరూ చూడలేదు. మరో జన్మ ఉందో లేదో తెలియదు. ఈ జన్మ సత్యం. కర్మ సిద్ధాంతం అబద్ధం. మోక్షం మోసం. ఈ జీవితంలోని ఆనందాన్ని, సంతోషాన్ని, మాధుర్యాన్ని క్రమశిక్షణతో, హక్కులు, బాధ్యతలతో, ఇతరులకు, సమాజానికి నష్టం కలిగించకుండా నిరాడంబరంగా అనుభవించడమే లౌకికత్వం. మతంతో సంబంధం లేని రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అంశాలలో జోక్యం లేని ప్రకృతిపై ఆధారపడి ఇహలోక అంశాలను మాత్రమే పట్టించుకునేదే లౌకిక రాజ్యం. మతాన్ని రాజ్యం నుంచి వేరుచేయడమే లౌకికత్వం. మతం, లౌకికత్వ ఆలోచనలు క్రైస్తవ గ్రంథం బైబిల్‌లో మత ప్రభావం నుండి పుట్టిన లాటిన్ భాషా మూలాల పాశ్చాత్య అవగాహనలు. భారతీయ భాషలలో వీటికి సమానాత్మక పదాలు లేవు. లౌకికత్వం దగ్గరి అర్థాన్నిచ్చే పదమే. లౌకికత్వం ఐరోపా భావమని దీని అర్థం కాదు. సమానార్థక పదం లేకపోయినా మనకు లౌకికత్వం ఉంది. పౌరాణిక సమాజాల చార్వాక, లోకాయత, ద్రౌపద ఆలోచనలు లౌకికత్వాలే. మతాలకు సమదూరం, సర్వధర్మతత్వం మోసాలు. ప్రజాస్థలాల్లో అన్ని మత దేవతల బొమ్మలు పెట్టడం కాక ఏ దేవుని బొమ్మనూ పెట్టకపోవడం లౌకికత్వం. ఇది మత సంబంధమో మత వ్యతిరేకమో కాదు. భౌతికవాదానికి, మత రాహిత్యానికి దారితీసే బహుళస్థాయి ఆలోచన. మతభావాల తగ్గింపు, ప్రత్యామ్నాయ భావజాల నిర్మాణం, మతాన్ని వ్యక్తిగతం చేసి ఇంటికే పరిమితం చేయడం వంటి ప్రక్రియలతో లౌకికత్వాన్ని పెంచవచ్చు. జాతీయోద్యమంలో గాంధీ మతాలన్నిటిని కలుపుకున్నారు. నెహ్రూ, నేతాజీలు తప్ప గాంధీ, ఇతర స్వాతంత్రోద్యమ నాయకులు లౌకిక సమాజ నిర్మాణ అవసరాన్ని గుర్తించలేదు. అందుకే ఉద్యమ, దేశ విభజన సమయాలలోనే గాక నేటికీ మతోన్మాదాన్ని తప్పించుకోలేకున్నాము.

రాజ్యాంగ నిర్మాతలలో వైదికవాదులు మన దేశాన్ని హిందూ దేశంగా ప్రకటించాలన్నారు. ఆంబేద్కర్, జవహర్‌లాల్ నెహ్రూల వాదనల ఫలితంగా అలా జరగలేదు. 'భారతదేశం మతాలను గుర్తించి అంగీకరిస్తుంది. ఆచరణ, ప్రచార అవకాశాలను కల్పిస్తుంది. కానీ ఒక మతానికి అనుకూలంగా ఉండదు.' అని రాజ్యాంగం చెప్పింది. మత మైనారిటీలకు విద్య, సాంస్కృతిక హక్కులను ఇచ్చింది. శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజలందరూ పెంచాలని పేర్కొంది. మన పాలకులు ఓట్ల రాజకీయాలతో లౌకికత్వాన్ని తుంగలో తొక్కారు. ఫలితంగా లౌకికత్వమే మతాంతీకరణ చెందింది. భారత రాజ్యాంగం లౌకికత్వ అత్యుత్తమ భావాల ఆధారంగా రచించబడింది. ప్రజాజీవితంలో మతప్రభావం తగ్గాలని భావించింది. కుల, మత, వర్గ లింగాలతో సంబంధం లేకుండా అందరికీ పౌరసత్వం ఇచ్చింది. శతాబ్దాల తరబడి సామాజిక, ఆర్థిక సంబంధాలను నియంత్రించిన హిందూ చట్టాలు, ఆచార సాంప్రదాయాలు, దళిత నిషేధాలను తుడిచేసింది. జాతీయ లౌకికత్వాన్ని ఆవిర్భవించింది. మతాధార లౌకికత్వాన్ని ప్రతిపాదించలేదు. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వ,

సౌభ్రాతృత్వ సూత్రాల నాస్తిక రాజ్యంగా అవతరించింది. వెంకట రెడ్డి, విష్ణు శర్మ, వీరయ్య చౌదరిల కులం చెప్పనవసరం లేదు. రాజ్యాంగ ప్రతి అధికరణలో లౌకికత్వం నిక్షిప్తమయింది. అందుకే రాజ్యాంగ రచయితలు దానికి లౌకిక పదాన్ని జోడించలేదు.

రాజ్యాంగం 3వ భాగంలో ప్రాథమిక హక్కులు, 4వ భాగం రాజ్య విధాన ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక బాధ్యతలు వంటి నిబంధనలు లౌకికత్వ భావాలను ప్రతిబింబిస్తాయి. మతాతీత సమానత్వాన్ని, సమాన అవకాశాలను, మత స్వీకరణ, ఆచరణ, ప్రచార, విద్య, సాంస్కృతిక హక్కులను, సౌభ్రాతృత్వ, శాస్త్రీయ దృక్పథ బాధ్యతలను కల్పించాయి. సుప్రీంకోర్టు 1973లో కేశవానంద భారతి కేసులో రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంలో లౌకికత్వం భాగమని తీర్పిచ్చింది. 1994 బొమ్మై కేసులో లౌకికత్వ అర్థాన్ని విశదీకరించింది. పాశ్చాత్య లౌకికత్వం రాజ్యం నుండి మతాన్ని వేరుచేయాలని సూచించింది. మత విద్యా సంస్థలకు సాయం చేయదు. స్థానిక చట్టాల పరిధిలో తప్పితే మత కార్యాలను అడ్డుకోదు. మత సంస్కరణలకు రాజ్యం మద్దతివ్వదు. వ్యక్తుల హక్కులకు ముందంజ. భారత లౌకికత్వంలో రాజ్యాంగం అన్ని మతాలకు సమాన గౌరవాన్నిచ్చింది. మత పాఠశాలలకు, భవనాలకు, మౌలిక సౌకర్యాలకు పాక్షిక సహాయాన్ని అనుమతిచ్చింది. రాజ్య మద్దతు మత సంస్కరణలకు అనుకూలం. (దీనివల్ల అంటరానితనం, బాల్య వివాహాల వంటి సామాజిక దురాచారాల రద్దుకు అవకాశం కలిగింది. మత ప్రస్తావన లేకుండానే ఈ చట్టాలు చేయవచ్చు.)వ్యక్తుల మత స్వేచ్ఛకేగాక మైనార్టీ సమూహాల మత స్వేచ్ఛకూ అవకాశం ఇస్తుంది. అన్ని మతస్తుల, మైనార్టీ మతాల హక్కులను రక్షించినట్లు కనిపించినా ఇవి లౌకికత్వ వక్రీకరణలే. మైనారిటీల అభివృద్ధికి మతాతీతంగా సాయపడచ్చు.

1976 ఆత్యయిక పాలనలో ఇందిరాగాంధీ 42 వ రాజ్యాంగ సవరణ ద్వారా 'లౌకిక' పదాన్ని పీఠికలో చేర్చారు. కాని లౌకికత్వ అమలు విధానాన్ని ప్రస్తావించలేదు. సంఘ్ భావజాల వాదులకు మన రాజ్యాంగం నచ్చదు. మనుస్మృతి విశ్వవ్యాపిత, సర్వజనామోదిత వైదిక రాజ్యాంగమని, అదే మన రాజ్యాంగమని వాదించారు. 2013లో పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్‌ల నుండి వచ్చిన వైదికులకు బీజేపీ పాలిత రాష్ట్రాలలో పౌరసత్వమే కాక ఓటు హక్కు ఇచ్చారు. దాంతో 2014లో పందొమ్మిది పార్లమెంటు సీట్లు పొందారు. ఈ అనుభవంతో లాభాపేక్షతతో అసాంలో జనాభా నమోదు జాబితా ప్రక్రియను మొదలుపెట్టారు. పాకిస్థాన్, బర్మా, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్‌ల నుండి వచ్చిన, రాబోయే ముస్లిమేతరులకు మాత్రమే పౌరసత్వం, ఓటు హక్కు ఇవ్వాలని 2019 రాజ్యాంగ వ్యతిరేక పౌరసత్వ సవరణ చట్టం చేశారు. మోడీ ప్రభుత్వం భారత్‌ను అప్రకటిత ఆచరణ హిందు దేశంగా మార్చింది. రాజ్యాన్ని, మతం, కార్పొరేట్లతో కలగా పులగం, దేశాన్ని అలౌకికం చేసింది. ❑

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిక నోటీసు

**24వ పేజీ తరువాయి**

"ఆపరేషన్ కగార్"ను వెంటనే నిలిపివేయాలి.

- 14) రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతానికి సాగునీరు, తాగు నీరు అందించు ప్రాజెక్టు పనులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలి. పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు పరిహారం మరియు పునరావాసం కల్పించాలి. (ఏ జిల్లాకు సంబంధించిన ప్రాజెక్టులను వారు జత చేసుకోవాలి)
- 15) శ్రీశైలం డ్యాం ఆప్రాన్ వద్ద ఏర్పడిన పెద్ద గొయ్యిని పూడ్చటంతోపాటు, కొన్ని అనకట్టల గేట్ల సక్రమ నిర్వహణతోపాటు, పంట కాలువలు - డ్రైన్ల బాగు చేత కార్యక్రమాలకు తగు విధులు కేటాయించి, రానున్న వేసవిలో పనులను పూర్తి చేసేందుకు కృషి జరగాలి.
- 16) మన ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలకు అవసరమైన పనుల గురించి ప్రభుత్వానికి గట్టిగా చెప్పి వినిపించాల్సిన బాధ్యత ప్రజల మీద వుండగా, ప్రజలు చెప్పినది విని అమలు చేసేందుకు పాలకులు కృషి చేసినప్పుడే ప్రజాస్వామ్యం విజయవంతం అవుతుంది.
- 17) మత్స్యకారులకు పంట విరామ భృతి వెంటనే చెల్లించాలి. గొర్రెల పెంపకందారులకు డి వార్మింగ్ మందులు ఉచితంగా ఇవ్వాలి. పాడి రైతులకు పొరుగు రాష్ట్రాలు ఇస్తున్న విధంగా లీటరుకు రూ.5లు కబ్సిడీ ఇవ్వాలి.

పన్నులు కట్టేది ప్రజలు - లాభాలు కాంట్రాక్టర్లకు, బ్యాంకులలో డిపాజిట్లు సామాన్య, మధ్యతరగతి ప్రజలవి - భారీగా రణాలు మరియు రుణమాఫీలు కార్పొరేట్లకు. ఈ విధమైన తప్పుడు విధానాలను మార్చుకోవసిన ఆవశ్యకత గురించి కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించేందుకే ఈ నవంబరు 26 కార్యక్రమం చేపట్టబడుతూ వున్నందున రాజకీయ పార్టీలతో నిమిత్తం లేకుండా రైతులు, కార్మికులతోపాటు సామాన్య ప్రజానీకం, యువకులు, మహిళలు, ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము. ❑

**ఎ.పి రైతు, వ్యవసాయ కార్మిక, గిరిజన, వృత్తి, సామాజిక సంఘాల సమన్వయ సమితి.** (APSKM)

**ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ యూనియన్ల అనుబంధ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ**

# ఆర్థిక సిద్ధాంతాల మాయాజాలం



- ప్రభాత్ పట్నాయక్

ఇప్పుడు "ప్రధాన స్రవంతి ఆర్థిక శాస్త్రం"గా పిలవబడేదంతా సత్యాన్ని వెలికితీసే లక్ష్యంతో కాకుండా దానిని మసిపూసి మారేడుకాయ చేసే లక్ష్యంతో నడుస్తోంది. ఆర్థిక శాస్త్రానికి ఉన్న ఈ సైద్ధాంతిక స్వభావాన్ని కార్ల్‌మార్క్స్ లోతుగా గ్రహించాడు గనకనే 'సాంప్రదాయ ఆర్థిక శాస్త్రం', 'అసభ్యకర ఆర్థిక శాస్త్రం' (వల్గర్ ఎకనామిక్స్) అని రెండు రకాలుగా ఆర్థిక శాస్త్రాన్ని వేరు చేసి చూడాలని చెప్పాడు. ఈ రెండో రకపు అర్థశాస్త్రం ఉత్పత్తి ప్రక్రియను పట్టించు కోదు. మారకం మీద మాత్రమే తన దృష్టినంతటినీ పెడుతుంది. ఆ మారకం జరిగే మార్కెట్‌లో పాల్గొనే ప్రతీ వ్యక్తీ ఒకేస్థాయిలో ఉంటాడు కనుక ఉత్పత్తి రంగంలో జరిగే దోపిడీ సంగతి పూర్తిగా మరుగున పడిపోతుంది. పెట్టుబడిదారీ విధానంలో అదనపు విలువ ఎలా వస్తుంది అన్న అంశం మీద మార్క్స్ ప్రధానంగా తన దృష్టి నంతా సారించాడు. కనుక ఆ కోణం నుంచే ఆర్థికశాస్త్రం సైద్ధాంతిక స్వభావాన్ని ఆయన చర్చించాడు. ఐతే, మొత్తం వ్యవస్థను పరిశీలించే విషయంలో 'ప్రధాన స్రవంతి ఆర్థిక శాస్త్రం' సామ్రాజ్యవాదం అనేది ఒకటుందని గుర్తించదు. సామ్రాజ్య వాదాన్ని పట్టించుకోకపోవడం కాదు. అసలు సామ్రాజ్యవాదం అనేది ఉనికిలో ఉన్న వాస్తవాన్ని అది నిరాకరిస్తుంది. ఇలా అంటున్నానంటే, ప్రస్తుతం ఆర్థిక శాస్త్ర రంగంలో ఉన్న పండితులందరిలోనూ నిజాయితీ లోపించిందని భావించకూడదు. వారి సిద్ధాంతం సంచరించే పరిధిని దాటడం వారికి సాధ్యం కావడం లేదు. అంతే. బోధనా రంగాన్ని వృత్తిగా ఎంచుకున్న వారు తమ వృత్తిలో పైస్థానాలకు ఎదగాలంటే, వారి పరిశోధనలు ప్రచురించబడాలంటే, వారికి అవార్డులు, పదవులు రావాలంటే వారు 'ప్రధాన స్రవంతి ఆర్థికశాస్త్రం' పరిధిని అతిక్రమించకుండా దానికి లోబడే వ్యవహరించాలి. ఆ పరిధిని గనుక అతిక్రమించి 'సామ్రాజ్యవాదం' వంటి అంశాలను చర్చించడానికి పూనుకుంటే అందుకు వారు భారీ మూల్యాన్ని చెల్లించాల్సి వస్తుంది. అందుచేత చాలామంది ఆర్థిక శాస్త్ర పండితులు ఆ పరిధులకు లోబడే నడుచుకోడానికి నిర్ణయించుకుంటారు. ఆ 'ప్రధాన స్రవంతి ఆర్థిక శాస్త్రం' అనేదానిలోనే సామ్రాజ్యవాదం అన్న విషయం కనిపించదు కనుక వారు దాని ఊసెత్తరు. అంతే తప్ప వారంతా నిజాయితీ లేని పండితులు అని, కావాలనే వారంతా అలా వ్యవహరిస్తున్నారని మనం అనుకోవద్దు.

ఒకటి, రెండు ఉదాహరణలతో ఈ విషయాన్ని బాగా గ్రహించవచ్చు. మొదటిది ఆర్థికవృద్ధికి సంబంధించిన సిద్ధాంతం. 'ప్రధాన స్రవంతి ఆర్థిక శాస్త్రం' పెట్టుబడిదారీ సమాజంలో శ్రామికజనం వృద్ధి చెందే రేటుతో ఆ సమా జపు ఆర్థికవృద్ధిని ముడిపెట్టి చూస్తుంది. అంటే ఆ సమాజంలో జనాభా సహజంగా పెరిగే రేటుతో అది ముడిపడి వుంటుందని భావిస్తుంది. ఈ దృక్పథంలో ఉన్న లోపం ఏమంటే అది సమాజం మొత్తంగా ఉన్న డిమాండ్ తాలూకు పాత్రను అది గుర్తించదు. ఆ దృక్పథం 'సే' సూత్రాన్ని విశ్వసిస్తుంది. సమాజంలో ఎంత ఉత్పత్తి అవుతుందో అదంతా చెల్లుబాటు అయిపోతుంది అని 'సే' సూత్రం అంటుంది. ఎక్కడైనా సూక్ష్మ స్థాయిలోనో, తాత్కాలికంగానో డిమాండ్ కొరత రావచ్చునేమో తప్ప మొత్తం మీద మార్కెట్‌లో ఎంత ఉత్పత్తి వస్తుందో అంత మేరకు సరిపడా డిమాండ్ ఉంటుందని ఆ సూత్రం చెప్తుంది. కాని ఇది చారిత్రికంగా చూసినప్పుడు వాస్తవం కాదు.

అమెరికా, కెనడా వంటి 'కొత్త ప్రపంచపు' దేశాలలో పెట్టుబడిదారీ విధానం నడవడానికి కావలసిన శ్రామిక జనాన్ని అందించడం కోసం 19వ శతాబ్దం వరకూ దాదాపు రెండు కోట్లమంది ప్రజలను ఆఫ్రికా నుండి బానిసలుగా పట్టి తెచ్చి నియోగించారు. వారిచేత గనుల్లో, తోటల్లో పని చేయించారు. అదే విధంగా భారత దేశం నుండి, చైనా నుండి దాదాపు ఐదు కోట్ల మంది శ్రామికులను ముందస్తు ఒప్పందాలు కుదుర్చుకుని ఆ కొత్త ప్రపం చానికి తరలించారు. ఇది దాదాపు మొదటి ప్రపంచ యుద్ధం దాకా కొనసాగింది. (అంతకుముందే యూరప్ నుంచి దాదాపు ఐదు కోట్ల మంది ప్రజానీకం ఇష్టపూర్వకంగానే కొత్త ప్రపంచానికి వలసలు వచ్చారు. ఆ కొత్త ప్రపంచంలో అంతవరకూ జీవిస్తున్న స్థానికులను వారి ఆవాసాల నుండి తరిమివేసి ఆ భూములను ఆక్రమించుకున్నారు). పెట్టుబడిదారీ విధానం విస్తరణ క్రమంలో ఇంత భారీ స్థాయిలో జనాభా ఒక దగ్గరినుండి మరొక చోటికి తరలించబడడం అనేది 'ప్రధాన స్రవంతి ఆర్థిక సిద్ధాంతం' చెప్పే వృద్ధి సిద్ధాంతానికి పూర్తిగా భిన్నంగా జరిగింది. జనాభా సహజ వృద్ధి మీద ఆధారపడి ఆర్థిక వృద్ధి జరుగుతుందనే ఆ సిద్ధాంతం ఇక్కడ వర్తించలేదు. అయినప్పటికీ, వాళ్లూ ఇప్పటికీ అదే వృద్ధి సిద్ధాంతాన్ని ప్రవచిస్తున్నారు. ఒకవేళ 'సామ్రాజ్యవాదం' అనేది లేకపోయి నట్లైతే ఈ వృద్ధి సిద్ధాంతం చెల్లుతుంది కదా అనే వాదన

చేసినవాళ్లూ ఉన్నారు. ఆస్ట్రియాకు చెందిన ఆట్టో బేయర్ అనే మార్క్సిస్టు ఈ విధమైన వాదనలనే చేశాడు. కాని పెట్టుబడిదారీ విధానం తన అవసరాల కోసం సాగించిన భారీ స్థాయి జనాభా తరలింపులను అతను గుర్తించనేలేదు. "21వ శతాబ్దంలో పెట్టుబడి" అనే గ్రంధాన్ని 2013లో రచించిన థామస్ పికెటీ సైతం చారిత్రకంగా ఖండాంతరాలను దాటి జరిగిన శ్రామిక జనుల నిర్బంధ తరలింపును తన సిద్ధాంతంలో పరిగణనలోకి తీసుకోలేదు.

ఇక రెండో ఉదాహరణ స్వేచ్ఛా వాణిజ్యానికి సంబంధించిన సిద్ధాంతం. స్వేచ్ఛా వాణిజ్యం ద్వారా ప్రతీ దేశమూ ప్రయోజనం పొందుతుంది అని ఈ సిద్ధాంతం చెప్తుంది. ప్రతీ దేశంలోనూ ఉత్పత్తి విధానంలో ఉండే అన్ని అంశాలూ (పరిశ్రమలు పూర్తి కెపాసిటీ మేరకు నడవడం, ముడిసరుకులు పూర్తి స్థాయిలో సరఫరా కావడం, కార్మికులు పూర్తి స్థాయిలో పనుల్లో నియోగించబడడం వగైరా) పూర్తి వినియోగంలో ఉంటాయన్నది ఈ సిద్ధాంతానికి ప్రాతిపదిక. స్వేచ్ఛా వాణిజ్యానికి అనుమతి నిచ్చిన తర్వాత కూడా ఉత్పత్తి విధానంలోని అన్ని అంశాలూ పూర్తి స్థాయిలో వినియోగించ బడుతూనే వుంటాయని, ఐతే, ఏ దేశం ఏ యే ఉత్పత్తులు చేస్తుందనేది మాత్రం మారుతుందని ఈ సిద్ధాంతం భావిస్తుంది. ప్రతీ దేశమూ తన వనరులను వినియోగించు కుంటూ మొత్తం ప్రపంచ మార్కెట్‌కు తగినట్టు పూర్తిస్థాయిలో ఉత్పత్తిని చేపడుతుందని, వివిధ దేశాల మధ్య పరస్పర సహకారం ఏర్పడుతుందని, దాని వలన అన్ని దేశాలూ వృద్ధి చెందుతాయని ఈ సిద్ధాంతం భావిస్తుంది. పరస్పర పోటీలో నిలదొక్కుకోగలిగినవారే మిగులుతారనే పోటీ సిద్ధాంతాన్ని అది తిరస్కరిస్తుంది.


అయితే ఇలా అన్ని దేశాలూ పూర్తి స్థాయిలో ఉత్పత్తిని చేపట్టగలగాలంటే ఆ ఉత్పత్తిని అంతటినీ పూర్తిగా వినియోగించగలిగే డిమాండ్ ఉండి వుండాలి. కాని ప్రపంచం మొత్తం మీద ఎంత డిమాండ్ ఉంటుందో అంతమేరకే ఉత్పత్తిని చేపట్టడం జరుగుతుంది కాని అందుకు భిన్నంగా కాదు. ఉన్న డిమాండ్‌కు మించి ఉత్పత్తి చేస్తే ఆ సరుకులు చెల్లుబాటు కాకుండా మిగిలిపోతాయి. అందుచేత ఒకానొక దేశంలో గనుక ఉత్పత్తి పెరిగితే, అది మరొక దేశంలో ఉత్పత్తి తగ్గిపోడానికి దారితీస్తుంది. అంటే స్వేచ్ఛా వాణిజ్యం ఫలితంగా అన్ని దేశాలూ వృద్ధి చెందుతాయనే వాదన చెల్లదు. కొన్ని దేశాలు బాగుపడడానికి మరికొన్ని దేశాల పరిస్థితులు దెబ్బ తినవలసిన పరిస్థితులను స్వేచ్ఛా వాణిజ్యం కల్పిస్తుంది. అందుకే వివిధ దేశాల నడుమ మార్కెట్ల మీద పట్టు కోసం పోరాటం జరుగుతూ వుంటుంది. ఇలా మార్కెట్లమీద అదుపు సాధించే లక్ష్యమే సామ్రాజ్యవాదం అనే స్వభావానికి మూలం. వాణిజ్యం అనేది ఒక పోరాటంగా చూడడం బదులు. అది పరస్పర సహకారంతో జరుగుతుందని చెప్పడం ద్వారా 'ప్రధాన స్రవంతి ఆర్థిక శాస్త్రం' సామ్రాజ్యవాదం అనే లక్షణాన్ని పూర్తిగా మరుగుపరుస్తుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థను సమర్థించే సిద్ధాంతవేత్త అయినప్పటికీ జాన్ మేనార్డ్ కీన్స్ ఈ మార్కెట్ల కోసం దేశాల నడుమ జరిగే పోరాటాన్ని గుర్తించాడు. అందుకే అతడు 'సే' సూత్రాన్ని తిరస్కరించాడు. ఒకానొక దేశం తన ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకోవాలంటే మార్కెట్ల కోసం పోటీ పడవలసిందేనని అతడు తెలిపాడు. అటువంటి పోటీని తట్టుకోవాలంటే దేశీయ మార్కెట్‌లోని డిమాండ్‌ను బలోపేతం చేయాల్సి వుంటుందని, పూర్తిస్థాయిలో అందరికీ ఉపాధి కల్పించే విధంగా ప్రభుత్వం జోక్యం కల్పించుకున్నప్పుడే దేశీయ డిమాండ్ బలపడుతుందని కీన్స్ ప్రతిపాదించాడు. అదే విధంగా దేశీయ మార్కెట్‌ను, ఉత్పత్తిదారులను, అంతర్జాతీయ పోటీ తాకిడినుండి కాపాడ దానికి సైతం ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని అతను చెప్పాడు. అంటే స్వేచ్ఛా వాణిజ్యం ప్రయోజనకరం అనే సిద్ధాంతాన్ని అతడు తిరస్కరించడాన్నమాట.

కాని ఇప్పటికీ, స్వేచ్ఛా వాణిజ్యం సిద్ధాంతాన్ని చిలక పలుకుల్లా వల్లించేవారు ఉన్నారు. వారంతా మార్కెట్ మొత్తం మీద డిమాండ్‌కు ఏర్పడే కొరతను పరిగణనలోకి తీసుకోరు. అందువలన మార్కెట్ కోసం అనివార్యంగా తీవ్రమైన పోటీ ఉంటుందనే వాస్తవాన్ని వారు గుర్తించలేకపోతున్నారు. ఆ పోటీ సామ్రాజ్యవాదానికి దారి తీస్తుందని వారు గుర్తించరు. నిజానికి సామ్రాజ్యవాదం అనే ధోరణిని కప్పిపుచ్చడానికే వాళ్ళు స్వేచ్ఛా వాణిజ్యం సిద్ధాంతాన్ని ముందుకు తెస్తున్నారు. దానిని సమర్ధించుకోడానికి కాలం చెల్లిన 'సే' సూత్రాన్ని జపిస్తున్నారు.

మూడో ప్రపంచ దేశాలలో పరిశ్రమలను వలసపాలన కాలంలో నాశనం చేయడం, ఆ దేశాలకు తమ పారిశ్రామిక సరుకులను పెద్ద ఎత్తున దింపి మార్కెట్‌ను చేజిక్కించుకోవడం చారిత్రక వాస్తవం. కాని, ఈ చారిత్రక అనుభవాన్ని కూడా స్వేచ్ఛా వాణిజ్య సిద్ధాంతకారులు గుర్తించరు. అందుచేత మూడో ప్రపంచ దేశాలలో నెలకొన్న పేదరికానికి మూలం సామ్రాజ్యవాదుల దోపిడీయే అన్న సత్యాన్ని, సంపన్న దేశాలతో వాణిజ్యం నిజానికి మూడో ప్రపంచ దేశాలకు ప్రతికూలంగా ఉంటుందనే సత్యాన్ని వారు కప్పిపుచ్చే పనిలో ఉన్నారు. అందుకే ఈ 'ప్రధాన స్రవంతి ఆర్థిక శాస్త్రం' అనేది నిష్పాక్షిక మైనదేమీ కాదు. అది సామ్రాజ్యవాద దోపిడీని కప్పిపుచ్చే సైద్ధాంతిక మాయాజాలం. ❑

# సంక్షోభంలో పాలక పక్షాల రాజకీయం : ప్రత్యామ్నాయ రాజకీయం తక్షణ అవసరం



- డి.వి.వి.ఎస్.వర్మ

దేశంలో రాజకీయ సంక్షోభం పొంచి వుందన్న ఊహాగానాలు వస్తున్నాయి. మోదీ ప్రభుత్వం బలహీనపడిన మాట వాస్తవం. మోదీ ఏక పక్షంగా వ్యవహరించడం సాధ్యం కాదు. గతంలో ఎన్‌డిఏ నుండి విభేదించి బయటకు పోతామంటే తలుపులు తెరచి సాగనంపే స్థితి లేదు. ఇప్పుడు మోదీ తన మిత్రులతో సర్దుకుపోవాలి. లేకపోతే మొదటికే మోసం వస్తుంది. అధికార పీఠం గల్లంతవుతుంది. అంతటి దుస్సాహసానికి మోదీ పూనుకునే అవకాశం ప్రస్తుతానికి లేదు. అలాగే మోదీ కూటమిలో వున్న రెండు ప్రధాన పక్షాలు రెండు పెద్ద రాష్ట్రాల్లో అధికారంలో వున్నాయి. అవి తమ మనుగడ కోసం మోదీ ప్రభుత్వం మీద ఆధారపడక తప్పని స్థితి వుంది. ఈ నేపథ్యంలో దేశంలో రాజకీయ సంక్షోభం కొంతకాలం వాయిదాపడే అవకాశం ఎక్కువగా వుంది. ఇదే సమయంలో దేశాన్ని చుట్టు ముట్టిన మరో సంక్షోభం పుట్టుకొచ్చింది. కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ పాలకపక్ష రాజకీయం సంక్షోభ దశ మొదలైంది. "అప్పులతో అభివృద్ధి - బడ్జెట్ పరిధిలో సంక్షేమం" అన్న విధానాల అమలుకు కాలం దగ్గర పడింది. ప్రజలపై మరింత భారం మోపి అదనపు నిధులు సమకూర్చుకునే దారులు మూసుకుపోతున్నాయి. 2014 లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి 50 లక్షల కోట్లుగా వున్న అప్పులు 2025 నాటికి కోటీ 82 లక్షల కోట్లకు చేరుకుంటుంది. దానికి చెల్లించాల్సిన వడ్డీ ఏటా 11 లక్షల కోట్లు. కేంద్ర బడ్జెట్‌లో అత్యధిక కేటాయింపు దీనికే దక్కింది. ఈ ఏడాదికి కొత్తగా చేసే అప్పు 14 లక్షల కోట్లు. వడ్డీకి పోగా మిగిలేది మూడు లక్షల కోట్లే. ఈ సంత్సరం కొత్త అప్పు తగ్గింది. అవసరాలు లేక కాదు అప్పులు పుట్టని స్థితికి చేరుకున్నాం. పర్యవసానంగా సంక్షేమానికి కత్తిరింపులు వేశారు. మొత్తం మీద బడ్జెట్‌లో అభివృద్ధికి అవసరమైన నిధులు, తాత్కాలిక ఉపశమనానికి పేదల సంక్షేమానికి నిధులు లేవు. రాష్ట్రాలకు అదనపు నిధులిచ్చే పరిస్థితి లేకపోగా పన్నుల పంపకంలోనూ రకరకాల పద్ధతుల్లో కోతలు పెడుతున్నారు. దీనితో రాష్ట్ర ప్రభుత్వాల స్థితి మరింత దారుణంగా మారింది. అవి ఇప్పటికే అప్పుల కుప్పలుగా వున్నాయి. ఎన్నికల్లో గెలుపు కోసం చేసిన వాగ్దానాలు నెరవేర్చలేని స్థితిలో సతమతం అవుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక వనరుల నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధిని ముందుకు సాగించే అవకాశాలు లేవు. వీటి బడ్జెట్ల పరిధిలో తాత్కాలిక ఉపశమన సంక్షేమ పథకాలు విస్తరించే వీలులేదు. ఈ తరహా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాజకీయ పాలనా విధానాలు అనివార్యంగా సంక్షోభంలో పడ తాయి. ఈ సంక్షోభం నుండి దేశ ప్రజలను ఒడ్డుకు చేర్చడానికి ప్రత్యామ్నాయ రాజకీయం తక్షణ అవసరం అవుతుంది. ముందుగా పదేళ్ళ మోదీ పాలనలో ప్రపంచంలోనే అత్యధికంగా అంతరాలు పెరిగిన దేశంగా మారింది. 2013 నాటికి 50 మంది బిలియనీర్లు అంటే 100 కోట్లకు పైబడిన డాలర్ల సంపద గలవారు లేదా 8000 కోట్లకు రూపాయలకు పైబడిన సంపదగలవారు వుంటే 2024 నాటికి 169 మంది బిలియనీర్లు పుట్టుకొచ్చారు. ప్రపంచ బిలియనీర్లలో అమెరికా, చైనా తర్వాత మూడో స్థానానికి దూసుకుపోయింది. ఈ 169 మంది బిలియనీర్ల దగ్గరే 78 లక్షల కోట్ల సంపద పోగుపడింది. ఆక్స్ ఫామ్ నివేదికల ప్రకారం దేశంలో 1 శాతం దగ్గర 46 శాతం దేశ సంపద పోగుపడగా 10 శాతంగా వున్న బిలియనీర్లు, కార్పొరేట్లు, కుబేరుల దగ్గర మొత్తం దేశ సంపదలో 77 శాతం గుట్టపడింది. ఇలా ఒక దశాబ్ద కాలంలోనే జరిగిన అరుదైన దేశ సంపద కేంద్రీకరణ. స్థూలంగా 10 ఏళ్ల మోదీ పాలన ప్రధానంగా కార్పొరేట్ల కోసం సాగిన పాలన. దాని పర్యవ సానంగానే దేశ సంపద వారి పంచకు చేరింది. ఈ 10 ఏళ్లలో 35 శాతం గావున్న కార్పొరేట్ పన్నును అంచెలంచెలుగా 22 శాతానికి తగ్గించారు.వారికే దాదాపు 20 లక్షల కోట్ల అప్పులను రద్దు చేశారు. గతంలో 10 శాతం వున్న వారసత్వ పన్నును పూర్తిగా తొలగించారు. ఇది మోదీ పాలన సంగ్రహ చిత్రం. దేశంలో ప్రస్తుతం నెలకొన్న ప్రధాన వైరుధ్యాన్ని ఇది స్పష్టం చేస్తున్నది. దేశ సంపదను కార్పొరేట్లు స్వంతం చేసుకుంటూ పోతున్నారు. మరో పక్క రైతులు, సామాన్యులు, పేదలు కార్పొరేట్ల అనుకూల పాలనలో నలిగి పోతున్నారు.

10 శాతంగా వున్న కార్పొరేట్ల దోపిడీకి - 75 శాతం నలిగి పోతున్న దేశ ప్రజలకీ మధ్య నెలకొన్న వైరుధ్యమే ప్రస్తుత ప్రధాన వైరుధ్యంగా గుర్తించాలి. కార్పొరేట్లను కట్టడి చేసి వారి దగ్గర పోగుపడ్డ సంపదను పునః పంపిణీ చేసే నినాదం తప్పని సరి అవుతుంది. దేశంలో 10 శాతం దగ్గర పోగు పడ్డ సంపదను పునః పంపిణీ అన్నది ప్రత్యామ్నాయ రాజకీయం నినాదం కావాలి. ఇది కార్పొరేట్ల మీద నాలుగు పన్నులు విధించడం ద్వారా సులభంగా సాధించ వచ్చును. మొదటిది ప్రస్తుతం 22 శాతంగా వున్న కార్పొరేట్ పన్నును మరికొంత పెంచడం.

రెండవది సంపద పన్నును వృద్ధి క్రమానుగతంగా విధించడం, మూడవది ప్రస్తుతం వున్న కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ పన్నును వృద్ధిక్రమానుగతంగా విధించి దానిని జాతీయ సంక్షేమ నిధిగా మార్చడం. నాలుగవది తొలగించిన వారసత్వ పన్ను స్థానంలో తిరిగి ప్రపంచ దేశాల స్థాయిలో విధించడం. ఇవి కార్పొరేట్ల దగ్గర పోగుపడ్డ సంపదను పునః పంపిణీకి దారితీస్తుంది. దేశంలో నిజమైన ప్రత్యామ్నాయ సంక్షేమ రాజ్యాన్ని సాధించగలుగుతుంది. పైన సూచించిన నాలుగు పన్నుల్లో 1 శాతం మంది దగ్గర పోగుపడ్డ సంపద మీద కనీసం 2 శాతం సంపద పన్ను విధిస్తే 8 లక్షల కోట్లు వస్తాయని , మూడోవంతు వారసత్వ పన్ను విధిస్తే 6.67 లక్షల కోట్లు వస్తాయని ప్రముఖ ఆర్థిక తత్వవేత్త ప్రభాత్ పట్నాయక్ లెక్క తేల్చారు. పైన పేర్కొన్న నాలుగు పన్నులనూ దేశంలో 10 శాతం కుబేరుల మీద వృద్ధిక్రమానుగతంగా విధిస్తే 20 లక్షల కోట్లకు మించిన అదనపు నిధులు సమకూరతాయి. అయినా ఇలా పునఃపంపిణీకి పన్నుల ద్వారా తీసుకునే సొమ్ము కుబేరుల సంపదలో అతి చిన్న భాగంగానే వుంటుంది.

### ఒక ప్రజా ఉద్యమంగా ప్రత్యామ్నాయ రాజకీయం

ప్రత్యామ్నాయ రాజకీయం పూర్తిగా భిన్నమైంది. వ్యవస్థాగత మార్పులను సాధించే లక్ష్యం కోసం, ప్రజల నిత్యజీవన సమస్యల పరిష్కారం కోసం సాగించాల్సిన ఉద్యమం. దీనికి కేవలం అధికార మార్పిడి మాత్రమే ఏకైక లక్ష్యం కాదు. వ్యవస్థాగత మార్పులను సాధించే అధికార మార్పిడి లక్ష్యంగా వుంటుంది. ప్రస్తుత పాలకపక్ష రాజకీయం ప్రజలను "లబ్ధిదారులను" చేసింది. ప్రత్యామ్నాయ రాజకీయం వారిని "హక్కు దారులను" చేస్తుందనే కొత్త ఆకాంక్షలను ప్రజల్లో కల్పించాలి. మొదటగా పాలనా సంక్షోభ పరిష్కారానికి తగిన ప్రత్యామ్నాయ రాజకీయానికి అత్యధికులకు మేలు చేసే "సంపద పునః పంపిణీ" అన్నది నినాదం. రెండవది నాలుగు రకాల పన్నుల ద్వారా కార్పొరేట్ల సంపదను కట్టడి చేసి ఆచరణ సాధ్యమైన అదనపు నిధుల సమీకరణ మార్గాలు వెల్లడించడం. మూడవది సంపద పునః పంపిణీ ద్వారా హక్కుగా పొందే సంక్షేమం, స్వతంత్ర జీవనం గురించి కొన్ని ప్రతిపాదనలు వుంటే ప్రత్యామ్నాయ రాజకీయ ప్రజా ఉద్యమానికి అవసరమైన మూడు అంశాలు పరిపూర్తి అవుతాయి. బడ్జెట్ నిధులతోపాటు సంపద పునఃపంపిణీ అదనపు నిధులతో శ్రమజీవులకు పేదల కుటుంబాలకు స్వతంత్ర జీవనాన్ని ఇచ్చే మౌలిక ఆదాయాన్ని కల్పించడం-అందరికీ ఉచితంగా మంచి ప్రమాణాల విద్య, వైద్య సేవలు, ఆహార భద్రత, నివాస వసతులను హక్కుగా కల్పించడం. కులపరమైన లింగపరమైన మతపరమైన వివక్ష ను తొలగించడానికి ప్రత్యేక నిధుల కేటాయింపు. స్వామినాథన్ కమిషన్ సూచన మేరకు చట్టబద్ధంగా వ్యవసాయ పంటలన్నిం టికీ లాభసాటి ధరలందించడం. పంటల వారీగా రైతులే నిర్వహించుకునే ప్రత్యామ్నాయ మార్కెట్లకు నిధులు నిరుద్యోగు లకు అర్హతకు తగిన ఉపాధి కల్పనకు ప్రభుత్వ పెట్టుబడులను పెంచడం వృద్ధులకు వేతన జీవులకు ఆదాయ పన్ను మినహాయింపు గణనీయంగా పెంచడం వగైరాలు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. ❑

## భారతీయ బిలియనీర్లలో ముకేశ్‌ను దాటేసిన గౌతం అదానీ

దేశంలో అతిపెద్ద కుబేరుడి స్థానంలో ఉన్న రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీని దాటేసి.. 2024 హురున్ ఇండియా సంపన్నుల జాబితాలో గౌతం అదానీ మొదటి స్థానంలో నిలిచారు. అదానీ అండ్ కుటుంబ సంపద విలువ రూ.11.6 లక్షల కోట్లని హురున్ ఇండియా పేర్కొంది. గతేడాది ప్రతి ఐదు నిమిషాలకో బిలియనీర్ పుట్టుకొచ్చాడని వెల్లడించింది. 2024 జూన్ 31 నాటికి అందుబాటులో ఉన్న గణాంకాల ఆధారంగా సంపన్నుల జాబితా రూపొం దించినట్లు హురున్ ఇండియా పేర్కొంది. రూ.10,14,700 కోట్ల వ్యక్తిగత సంపదతో రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ రెండో స్థానంలో నిలిచారు. రూ.3.14 లక్షల కోట్లతో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ అధినేత శివ్ నాడార్ అండ్ ఫ్యామిలీ మూడో స్థానానికి చేరుకున్నది. ఇక వ్యాక్సిన్ల తయారీ సంస్థ సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా అధినేత సైరస్ ఎస్ పూనావాలా అండ్ కుటుంబం, సన్ ఫార్మాస్యూటి కల్స్ అధినేత దిలీప్ సంఘీ నాలుగు, ఐదు స్థానాల్లో వున్నారు. గత ఐదేళ్లుగా టాప్-10 భారత కుబేరుల్లో ఆరు గురు వ్యక్తులు కొనసాగుతున్నారు. వారిలో గౌతం అదానీ అండ్, ముకేశ్ అంబానీ, శివ్ నాడార్, సైరస్ ఎస్ పూనావాలా, గోపిచంద్ హిందుజా, డీమార్ట్ అధినేత రాధాకిషన్ దమానీ కుటుంబాలు ఉన్నాయి. తొలిసారి హురున్ ఇండియా సంపన్నుల జాబితాలో బాలీవుడ్ నటుడు షారూఖ్ ఖాన్ చోటు దక్కించుకున్నారు. ఐపీఎల్ ఫ్రాంచైజీ కోల్‌కతా నైట్ రైడర్స్, రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థల్లో వాటా విలువ పెరగడంతో భారత్ సంపన్నుల జాబితాలో ఆయనకు ప్లేస్ దక్కింది. ఆయన వ్యక్తిగత సంపద రూ.7300 కోట్లు అని పేర్కొంది. 21 ఏళ్ల కైవల్య వోహ్రా అనే కుర్రాడు సైతం హురున్ ఇండియా రిచ్ లిస్ట్‌లో ప్లేస్ కొట్టేశారు. యంగ్ బిలియనీర్స్ ఇండియా లిస్టులో జెప్టో సహ-వ్యవస్థాపకులు కైవల్య వోహ్రా, ఆదిత్ పలిచా ఒకటి, రెండు స్థానాల్లో నిలిచారు.

# వేద గణితం అబద్ధం : 'సున్నా'ను కనుగొంది బౌద్ధులే!



- డాక్టర్ దేవరాజు మహారాజు

> **"బౌద్ధుల ఆదర్శ పద్ధతులను, మానవీయ సిద్ధాంతాలను అనుసరించకుండా బ్రాహ్మణులు వారికి ఎదురు నిలవడం అసాధ్యమని తేలిపోయింది. బుద్ధుని మహా పరినిర్వాణం తర్వాత, బౌద్ధులు ఆయన స్ఫూర్తిమంతమైన మూర్తిని శిల్పించుకుని ప్రతిష్ఠించుకున్నారు. అనేక స్థూపాలను నెలకొల్పు కున్నారు. ఇక, తప్పని పరిస్థితుల్లో వైదిక మతస్థులయిన ఆర్య బ్రాహ్మణులు బౌద్ధారామాల్ని నాశనం చేసి, దేవాలయాలను నిర్మించుకున్నారు. బుద్ధుడి మూర్తిని మార్చి, వాటితో శివుడు, విష్ణువు, రాముడు, కృష్ణుడు వంటి వారి ఇష్టదైవాల విగ్రహాలనే ఏర్పాటు చేసుకున్నారు" డా. బి.ఆర్.అంబేద్కర్.**

ఈ చిన్న ప్రకటన విస్తృతమైన చరిత్రను మన కళ్ల ముందుంచుతుంది. మధ్య ఆసియా, చైనా ప్రాంతం నుంచి వచ్చిన మంగోలాయిడ్ జాతికి చెందిన చెంఘిజ్‌ఖాన్ వారసులు కుషాణులు, కుషాణుల్లో మూడవ రాజైన కనిష్కుడి నాణాలను 'దీవార్'లని అనే వారు మొదటిసారి తన బంగారు నాణాలపై అంటే దీవార్‌లపై కనిష్కుడు బుద్ధుడి రూపాన్ని ముద్రించాడు. ఈ చర్య వల్లే బుద్ధుడి విగ్రహాల తయారీ, ఆ తరువాత విగ్రహారాధన మొదలయ్యాయి. ఒక రకంగా ఆలయాల నిర్మాణం, విగ్రహాల తయారీ, విగ్రహారాధన, పూజలు-అన్నీ బౌద్ధం నుంచే మొదలయ్యాయి అనడానికి చారిత్రక ఆధారాలు వున్నాయి. వాటిని కొల్లగొట్టి వైదిక మతస్థులు తాము కల్పించుకున్న దేవుళ్లను పూజించడం ప్రారంభించారు. అయితే వారు ఆ విషయం ఒప్పుకోరు. తమదే ప్రాచీన సంస్కృతి అని, తమదే సనాతన ధర్మమనీ ప్రకటించుకుంటూ ఉంటారు. మరి సాధారణ శకానికి ముందు, తాము తమ దేవుళ్లకు కట్టుకున్న ఆలయాలు ఎందుకు లేవన్న ప్రశ్నకు జవాబు చెప్పలేరు. బౌద్ధారామాల విధ్వంసంతోనే తమ ఆలయాల నిర్మాణం ప్రారంభమైందని ఒప్పుకుంటే గొడవే ఉండదు. కానీ, వారు ఆ పనిచేయరు. ఏపీలోని పంచారామాలది అదే పరిస్థితి. 1.ద్రాక్షారామం 2.భీమారామం 3.సర్పారామం 4.అమరారామం. 5.కొమరారామం. ఈ పంచారామాలలో బౌద్ధ భిక్షువులు ఉండేవారు. ఏకాంత నివాస స్థలాన్ని బౌద్ధులు 'ఆరామమం' - అని పిలిచేవారు. ఇందుకు వారు ఉచితంగా బౌద్ధ ధమ్మాన్ని (బుద్ధుని బోధనల్ని) బోధించేవారు. వీటిలో గదులు నిర్మించబడి ఉండేవి. ఈ పంచారామాలలో 1.సిద్ధార్థుడి జననం 2.మహాభినిష్క్రమణం 3.సంభోదిని పొందుట 4.సత్యాన్ని బోధించుట 5.మహా పరినిర్వాణం వంటి అయిదు ప్రధానమైన ఘట్టాలను తెలియజేసే విధంగా ఈ పంచారామాలలో బౌద్ధులు అయిదు స్తంభాలు నిర్మించారు. అయితే వీటిని తొలగించిన బ్రాహ్మణులు పైన గుండ్రటి ఆకారాన్ని రూపొందించి 'శివలింగం' అంటూ నమ్మించారు. అందుకు తగినట్టుగా కట్టుకథలు ప్రచారం చేశారు. శ్రమ చేయకుండా జీవించాలన్న దురుద్దేశంతో శ్రమన సంస్కృతిని ఒక పథకం ప్రకారం నాశనం చేస్తూ వచ్చారు. ఆంధ్రదేశంలో సాధారణ శకం 9-10 (C.E) శతాబ్దాలలో తూర్పు చాళుక్య ప్రభువైన చాళుక్య భీముని కాలంలో బౌద్ధారామాలను శైవ దేవళాలుగా మార్చారు.

బ్రాహ్మనిజం చేసిన ఘోరాలు విద్యారంగంలో, భాషా సాహిత్యాల విషయంలోను ఎంత దారుణంగా ఉండేవో అర్థం చేసుకోవాలంటే ఈ ఉపోద్ఘాతం అవసరమనిపించింది. ఈ నేపథ్యంలో నుంచి ఆయా విషయాలు చూద్దాం! 'వేదగణితం' అని చెప్పబడుతున్నది అసలు వేదాలలో లేదు. మరి ఈ వేదగణితం అనే రోగం ఎలా మొదలయ్యిందీ? అంటే కొన్ని పూర్వాపరాలు తెలుసుకోవాలి! భారతదేశంలో సింధూ నాగరికత నాటి గణిత పరిజ్ఞానం కాలగర్భంలో కలిసిపోయింది. వేదకాలంలో గణితశాస్త్రం అభివృద్ధి కాలేదు. గణితాన్ని అభివృద్ధి చేసినవారు. గణితంలో సున్నాను(0) కనుగొన్న వారు- బౌద్ధులే! బౌద్ధుల గణిత పరిజ్ఞానమే అరబ్బులకు చేరింది. అతి పెద్ద సంఖ్యల వివరాలు, గణిత పరికర్మలు సాధారణ శకానికి ముందు మూడవ శతాబ్దం (BCE) నాటి బౌద్ధ గ్రంథం 'లలిత విస్తరం'లో విస్తారంగా ఉన్నాయి. ఆ తర్వాత సాధారణ శకంలో ఆర్యభట్ట (476-550) చేసిన కృషి ఎంతో విలువైనది. ఆర్యభట్ట మొదట నలందా విశ్వ విద్యాలయ విద్యార్థి. తరువాత కాలంలో అందులో ఆధ్యాపకుడయ్యాడు. కాలక్రమంలో ఒక విభాగానికి అధిపతి ఆయి-ఖగోళ శాస్త్రం, గణితం, భౌతిక శాస్త్రాలలోనే కాక - జీవశాస్త్రం, వైద్య శాస్త్రాలలో ఎంతో మంది పరిశోధకులను ప్రోత్సహించాడు. మొసపోటేమియా, గ్రీకు

ప్రాంతాల నుండి వచ్చిన పరిశోధనల సారాంశాన్ని అర్థం చేసుకుని, వాటిని మెరుగు పరిచాడు. ఆర్యభట్ట గణిత శాస్త్రంలో ముఖ్యంగా అర్థమెటిక్ (అంకగణితం) ఆల్ జీబ్రా (బీజగణితం) ప్లేన్ ట్రిగనామెట్రీ, స్పెరికల్ ట్రిగనామెట్రీ, కంటిన్యూడ్ ఫ్రాక్షన్స్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, పవర్ సీరీస్, టేబుల్ ఆఫ్‌సైన్ వంటి వాటిని విస్తరించాడు. అర్థం చేసుకోవాల్సిన ముఖ్యమైన విషయమేమంటే, నాటి పరిశోధకులు, శాస్త్రవేత్తలు అందరూ బౌద్ధులే. వారి చిత్ర పటాలకు నిలువుబొట్లు అడ్డంబొట్లు పెట్టి - వారు వైదిక మతస్థులు అయినట్లు ప్రచారం చేశారు. ఒక రకంగా వైజ్ఞానిక శాస్త్ర చరిత్రను కూడా బ్రాహ్మణీకరించిన ఘన చరిత్ర వైదిక మతస్థులదే - తర్వాత కాలంలో వచ్చిన బ్రహ్మ గుప్త (598) భాస్కర (476-550) వంటి వారంతా ఈ కోవలోని వారే. భాస్కరుడు 'సిద్ధాంత శిరోమణి' (1150C.E) కరణ కుతూహలం (1177-C.E) వంటి గ్రంథాలు రచించాడని తెలుస్తోంది. సిద్ధాంత శిరోమణి లోని తొలిభాగం "శుద్ధగణితం" - దీన్నే తర్వాత కాలంలో 'అంకగణితం' అని అన్నారు. అదే లీలావతి గణితంగా ప్రసిద్ధి పొందింది. అయితే అంతకు ముందే 814 C.Eలో కర్నాటకకు చెందిన వీరాచార్యుడు 'గణిత సార సంగ్రహం' అనే గ్రంథం రచించాడు. కవి తిక్కన మిత్రుడైన పావులూరి మల్లన్న ఇదే గణితసార సంగ్రహాన్ని చక్కటి పద్య కావ్యంగా తెలుగులోకి అనువదించాడు. ఈ విధంగా బౌద్ధులతో ప్రారంభించబడ్డ గణిత శాస్త్రం - వారి తర్వాత అదే పేరుతో సామాన్య ప్రజలకు అందుబాటులో కొచ్చింది. 1965లో భవతీ తీర్థ అనే అతను "వేదిక్ మేథమేటిక్స్" అనే గ్రంథం వెలువరించాడు. అబద్ధంతో సమాజాన్ని కలుషితం చేశాడు. ఆనాటి నుండి కొందరు 'కుహనా గణిత శాస్త్ర వేత్తలు వేదగణితం పేరుతో ఉన్నవీ లేనివీ కలిసి - వ్యాపారం చేసుకుంటున్నారు. అందుకే, విషయాలు మూలాల్లోకి వెళ్లి గ్రహించడం అవసరం!

ఆ కాలంలో దేశంలో ఉన్నవి మూడు భాషలు - పాలి, ప్రాకృతం, సంస్కృతం. పాలి భాషను బ్రహ్మీలిపిలో రాసేవారు. జైనులు ప్రాకృతాన్ని ఉపయోగించేవారు. ఆనాటి ప్రజల భాష అయిన పాలి భాషలో బుద్ధుడు బోధనలు చేసేవాడు. ఈ భాషల్ని సంస్కరించుకుని ఏర్పరుచుకున్నదే సంస్కృతం. దీన్ని బ్రాహ్మణులే ఎక్కువగా ఉపయోగించే వారు. పైగా అది ప్రజలకు అందకుండా అడ్డుకునేవారు. ఆ రకంగా తమ ఆధిపత్యం కొనసాగాలని తాపత్రయపడ్డారు. కానీ, ఆ కారణంగానే అది ప్రజలకు చేరువ కాకుండా క్షీణిస్తూ వచ్చింది. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే సంస్కృతం మాట్లాడటానికి పనికొచ్చేది మాత్రమే! రాసుకోవడానికి వీలయ్యేది కాదు. ఎందుకంటే అది లిపి లేని భాష. అయితే వారు, భారతదేశంలో చలామణిలో ఉన్న 'నాగరి' భాషలో రాసుకుని కాపాడుకున్నారు. దాన్నే ఉన్నతీకరించి 'దేవనాగరి లిపి' అని చెప్పుకున్నారు. ఏకంగా ఆ భాషను 'దైవ భాష' అని కూడా ప్రచారం చేసుకున్నారు.

మౌర్య సామ్రాజ్యాన్ని స్థాపించిన చంద్రగుప్త మౌర్యుడు. జైన మతాభిమాని. తరువాత వచ్చిన బిందు సాగుడూ అదే మతాన్ని అవలంభించాడు. ఆ తరువాత వచ్చిన అశోకుడే, బౌద్ధమతం స్వీకరించి - దాన్ని దేశంలో ఉధృతంగా ప్రచారం చేశాడు. తన కుమారుడు మహేంద్రను, కూతురు సంఘమిత్రలను శ్రీలంకకు పంపి, అక్కడ బౌద్ధం వ్యాపింపజేయడంలో చొరవ తీసుకున్నాడు. సర్వ మానవ సమానత్వ, సౌభ్రాతృత్వం, శాంతి, అహింస, వంటి బుద్ధుడి సూత్రాల్ని చక్రవర్తిగా అశోకుడు విస్తృతంగా ప్రచారం చేశాడు. ప్రపంచంలో భారతదేశానికి గౌరవ ప్రతిష్టలు పెరిగాయంటే ఈ సూత్రాల వల్లనే - సాధారణ శకానికి పూర్వం 3వ శతాబ్దం (BCE)లో సమ్రాట్ అశోక్ మౌర్య చేసిన ప్రకటన ఇలా ఉంది. "నా పుత్ర పౌత్రాదులు జీవించునంత కాలం, సూర్య చంద్రులు వెలుగొందునంత కాలం, బౌద్ధ ధమ్మం మహోజ్వలంగా భాసిల్లుతుంది బుద్ధుణ్ణీ, అతని ధమ్మ మార్గాన్నీ అనుసరించే ప్రజలు తమ జీవితాంతం సుఖశాంతులను పొందగలుగుతారు!!" యజ్ఞయాగాల వల్లగానీ, జంతు బలుల వల్లగానీ, వేద పురాణాల వల్ల గానీ, కల్పించుకున్న దేవీ దేవతల వల్లగానీ ఈ దేశప్రతిష్ట ప్రపంచంలో పెరగలేదు. పైగా అంధ విశ్వాసాలు మాత్రం విపరీతంగా పెరిగాయి. సమకాలీనంలో కూడా మన దేశ నాయకులు ఇతర దేశాలకు వెళ్లినపుడు తాము 'బుద్ధభూమి' నుండి వచ్చామని గర్వంగా చెప్పుకుంటున్నారు కదా? తాము యుద్ధభూమి నుండి రాలేదని తమ శాంతి కాము కత్వాన్ని ప్రకటిస్తున్నారు కదా? తప్పదు - వారికి మరో మార్గం లేదు.

నాగార్జునుడి 'శూన్యవాదం'లోని సారాన్ని పిండుకుని శంకరుడు అద్వైతాన్ని తయారు చేశాడంటారు. నిజం చెప్పాలంటే మహాయాన బౌద్ధం - మొదటి భాగమైతే, అద్వైతం- రెండవ భాగమవుతుంది! విశ్వంలో ప్రతిదీ పరస్పర ఆధారితం- ఏదీ స్వత సిద్ధం కాదు గనక, అంతా శూన్యమేననే నాగార్జునుడి వాదనను శమకరుడు 'జగన్మిథ్య'గా మార్చుకున్నాడు. బుద్ధుడు బోధించిన నిర్మాణంతో 'కార్యకారణ బంధ:' అంతమవుతుంది. నిర్వాణం వైదిక పరిభాషలో 'మోక్షం' అయ్యింది. బ్రహ్మ మొక్కటే- అని తెలుసుకోవడమే మోక్ష సాధనం అంటాడు. శంకరుడు. అందువల్ల ఎంత నిరాకరించినా శంకరుడి ఆలోచనలు బౌద్ధంలోంచి వెలువడినవే ! ఆయనను 'ప్రచ్ఛన్న బుద్ధ' డన్నది కూడా అందుకే! "బౌద్ధాన్ని శ్రద్ధగా అధ్యయనం చేసే, ఇది హేతువు (కారణం/రుజువు)పై ఆధారపడి ఉందని స్పష్టమౌతుంది. ఏ ఇతర మతాలలో లేని సరళత బౌద్ధ జీవన విధానంలో మాత్రమే ఉంది" అని అన్నారు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ❑

# కశ్మీరం ఎటు వెళుతోంది?



\- రాహుల్ కుమార్

చరిత్రను విస్మరించటం మనకు కొత్తకాదు. చరిత్రను తవ్వి తీయటమూ వింతకాదు. అలా తవ్వితీయటం మనల్ని ఒక్కోసారి నిర్ఘాంతపరుస్తుంది. నిశ్చేష్టులను చేస్తుంది. ఆగ్రహాన్ని పుట్టిస్తుంది. ఆవేశాన్ని రగుల్చుతుంది. ఆవేదన పొంగేలా చేస్తుంది. నిశ్చితాభిప్రాయాల్ని తలకిందులు చేస్తుంది. ఇంత గాఢ భావోద్వేగాలను కలిగించే చరిత్రను ఒకపట్టాన విస్మరించలేం! నిత్యం ఏదోరకంగా రగిలిపోయే కశ్మీర్‌పై ఇలా తవ్వితీసిన చరిత్ర ఒకటి ఇటీవల జనం ముందుకు వచ్చింది. కశ్మీర్ టైమ్స్ పత్రికకు ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా ఉన్న ప్రముఖ జర్నలిస్టు అనురాధ భాసిన్ 'ఎ డిస్‌మాంటల్డ్ స్టేట్' అనే పేరుతో రాసిన చరిత్రను విస్మరిద్దామనుకున్నా విస్మరించలేం! ఆర్టికల్ 370 రద్దుకు ముందూ తర్వాతా కశ్మీర్‌లో జరిగిన పరిణామాలపై ఇప్పటి వరకూ వినిపించని కథ వినిపిస్తున్నానంటూ సాహసోపేతంగా ఎన్నో ఘటనలను కళ్లముందుంచారు. విస్మరించలేని భావనాశక్తితో ఒక రచన ఊగిపోతే దాంతో విభేదించే శక్తులూ ఉంటాయి. భిన్న ప్రయోజనాలు కాంక్షించే జన సమూహాలున్న సమాజంలో దేన్నీ ఒక దృష్టితో చూడటం అసాధ్యం. అందుకే కశ్మీర్‌పై ఏకాభిప్రాయం రావటం కష్టం ! ఏకాభిప్రాయం అసాధ్యమైనా ఉన్న అభిప్రాయాల్లో న్యాయ బద్ధమైనవి లేకుండా పోవు. అక్కడి ప్రజలకు సాంత్వన ఇచ్చేవి ఉండకుండా పోవు. హింసను చల్లార్చే మార్గాలను సూచించేవి కనిపించకుండాపోవు. అవేమిటో తెలుసుకోటానికి భాసిన్ రచన ఖచ్చితంగా తోడ్పడుతుంది.

జమ్మూకశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కలిగించే ఆర్టికల్ 370ని రాజ్యాంగంలో పొందుపరచటం చారిత్రక మహాపాపంగా పరిగణించే ధోరణి ఇప్పుడు ప్రబలంగా ఉంది. ఎటువంటి మినహాయింపుల్లేకుండా సాధారణ రాష్ట్రస్థాయినే కశ్మీర్‌కు ఆనాడు కల్పించి ఉంటే 75 ఏళ్లనాడే సమస్య సమసిపోయేదని రాజకీయంగా ఎంతైనా వాదించొచ్చు. కానీ జమ్మూ కశ్మీర్.. భారత్‌లో విలీనమైన ఆనాటి చరిత్రనూ, అప్పటి పరిస్థితులనూ దృష్టిలో పెట్టుకుంటే దాన్ని అంగీకరించటం తేలిక కాదు. కశ్మీర్‌పై వచ్చిన ప్రామాణిక చరిత్రలన్నీ దీన్నే చెబుతాయి. ఆనాటి జమ్మూ కశ్మీర్ మహారాజు హరిసింగ్ ప్రేమతో తన రాజ్యాన్ని భారత్‌లో విలీనం చేయలేదు. పాకిస్థాన్ ప్రోద్బలంతో శ్రీనగర్‌ను చుట్టుముడుతున్న ఆక్రమణదారుల నుంచి రక్షించుకోటానికే భారత్ సైనిక సహాయాన్ని అర్థించారు. సాంకేతికంగా ఆనాటికి వేరే రాజ్యంగా ఉన్న జమ్మూకశ్మీర్‌కు ఆ సాయాన్ని చేయలేమనీ, తమతో విలీనమైతే అందుకు ముందుకు వస్తామని భారత్ తేల్చిచెప్పటంతో గత్యంతరం లేక హరిసింగ్ అంగీకరించారు. విలీనపత్రంపై సంతకం చేసినా పలు షరతులు పెట్టారు. రక్షణ, విదేశీ, కరెన్సీ, కమ్యూనికేషన్స్ మినహా మిగతా అన్ని విషయాలపై భారత ప్రభుత్వం చేసే ఏ చట్టానికైనా తన ఆమోదం ఉండాలని స్పష్టం చేశారు. ఈ షరతుల నేపథ్యంలోనే ఆర్టికల్ 370 వచ్చింది. జమ్మూకశ్మీర్‌లో శాశ్వత నివాసితులు ఎవరన్నది నిర్దేశించటానికి వీలు కలిగించే ఆర్టికల్ 35 ఏను కూడా రాజ్యాంగంలో ఆ నేపథ్యంలోనే పొందుపరచారు. 35ఏ ఆర్టికల్ వల్లే భూములపై కశ్మీరు ప్రజలకు ప్రత్యేక హక్కులు వచ్చాయి. ఇతరులు అక్కడ భూములు కొనకుండా నిషేధాలూ కొనసాగాయి. ఉద్యోగాలు జమ్మూకశ్మీర్ ప్రజలకే దక్కేలా చర్యలూ తీసుకున్నారు. ఈ నిషేధాలన్నీ ఆర్టికల్ 35ఏ వల్లే ఆ నాడు కొత్తగా వచ్చాయని భావించలేం. హరిసింగ్ పాలనలోనూ అవి ఎంతో కొంత అమల్లో ఉన్నాయి. ప్రజా ఒత్తిడికి తలవొగ్గి వాటిని ఆయన ప్రవేశపెట్టారు. ఇక పాలన పరంగా చూస్తే హరిసింగ్ ప్రభుత్వం ఏ మాత్రం జనరంజకమైనది కాదు. అంతా భూస్వాముల ఆధిపత్యమే ఉండేది. పౌరహక్కుల్లేవు. రాజకీయ హక్కులు అసలే లేవు. కశ్మీర్‌తోపాటు జమ్మూ, లద్దాఖ్ ప్రాంతాల్లోనూ సంఖ్యాపరంగా అనాడు ముస్లింలే ఎక్కువగా ఉన్నా పాలనలో వారికి భాగం లేదు. కౌలుదారులుగా, కూలీలుగా, వృత్తి జీవులుగా ఉన్న వారిలో ముస్లింలే ఎక్కువ. అధిక సంఖ్యాక ప్రజలకు హక్కులు, అధికారాలు, భూసంపద పంపిణీని డిమాండ్ చేస్తూ నేషనల్ కాన్ఫరెన్స్ ఉనికిలోకి వచ్చింది. భారత్ సైన్యానికి చేదోడుగా నిలిచి ఆక్రమణదారులను తరమటానికి తోడ్పడింది. కశ్మీర్ భారత్‌లో విలీనమయ్యేలా ప్రజాభిప్రాయాన్ని మలచింది. ఎక్కడా జరగని స్థాయిలో భూసంస్కరణలను అమలు పరచింది. భూస్వాముల నుంచి లక్షల ఎకరాలను స్వాధీనం చేసుకుని రైతులకు పంచింది. ఇదంతా గడిచిన చరిత్ర. మరి వర్తమానం సంగతేమిటి ?

తీవ్ర వివాదానికి కారణమైన ఆర్టికల్ 370 రద్దును సుప్రీంకోర్టు కూడా సమర్థించింది. అసలు ఆర్టికల్ 370 రద్దయి 5ఏళ్లు గడిచిపోయాయి. జమ్మూకశ్మీర్‌కు ఒకనాడున్న ప్రత్యేకతలన్నీ పోయాయి. రాష్ట్రమే రెండు కేంద్రపాలిత ప్రాంతాలైంది. ఏళ్ల విరామం తర్వాత ఎన్నికలూ జరిగాయి. ఫలితాలూ వచ్చాయి. ఆర్టికల్ 370 రద్దుతో కశ్మీర్‌లో నవశకాన్ని ఆరంభించామని

ప్రచారం చేసుకున్న బీజేపీ 90 స్థానాలున్న అసెంబ్లీలో 29 సీట్లతో సరిపెట్టుకుంది. కశ్మీర్ లోయలో ఒక్క స్థానమూ గెలవలేదు. గెలిచినవన్నీ హిందువులు అధికంగా ఉన్న జమ్మూలోనే ఉన్నాయి. మరోవైపు కశ్మీర్‌లో హింసా సంఘటనలూ పెరుగుతున్నాయి. కశ్మీరేతర వ్యక్తులపై దాడులూ కొనసాగుతున్నాయి. ప్రత్యేకతలన్నీ చాలా వరకూ తీసివేసి, దేశంలో అమలయ్యే చట్టాలన్నిటినీ జమ్మూకశ్మీర్‌కు వర్తింపచేశామని చెప్పుకొంటున్నప్పటికీ మారిన పరిస్థితులతో ప్రజలు సమాధానపడినట్లుగా దాఖలాలు కనిపించటం లేదు. ఎందుకిలా జరిగింది ? కేంద్ర ప్రభుత్వం ఆశించినట్లుగా జాతీయ జీవన స్రవంతిలో కశ్మీర్ ప్రజలు ఎందుకు కలవలేకపోతున్నారు?

వీటికి సమాధానాలు తెలుసుకోటానికి ఆర్టికల్ 370 రద్దుకు ముందూ తర్వాతా జరిగిన పరిణామాల గురించి లోతుగా తెలుసుకోవాలి. ఆర్టికల్ 370ని రద్దు చేసిన 2019 ఆగస్టు 5కు చాలా ముందుగానే కశ్మీర్‌లో అరెస్టులు మొదలయ్యాయి. కేంద్ర నిర్ణయాన్ని వ్యతిరేకిస్తారని అనుకున్న వాళ్లందరినీ అదుపులోకి తీసుకున్నారు. ఆగస్టు 5 నుంచి కశ్మీర్ అంతా లాక్‌డౌన్ పరిస్థితే నెలకొంది. రాజకీయ నేతలు, మాజీ ముఖ్యమంత్రులు, మంత్రులను గృహ నిర్బంధంలో ఉంచారు. ఇంటర్నెట్, మొబైల్ ఫోన్లను వాడకుండా నిషేధాలను విధించారు. ల్యాండ్‌లైన్ల ఫోన్లపైనా ఆంక్షలు అమలయ్యాయి. ప్రజల మధ్య సమాచార మార్పిడి పూర్తిగా నిలిచిపోయింది. ప్రసార సాధనాల వార్తా సేకరణకు అన్ని వైపుల నుంచి అడ్డంకులు ఎదురయ్యాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై ప్రజలకు వివరమైన సమాచారం లభించే పరిస్థితి లేదు. జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేసే చట్టాల మంచి చెడులపై అభిప్రాయాలు వెల్లడించే మార్గం ప్రజలకు లేదు. ప్రజల భౌతిక సంచారంపైనా అడుగడుగునా నిషేధాలు అమలయ్యాయని చెబుతూ అనురాధ ఎన్నో ఉదాహరణలు ఇచ్చారు. ఆ తర్వాత 2020 మార్చిలో విధించిన కోవిడ్ లాక్‌డౌన్‌తో జన జీవితం మరింత ఆంక్షల మయమైంది. తమ జీవితాలనూ తమ రాజకీయాలనూ తాము అనుసరించాల్సిన ఆర్థిక విధానాలనూ ఇతర రాష్ట్రాలతో తాము కొనసాగించాల్సిన సంబంధాలనూ నిర్దేశించే అనేక నిర్ణయాలు కశ్మీర్ ప్రజల ప్రమేయం లేకుండా జరిగిపోయాయనీ, 1947 తర్వాత ఏ రాష్ట్ర ప్రజలకూ ఇలాంటి పరిస్థితి ఎదురు కాలేదన్నదే అనురాధ వాదన సారాంశంగా చెప్పుకోవచ్చు. ఆర్టికల్ 370ను కశ్మీర్ భారత్‌లో విలీనం కావటానికి తోడ్పడే విశిష్ట రాజ్యాంగ సాధనంగా గతంలో భావించారు. దాన్ని 2019 ఆగస్టు 5న నిర్వీర్యం చేసినా ఎప్పటి నుంచో దాన్ని బలహీనపరచటం మొదలైంది. పలు రాష్ట్రపతి ఉత్తర్వులతో కీలక కేంద్ర చట్టాలన్నీ కశ్మీర్‌లో అప్పటికే అమలయ్యాయి. అందుకే అది అలంకార ప్రాయంగా మిగిలిపోయింది. బలమైన భావోద్వేగ అంశంగా మాత్రమే ఉండిపోయింది. దాన్నొక్కదాన్ని తొలగిస్తే సమస్య జటిలం అయ్యేది కాదు. సంపూర్ణ రాష్ట్ర హోదానీ తొలగించి రెండు కేంద్రపాలిత ప్రాంతాలు చేయటం, శాశ్వత నివాసీయులుగా విద్యా, ఉద్యోగాల్లో కశ్మీర్ ప్రజలకు లభించే ప్రత్యేక హక్కులను నిర్వీర్యం చేయటం, భూములు కశ్మీరేతర ప్రజల్లోకి వెళ్లేలా పలు చట్టాలను మార్చటం, ఇతర రాష్ట్రాల ప్రజలకు ఆస్తుల కొనుగోలుపై ఏదో రూపంలో హక్కులు లభించేలా చూడటం.. ఇప్పుడు తీవ్ర సమస్యలుగా మారాయి. ఈ మార్పులకు కశ్మీర్ ప్రజలు ఎలా సమాధాన పడతారన్నదే సవాల్‌గా మారింది. ఈ మార్పులకు వారు అంగీకరించనంత వరకూ సాధారణ పరిస్థితులు నెలకొంటాయన్న పూచీలేదు!

ప్రత్యేక హక్కులను వదులుకోవటం ఎక్కడా సులభంగా జరగదు. చారిత్రక సందర్భం ఒక్కోచోట ఒక్కో విధంగా ఉండొచ్చు. కానీ ఆ సందర్భంగా ఒనగూడిన హక్కులు స్థిరమైన ప్రత్యేక మనఃస్థితిని కలిగిస్తాయి. అది బలీయంగా ఉన్నంత వరకూ ప్రజల మనసుల్లో ప్రత్యేక హక్కుల భావం తొలగిపోదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు సందర్భంగా కుదిరిన పెద్ద మనుషుల ఒప్పందం, తెలంగాణ ప్రాంతీయ కమిటీ, తెలంగాణ మిగులు నిధులు, ముల్కి నిబంధనలు, ఆరు సూత్రాల పథకం, 610 జీవో లాంటివన్నీ దశాబ్దాలపాటు ప్రజల మనసుల్లో నిలిచి ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు దారితీశాయి. నిధులు, నీళ్లు, నియామకాలు తెలంగాణ వాసులకే పూర్తిగా దక్కాలనే ఆకాంక్ష, పట్టుదలను అసలు సిసలైన ప్రజాస్వామ్య కోరికలుగా భావిస్తే కశ్మీర్ ప్రజలు అవే కోరుకుంటే కాదనలేని పరిస్థితే ఉంటుంది. ప్రజాస్వామ్య కోరికను ఒకచోట ఆమోదించి మరొకచోట తిరస్కరించటాన్ని ఎవరూ సమర్థించుకోలేరు. తెలంగాణ రాష్ట్రం అవసరం గురించీ జరిగిన అన్యాయాల గురించీ వాగ్దానభంగాల గురించీ సాగినన్ని చర్చలు ఏ ప్రత్యేక రాష్ట్రోద్యమాల్లోనూ సాగలేదు. సమాచార సాంకేతిక పరిజ్ఞానం అందించిన సౌలభ్యాలతో చర్చలు, ప్రతిచర్చలు భిన్న వేదికలపై కనీవినీ ఎరగని రీతిలో విజృంభించి బలమైన సానుకూల వాతావరణాన్ని సృష్టించాయి.

అంతర్జాతీయ సరిహద్దులో కశ్మీర్ ఉండటాన్నీ మతపరమైన సున్నితత్వాన్నీ దృష్టిలో పెట్టుకుని భిన్న ప్రమాణాలను అనుసరిస్తే దూరాలు పెరుగుతాయి తప్ప తరగవు. ప్రపంచంలో ఎక్కడైనా భూభాగాలపై స్వామ్యాన్ని సాధించటం సులభం. ప్రజల హృదయాలను గెలుచుకోవటం కష్టం. రాజకీయ విసుర్లు ప్రతి విసుర్లతో ఆర్టికల్ 370పై పదేపదే సవాళ్లు చేయటం కంటే కశ్మీరు ప్రజలను సమాధానపరచటానికి మార్గాలను అన్వేషించటం ప్రస్తుతం అత్యవసరం. సంపూర్ణ హక్కులతో రాష్ట్ర హోదాను జమ్మూ కశ్మీర్‌కు కలగచేస్తే ఆ దిశగా కీలక అడుగు పడుతుంది. అది కూడా జరక్కపోతే చరిత్ర తిరిగే మలుపులను ఊహించలేం! ❑

# సైన్సు, విద్యుత్తు - లెనిన్



- ప్రబీర్ పుర్కాయస్థ

ఈ సంవత్సరానికి లెనిన్ అమరుడై నూరేళ్లు అవుతున్నది. లెనిన్‌ను స్మరించుకోవడం అంటే సోవియట్ యూనియన్ గురించి, బోల్షివిక్ విప్లవం గురించి, ఒక కొత్త సామాజిక క్రమం గురించి, వలస పాలనల విముక్తి గురించి, శ్రామికులకు ఉత్పత్తి సాధనాల మీద ఆధిపత్యం గురించి మాట్లాడుకోవడం. అయితే ఇప్పుడు ఆ విషయాలు ప్రస్తావించడం లేదు. లెనిన్ చేసిన కృషిలో చాలా మందికి అంతగా తెలియని రెండు విభిన్న అంశాలున్నాయి. అవి 1.విద్యుత్ రంగం, దాని సామాజిక పాత్ర 2.సైన్స్ తాత్వికత. ఈ రెండు విషయాలలో లెనిన్ సొంత అభిప్రాయాలను కలిగి ఉండటమే కాదు, నాటి తరాల అభిప్రాయాలను మలచడంలో కీలక పాత్ర వహించాడు. ఇప్పటికీ, లెనిన్ అభిప్రాయాలకు ఒక ప్రాసంగికత ఉంది. సోవియట్ యూనియన్‌లో జరగాల్సిన పారిశ్రామిక అభివృద్ధిని, వ్యవసాయక అభివృద్ధినీ ఆయన విద్యుత్‌తో ముడిపెట్టి చూశాడు. సోవియట్లూ, విద్యుదీకరణా జత కలిస్తే, అది సోషలిజమే అని ఆయన ప్రకటించాడు. ఇదొక నినాదం కాదు. ఆర్థిక వ్యవస్థకు, ఉత్పత్తి శక్తులకు, విజ్ఞాన శాస్త్రానికి మధ్య ఉండే ఒక లోతైన సంబంధంగా ఆయన దీన్ని చూశాడు. శాస్త్ర సాంకేతికాలకు, ప్రజా సంఘాలకు (సోవియట్లు) మధ్య సంబంధంగా కూడా చూశాడు. ఇది మొదటిది. ఇక రెండవది క్వాంటం, సాపేక్షతా సిద్ధాంతాలు. అప్పుడప్పుడే ముందుకు వచ్చిన నూతన భౌతిక శాస్త్ర సిద్ధాంతాలు ఇవి. అప్పటి సాంప్రదాయక భౌతిక శాస్త్రానికే కాక, తత్వ శాస్త్రాలకు కూడా ఇవి సవాలు విసిరాయి. దీంతో అప్పటి తత్వవేత్తలలో చీలికలు వచ్చాయి. చాలా మంది మార్క్సిస్టులు సాపేక్ష సిద్ధాంతాలను, క్వాంటం యాంత్రిక శాస్త్రాన్ని బూర్జువా పెడధోరణిగా చూశారు. అయితే లెనిన్ గతితార్కిక భౌతిక వాద చట్రంలోకి వీటిని ఏ విధంగా తేవాలి అనేది ఆలోచించడమే కాక, అసలు ఈ చట్రాన్ని కూడా ఏ విధంగా విస్తరించవచ్చో ఆలోచించాడు. 'భౌతిక వాదము-అనుభవవాద విమర్శ' అనే ప్రఖ్యాత పుస్తకంలో కానీ, సొంత నోట్స్‌గా రాసుకున్న 'ఫిలసాఫికల్ నోట్‌బుక్'లో గాని ఇవి కనిపిస్తాయి. కానీ లెనిన్ 53 ఏళ్ళ వయసుకే చనిపోవడంతో, ఆ ఆలోచనలు అసంపూర్ణంగా ఆగిపోయాయి.



ఇప్పుడు విద్యుదీకరణ కథ గురించి రేఖామాత్రంగా పరిశీలిద్దాం. 1918లో బోల్షివిక్ విప్లవం జరిగినప్పుడు, రష్యాలో ఉత్పత్తి అయిన విద్యుత్ శక్తి 4.5 మెగావాట్లే. అది మహా అంటే కొన్ని నగరాలకు సరిపోయేది. అయితే, విద్యుదీకరణ జరగకుండా పరిశ్రమలు గానీ, వ్యవసాయం కానీ ముందుకు పోలేవు. నీటిపారుదల వ్యవస్థలు ముందుకు పోవాలన్నా, వ్యవసాయానికి పనిముట్లు తయారు కావాలన్నా విద్యుత్ శక్తి ఉండాల్సిందే. వీటన్నింటికీ అవసరమైన యంత్రాలను దిగుమతి చేసుకోవడం కాదు, వాటిని ఉత్పత్తి చేసుకోవాలి. అందుకే సోవియట్ల శక్తికి తోడుగా విద్యుదీకరణ జరిగితేనే సోషలిజమైనా, కమ్యూనిజమైనా అని లెనిన్ భావించాడు. పారిశ్రామికీకరణ మొదట జరగాల్సింది విద్యుత్ రంగంలోనే. శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు ముందుకు తెచ్చిన దేశవ్యాప్త విద్యుదీకరణ పథకాలకు కమ్యూనిస్టు పార్టీ ఆమోదముద్ర వేసింది. కొమిన్‌టన్ మూడో కాంగ్రెస్ (జులై 19-21)లో బోల్షివిక్ విప్లవానికి, దేశ విద్యుదీకరణ ఎంతో ముఖ్యం అన్న అవగాహనను లెనిన్ పునరుద్ఘాటించాడు. అలాగే, వ్యవసాయాన్ని పునర్వ్యవస్థీకరించగలిగిన ఒక విస్తృతమైన యంత్ర పరిశ్రమ ఉండాలని, సోషలిజానికి అవసరమైన ఒక భౌతిక ప్రాతిపదికను అది సమకూరుస్తుందని ఆయన భావించాడు. రష్యాలో ఉన్న, 200 మంది ఉద్దండ శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు వ్యవసాయ శాస్త్రవేత్తల వైజ్ఞానిక కృషితో విద్యుదీకరణ ప్రణాళికకు పూనుకున్నాడు. ఇందుకోసం 1921లో 'ఆల్ రష్యా ఇంజనీర్స్ కాంగ్రెస్'ను నిర్వహించాడు. అందులో ఈ ప్రణాళిక సంపూర్ణంగా చర్చించబడిన తర్వాతే, ప్రభుత్వ ఆమోదానికి వెళ్ళింది. కానీ, బూర్జువా పండితులు, ఆధునికానంతర వాదులు (పోస్ట్ మాడ్రనిస్టులు), లెనిన్‌ను ఒక యాంత్రిక భౌతికవాదిగా చిత్రించే ప్రయత్నం చేశారు. సైన్సును సాంకేతిక వినియోగాలకే లెనిన్ కుదిస్తున్నట్టుగా చెప్పుకొచ్చారు. కానీ సాంకేతిక పనివారికి, రైతులకు మధ్య ఒక గట్టి సంబంధాన్ని లెనిన్ స్థిరపరిచాడు. రష్యా సత్వర పారిశ్రామికీకరణకు, వ్యవసాయ విస్తరణకూ సైన్సును ఒక కీలక అంశంగా లెనిన్ వాడాడు.

విప్లవ శక్తులు, శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు కలసిమెలసి పని చేసిన సందర్భం అది. విద్యుదీకరణ కోసం హైడ్రో టర్బైన్‌లను ఉత్పత్తి చేయాలి. అంటే, అది పారిశ్రామిక శక్తిని సంతరించుకోవడం కూడా. ప్రజలకు విద్యుత్తును అందించడమే కాదు. డ్యాములు వ్యవసాయానికి అవసరమైన నీళ్లనూ ఇస్తాయి. అంటే ఈ జల విద్యుత్ ప్రాజెక్టుల చుట్టూ కార్మికుల, రైతుల ఐక్యత నిర్మింప బడుతుంది. పెద్ద పారిశ్రామిక పురోగమనానికి పునాదిగా విద్యుదీకరణ ఉపయోగపడింది. వర్కర్ల, సాంకేతిక నిపుణుల కేడర్‌ను ఇది సృష్టించింది. సోవియట్లు, విద్యుత్తు అనే రెండు మాటలు లెనిన్ రాజకీయ నినాదాలుగా వాడాడు. అవి ఆయనకు సాంకేతిక, ఆర్థిక అంశాలు మాత్రమే కాదు.

స్వాతంత్ర్యానంతర భారత దేశంలో కూడా దీనికి ఒక పోలిక కనిపిస్తుంది. విద్యుత్ రంగంలో నెహ్రూ ఆలోచనలు, సోషలిస్టుల, కమ్యూనిస్టుల ఆలోచనలు, అలాగే అంబేద్కర్ దార్శనికత కలవడం చూస్తాం. నెహ్రూ, అంబేద్కర్‌లు విద్యుత్ రంగాన్ని, హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టులను దేశాభివృద్ధికి కీలకమైనవిగా చూశారు. బృహత్తర ప్రాజెక్టులకు ప్రత్యామ్నాయంగా అనేక చిన్న చిన్న ప్రాజెక్టులు, చిన్న చిన్న పరిశ్రమలు కూడా ఉండాలని తర్వాత నెహ్రూ భావించాడు. కానీ పెద్ద ప్రాజెక్టులను ఆధునిక దేవాలయాలన్నాడు. 1948 లోనే అంబేద్కర్ భారత విద్యుత్ చట్టానికి రూపకల్పన చేశాడని చాలామందికి తెలియదు. విద్యుత్ అందరికీ తప్పనిసరి అవసరమని, అది ప్రభుత్వ రంగంలోనే ఉండాలని, అందులో లాభాపేక్ష తగదని ఆయన భావించాడు. అంబేద్కర్ తనను తాను సోషలిస్టుగా (మార్క్సిస్టుగా కాకున్నా) అభివర్ణించుకున్న విషయం గమనార్హం. లెనిన్ రాజకీయ కార్యాచరణలకు, విప్లవ పార్టీ నిర్మాణానికి చేసిన బహుముఖ కృషి ఒక ఎత్తు అయితే, తత్వ శాస్త్రానికి, విజ్ఞాన శాస్త్ర తాత్వికతలకు చేసిన కృషి మరొక ఎత్తు. భౌతిక వాదం అనుభవవాద విమర్శ అనే ప్రఖ్యాత గ్రంథంలో క్వాంటం మెకానిక్స్‌ను, ఎటువంటి విమర్శ లేకుండా స్వీకరించిన కోపెన్‌హెగెన్ వ్యాఖ్యానాన్ని ఆయన విమర్శించాడు. క్వాంటం, సాపేక్ష సిద్ధాంతాలు అన్ని తత్వశాస్త్ర సిద్ధాంతాలకు గట్టి సవాళ్లను విసిరాయి. నిజానికి, విజ్ఞాన శాస్త్రంలో ఏ కీలకమైన ముందడుగు పడినా జరిగేది ఇదే. అప్పటి వరకు ప్రకృతి గురించి మనకున్న విజ్ఞానాన్ని మాత్రమే కాదు, ఆ విజ్ఞానం ఆధారంగా తయారైన తత్వశాస్త్రాలను కూడా ఈ నూతన విజ్ఞానం సవాలు చేస్తుంది. ఒకప్పటి సూర్యకేంద్రక సిద్ధాంతం లాగే క్వాంటం సాపేక్ష సిద్ధాంతాలు తాత్విక ప్రపంచాలను ఒక కుదుపు కుదిపాయి. కాలానికి ఉన్న తాత్విక స్వభావాన్ని, ఐన్‌స్టీన్ అర్థం చేసుకోలేక పోయాడంటూ, ఆయన సాపేక్ష సిద్ధాంతాన్ని తిరస్కరించ చూశారు. కాలాన్ని కొలవటానికి వీలైనదిగా, వస్తుగతమైనదిగా ఐన్‌స్టీన్ భావించాడు. దాని మార్మికతల గురించి హెన్రీ బెర్గ్‌సన్ లాంటి శాస్త్రవేత్తలు చెప్పారు. ఈ ప్రభావం నోబెల్ కమిటీ మీద కూడా పడింది. కాబట్టే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సాపేక్ష సిద్ధాంతానికి కాకుండా, ఫోటో ఎలక్ట్రిక్ సిద్ధాంతానికి ఐన్‌స్టీన్‌కు నోబెల్ బహుమతి ఇచ్చారు. లెనిన్‌ను నాజుకైన భౌతికవాది కాదనే వాళ్ళు(ఏంగెల్స్‌ను అన్నట్టే) ఉన్నారు. కానీ సైన్స్ సూత్రాలలో ఉండే పాక్షికతను, వైఫల్య అవకాశాలను సరిగా గుర్తించినవాడు లెనినే. పదార్థ చలనాల కుండే ద్వంద్వ స్వభావాన్ని, గతి తార్కిక దృష్టి నుంచి అర్థం చేసుకున్న వాడు లెనిన్. ఒకందుకు మనందరం సంతోషపడాలి. లెనిన్ చాలా సమస్యలకు పరిష్కారం చూపాడు. కానీ పరిష్కరించాల్సిన ఎన్నో సమస్యలు (విప్లవ కార్యాచరణలో, చరిత్రలో, ఆర్థిక శాస్త్రంలో, తత్వశాస్త్రంలో కూడా) ఇంకా మిగిలే ఉన్నాయి. ❑



# కీర్తిశేషులు గజ్జెల మల్లారెడ్డి



- మాశర్మ

మా నాన్నగారు కీర్తిశేషులు గజ్జెల మల్లారెడ్డి గారి గురించి మిత్రులు మాశర్మ గారు చక్కటి ఆర్టికల్ రాసి పంపించారు. కమ్యూనిస్టు ఉద్యమకారుడుగా మొదలై అభ్యుదయ కవిగా, పాత్రికేయుడిగా మూడు పాయలుగా సాగి చివరకు ఆధ్యాత్మిక తత్వజిజ్ఞాసిగా పరిణమించిన వారి జీవనయానాన్ని సంక్షిప్తం గానే ఐనా సమగ్రంగా చిత్రించిన మాశర్మ గారి ఆర్టికల్‌ను ఫేస్‌బుక్ మిత్రుల కోసం పోస్ట్ చేస్తున్నాను.



**"గజ్జెల మల్లా ! నీ గేయాలు చదివాను. మళ్ళీ చదివాను. మళ్ళీ మళ్ళీ చదివాను. ఈ పాతికేళ్లలో నేను కూడబెట్టుకున్న కీర్తిని నువ్వు పాతికకన్నా తక్కువ కావ్యాలతో తస్కరించావని నీ మీద కేసు పెడుతున్నా"**

**- ఇట్లు మహా మహాకవి శ్రీ శ్రీ**

గజ్జెల మల్లారెడ్డి కవితా కీర్తికి, కీర్తినీయ చరితకు మహాకవి శ్రీశ్రీ యిచ్చిన ఈ 'యోగ్యతా పత్రం' చాలు! కమ్యూనిస్ట్ యోధుడు నుంచి కవిమల్లుడు, కవిమల్లుడు నుంచి పాత్రికేయ మల్లుడుగా త్రివేణీ సంగమ స్వరూపంగా ప్రజావాహినిలో ప్రజ్వలంగా ప్రవహించిన ప్రజ్ఞాధనుడు గజ్జెల మల్లారెడ్డి. ఆయన ఉపన్యాసాలు వినడానికి వేలాది మంది ప్రజలు బండ్లు కట్టుకొని, ప్రభలు కట్టుకొని తండోపతండాలుగా వచ్చేవారు. చప్పట్ల మోతలు, దరువులు, విజిల్స్‌తో ఆ సభలు మార్మోగేవి. రాజకీయ సభలకు అంతటి రంజకత్వం కలిగించిన అగ్రేసర ఉపన్యాసకుడు గజ్జెల మల్లారెడ్డి. ఉపన్యాస కళలో ఆ తీరు అనితర సాధ్యం. కమ్మ సాబ్ – శ్యామల బుర్రకథలు, మల్లారెడ్డి ఉపన్యాస కళాకేళి ఆనాటి రాయలసీమ వాసులను ఊపేసేవి. ఆ ఊపు, ఉత్సాహాన్ని అనుభవించి పల్లవించిన ప్రత్యక్ష సాక్ష్యులు ఎందరో ఇంకా మన మధ్యనే వున్నారు. పత్రికలు వేదికలుగా ఆయన వేసిన అక్షింతలు, చురకలు, ఆయన చేసిన మాటకచేరి తెలుగు పాఠకుల హృదిలో నేటికీ పదిలంగా వున్నాయి. రాజకీయం-కవిత్వం-పాత్రికేయం ముప్పేటలుగా ముడివేసు కొని ఆయన జీవితనౌక సాగింది.

సవ్యసాచి, విశాలాంధ్ర, ఈనాడు, ఆంధ్రభూమి, ఉదయం పత్రికలలో ఆ పాత్రికేయం ప్రచండంగా ప్రతిధ్వనించింది. విశాలాంధ్ర వారపత్రిక, ఆంధ్రభూమి, ఉదయం దినపత్రికలకు సంపాదకుడుగా తనదైన శైలిలో సమర్ధవంతంగా బాధ్యతలు నిర్వహించి, ఆ పత్రికలకు సరికొత్త రూపురేఖలు, కీర్తి శిఖరాలు లిఖించి పెట్టారు. ఈనాడులో సంపాదకీయాలు రాయడంతో పాటు, 'పుణ్యభూమి' పేరుతో శీర్షిక నడిపేవారు. కొన్నాళ్ళు బలరాం అనే మారుపేరుతో, ఆ తర్వాత తన పేరుతో నిర్వహించిన ఆ శీర్షిక సూపర్ హిట్. 1978 నుంచి 1983 దాకా అప్రతిహతంగా సాగింది. మొదలైన రెండు మూడు వారాల్లోనే చాలా మందిని అపరిమితంగా ఆకర్షించింది. 'సమదర్శి' అనే కలం పేరుతో కూడా రాజకీయ వ్యాసాలు రాసినట్లు చెబుతారు. ఈనాడు సంపాదక వర్గం సభ్యుడిగా ఆయన కీలక భూమిక పోషించారు. 1983లో ఆంధ్రభూమి సంపాదకుడుగా మారినప్పుడు అదే కాలమ్ 'పుణ్యభూమి' పేరుతో వచ్చి ఖ్యాతి తెచ్చిపెట్టింది. మొదటి పేజీలో వచ్చే 'చురకలు' చేసిన సందడి కూడా అంతా ఇంతా కాదు. 'ఉదయం' సంపాదకుడుగా పనిచేసినప్పుడు నిర్వహించిన 'మాటకచేరి', 'అక్షింతలు' ప్రజాబాహుళ్యంలోకి తెగ చొచ్చుకుపోయేవి. సదరు వ్యక్తుల గుండెల్లోకి గుచ్చుకుపోయేవి.

తొలినాళ్లలో 'సవ్యసాచి' పత్రిక చివరిపేజీలో 'చివరి పేచీ' శీర్షిక కింద రాసిన రాజకీయ వ్యాసాలు సంచలన జ్వలనాలు. అంతకు మునుపో, కాస్త అటు ఇటు గానో 'సంవేదన' అనే త్రైమాసిక సాహిత్య పత్రికలోనూ వ్యాసాలు, కవిత్వం రాసేవారు. 'వీచిక' అనే సాహిత్య మాసపత్రిక నడిపినట్లు సమాచారం. ప్రఖ్యాత 'నవ భారత్ టైమ్స్' పత్రికలో రమేష్ థాపర్ హిందీలో రాసిన వ్యాసాలను అద్భుతంగా అనువదించి తెలుగులో రాసేవారు. చదువరితనం చిన్ననాడే చిగు రేసి మొగ్గేసింది. పద్య ప్రబంధాలు, కావ్యాలు, గేయాల నుంచి పత్రికల వరకూ అన్నీ

ఎంతో ఆసక్తితో, అనురక్తితో చదివేవారు. తన కమ్యూనిస్ట్ ప్రస్థానంలో పుచ్చలపల్లి సుందరయ్య, తరిమెల నాగిరెడ్డి, చంద్ర పుల్లారెడ్డి, రాచమల్లు రామచంద్రారెడ్డి(రా.రా.) వంటి హేమా హేమీలతో తిరిగిన అనుభవం ఆయనను అతి బలవంతుడిని చేసింది. చిన్నప్పుడు క్లాసిక్స్(కావ్యాలు) చదవడంతోపాటు, వాళ్ళ ఊర్లోని భట్రాజుల దగ్గర ఆటపాటలు నేర్చుకున్నారు. అద్భుతమైన కళా స్రవంతుల మాధుర్యాన్ని మచ్చిక చేసుకున్నారు. అందుకే ఆయన ఉపన్యాసం చేసినా, వ్యాసం రాసినా అంత కళాత్మకంగా, అంత రసాత్మాకంగా వుంటాయి. "వాక్యం రసాత్మకం కావ్యం" అంటారు కదా! రసాత్మక వాక్యాల సమ్మేళనా శోభితంగా, కావ్య సదృశంగా ఆ ఝరి సాగేది. "లోకంబు వీడి రసంబు లేదు" అంటాడు విశ్వనాథ సత్యనారాయణ.

మల్లారెడ్డి చూసిన లోకం చిన్నది కాదు. చిన్ననాడే తల్లిదండ్రులను కోల్పోయారు. మేనమామల పెంపకంలో పెరిగారు. కమ్యూనిస్ట్ నాయకుడు పొన్నతోటి వెంకటరెడ్డి సాహచర్యంలో చిన్ననాడే కమ్యూనిజం వైపు ఆకర్షితుడైనాడు. చేనేత కార్మిక సంఘాల స్థాపన, సాయుధ పోరాటాలు మొదలైన ఉద్యమ వాతావరణ నేపథ్యంలో వీరిపై పోలీసుల దృష్టి బాగా పెరిగింది. తరిమెల నాగిరెడ్డి ఇచ్చిన ఉత్తరం తీసుకొని 16ఏళ్ళ వయస్సులో వారణాసి వెళ్లిపోయారు. అక్కడి కమ్యూనిస్ట్ నాయకులతో కలిసి మెలిసి తిరిగి కమ్యూనిజంపై అవగాహన, అభిమానం మరింతగా పెంచుకున్నారు. బెనారస్ హిందూ యూనివర్సిటీలో హిందీ కోర్సులో చేరి, హిందీ భాషా సాహిత్యాలు బాగా అధ్యయనం చేశారు. దీనితో ఆయనకు హిందీ భాషా పరిజ్ఞానం బాగా పెరిగిపోయింది. 'నవ భారత్ టైమ్స్' వంటి పెద్ద పత్రికలో రమేష్ థాపర్ వంటి మేధావులు రాసిన హిందీని అలవోకగా తెలుగులోకి అనువదించి రాయ గలిగిన సత్తాను వారణాసిలో జరిపిన విద్యాభ్యాసం ప్రసాదించింది. అటు సాహిత్య రంగంలోనూ – ఇటు పత్రికా పరిశ్రమలోనూ రాణించడానికి క్షేత్రస్థాయి రాజకీయ చైతన్యం, భాషా సాహిత్య పరిజ్ఞానం ఎంతగానో ఉపకరించాయి. వారణాసి నుంచి వచ్చిన తర్వాత తన ప్రావీణ్యత మరింత ప్రౌఢత్వం సంతరించుకుంది.

కమ్యూనిస్ట్ పార్టీ తరపున ఆయన తిరగని ఊరు లేదు. ఆ కాలంలో ఆయన తెలియని మనిషి లేడు. పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కమ్యూనిస్ట్ పార్టీ అభ్యర్థిగా నిలబడ్డారు. మల్లారెడ్డికి పోటీగా కాంగ్రెస్ అభ్యర్థి పెంచికల బసిరెడ్డి బరిలోకి దిగారు. ఎన్నికల్లో మల్లారెడ్డి ఓడిపోయినా, ఆ కాలంలో అది పెద్ద సంచలనం. మల్లారెడ్డికి ఎన్నికల ఏజెంట్‌గా రాచమల్లు రామచంద్రారెడ్డి, డమ్మీ అభ్యర్థిగా వైఎస్ రాజారెడ్డి నిలబడి ఎంతగానో సహకరించారు. కమ్యూనిస్ట్ పార్టీపై నిషేధం విధించడం, పెద్దల పిలుపు మేరకు ఆస్తులు మొత్తం అమ్మి పార్టీకి ఇచ్చేయడం, జైలు జీవితం గడపడం మొదలైన పరిణామాలన్నీ చకచకా జరిగిపోయాయి. జైలు జీవితంలో పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్యతో పెరిగిన సాన్నిహిత్యంలో ఇంగ్లిష్ కూడా నేర్చుకున్నారు. జైలులో విరామ సమయంలో చేసే ముచ్చట్లకు 'మల్లారెడ్డి మాట కచేరి' యమగా ఉందంటూ పుచ్చలపల్లి సుందరయ్య తెగమెచ్చుకొనేవారు. గజ్జెలవారు పత్రికా రంగంలోకి వచ్చాక, సుందరయ్య చేసిన ప్రశంసా వాక్యాన్నే తన శీర్షికా నామంగా పెట్టుకున్నారు. అది ఎంత పెద్ద హిట్టయ్యిందో చరిత్రకే తెలుసు. జీవితమే కమ్యూ నిజం అంటూ సాగుతున్నా, అంతర్జాతీయం గానూ – అంతర్గతంగానూ పరిణమిస్తున్న విధానాలు అస్సలు నచ్చడం లేదు, కొత్త సిద్ధాంతాలు ఏ మాత్రం మింగుడుపడడం లేదు. ఆ వాతావరణంలో పార్టీలో ఇమడలేక, పార్టీ సభ్యత్వాన్ని పొడిగించుకోకుండా(రెన్యువల్) దూరంగా వచ్చేశారు.

ఈ నేపథ్యంలో మిత్రుడు రాంభట్ల కృష్ణమూర్తి ప్రోద్భలంతో, రామోజీరావుతో వున్న స్నేహంతో, వారి ఆహ్వానంతో ఈనాడులో ప్రవేశించారు. మొదట్లో 'పుణ్యభూమి' శీర్షిక, ఆ తర్వాత సంపాదకీయాలు రాశారని ఇందాక మనం చెప్పుకున్నాం. ఇక్కడ మనం చెప్పుకోవాల్సింది ఏంటంటే ? ఆయన వేసిన ముద్ర. ఆయన చిత్రీకరించిన రచనా శిల్పం కొత్త ఒరవడిని సృష్టించింది. ఎత్తుగడలోనే ఆ సరికొత్తదనం ప్రస్ఫుటంగా కనిపించేది. అప్పటికప్పుడు ఆయన రాసిన కవితా పంక్తులతోనో, పూర్వ మహనీయుల తత్వాలతోనో, పూర్వ కవుల పదగుచ్ఛాలతోనో, ఆర్యవాక్కులతోనో మొదలై, స్వరసురఝరీ తరంగంలా ప్రవహించేది, అభంగ తరంగ మృదంగ రావమై ప్రతిధ్వనించేది.

ఎన్టీఆర్ 'తెలుగుదేశం' పార్టీని స్థాపించి ప్రచారం సాగిస్తున్న తరుణంలో ఎన్టీఆర్‌కు అనేక ఉపన్యాసాలు మల్లారెడ్డి రాసిచ్చేవారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత 'ఈనాడు' విధానాలలో వచ్చిన మార్పులు, ఎన్టీఆర్ పాలనా వైనం నచ్చక, స్నేహపూర్వక వాతావరణంలోనే బయటకు వచ్చేశారు. మల్లారెడ్డిని రామోజీరావు 'కవిగారూ' అని పిలిచేవారు. 'ఆంధ్రభూమి' సంస్థ పూర్తిస్థాయి సంపాదకుడు హోదాను ఇచ్చింది. తనకు సంపూర్ణమైన భావ స్వేచ్ఛ వుంటుందని యాజమాన్యం మాట కూడా ఇచ్చింది. ఆ నూత్నోత్సాహంతో ఎడిట్ పేజీని ప్రక్షాళన చేస్తూ, పత్రికను కొంగ్రొత్త సొగసు, సోయగాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. 'ఆంధ్రభూమి' కాంగ్రెస్ పక్షపాత పత్రిక అన్న సంగతి జగమెరిగిన సత్యం. అవసరమైన చోట విమర్శనాత్మకం గానే ముందుకు సాగుతానని యాజమాన్యానికి మల్లారెడ్డి ముందే వివరించారు. తనకు భావ స్వేచ్ఛ లభించినంత కాలం

అక్కడ కొనసాగారు. ఆయన రాసిన ఒక సంపాదకీయంలోని సొగసుతనాన్ని,గడుసుతనాన్ని ఒకసారి చూద్దాం.

పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో, కాంగ్రెస్ అధిష్టానం ఆయన స్వేచ్ఛను హరించే విధంగా ప్రవర్తిస్తూ, ఆయనను పైకి లేవకుండా తొక్కే కుయుక్తులు పన్నుతున్నప్పుడు రాసిన సంపాదకీయమిది. అనంతపురం జిల్లాలోని గూటం ఆంజనేయస్వామి గుడి వృత్తాంతాన్ని - కాంగ్రెస్ అధిష్టానం తీరుతో పోలుస్తూ రాశారు. ఆంజనేయస్వామి రోజురోజుకూ పెరుగుతూ వుంటే, సేవలు చెయ్యలేక ఆ ఆకృతి తగ్గే ఉపాయం ఏదైనా వుందా? అని, ఆ గుడి నిర్వాహకుడు తన తండ్రిని అడుగుతాడు. ఆ విగ్రహంపై గూటంతో కొట్టు... ఇక స్వామి పెరగడని తండ్రి సలహాయిచ్చాడు. కొడుకు ఆ పని చేయడంతో స్వామి పెరగడం ఆగిపోయింది. అలాగే, పీవీ నరసింహారావు ఎదగకుండా ఉండడానికి అధిష్టానం పైనుంచి గూటంతో కొడుతోంది.. అంటూ - రెండింటినీ పోలుస్తూ వ్యంగ్య భంగిమతో సంపాదక శిల్పాన్ని చెక్కారు. మల్లారెడ్డి రచనా వైభవ ప్రాంగణంలో ఇలాంటి చిత్రాలు, శిల్పాలు ఎన్నో దర్శనమవుతాయి. విశాఖపట్నంలో ఆంధ్రభూమి ఎడిషన్ వ్యవస్థాపన చేయాలనే ఆలోచన కూడా మల్లారెడ్డి మెదడు నుంచి పుట్టిందే. పత్రికను విస్తరించడం, విస్తారంగా చదివించడం, చదివించేలా రూపురేఖా విలాసాలను మార్చి తీర్చడం మల్లారెడ్డి సృజనశీలతకు, దార్శనికతకు అద్దంపడతాయి.

దీనికంటే ముందు, 1970 దశకంలోనే, 'విశాలాంధ్ర' వారపత్రిక సంపాదకుడుగా బాధ్యతలు స్వీకరించారు. ఆ తరుణంలో, సంపూర్ణమైన, శక్తివంతమైన రాజకీయ పత్రికగా బలమైన నిర్మాణం చేసి, 'విశాలాంధ్ర వారపత్రిక' ప్రాచుర్యం పెరగడానికి, బలంగా ఎదగడానికి బలమైన పునాదులు వేశారు. ఆ సమయంలోనే వార్తలపై లఘు వ్యాఖ్యలు రాసేవారు. ప్రధాన పాత్రికేయ స్రవంతిలోకి(మెయిన్ స్ట్రీమ్ జర్నలిజం) ప్రవేశించడం, సంపాదకుడు హోదాను పొందడం 'విశాలాంధ్ర' తోనే మొదలైందని అంటారు.

1950 దశకంలోనే రాచమల్లు రామచంద్రారెడ్డి వంటి గంభీరమైన కమ్యూనిస్ట్ నేతను 'సవ్యసాచి పత్రిక' సంపాదకుడుగా రూపాంతరం చెందేలా చేసిన ఘనత కూడా గజ్జెల వారికే చెందుతుంది. మాత్రా ఛందస్సుందరమైన కవితా లతలతో పాత్రికేయ రచనకు కొత్త తావిని అద్దిన విశిష్ట విఖ్యాతి కూడా మల్లకవికే దక్కుతుంది. తర్వాతి తరం పాత్రికేయులెందరో పెట్టిన హెడ్డింగ్స్‌పై ఈ ప్రభావం ఎంతగానో వుండేది. మహాకవి శ్రీశ్రీ ప్రభావంతో కవితా మహేంద్రజాలం చేసిన ఘనత, మాత్రా ఛందస్సును మహనీయంగా నడిపిన చరిత మల్లకవికే చెందుతాయి. ముఖ్యంగా, పత్రికా ప్రపంచంలో

## భక్తి రసం

**పెట్టుబడికి కట్టుకథకు**
**పుట్టిన మన పత్రికలకు**
**పాతబడిన పురాణాల**
**పాత్రల్లను త్రవ్వి, తోడి**
**చేటలతో చేదస్తం**
**చెరగడమే బ్రతుకుతెరువు!**
**తిరుపతి నిదర్శనాల**
**తిరుమంత్రమ్మొక పత్రిక,**
**భక్త వరుల సాక్ష్యాలను**
**పదునుబెట్టి ప్రకటిస్తే**
**జగద్గురుల మాహాత్మ్యం**
**చాటించే దొకపత్రిక!**
**తెలుగునాట భక్తిరసం**
**తెప్పలుగా పారుతోంది-**
**డ్రెయినేజీ స్కీములేక**
**డేంజరుగా మారుతోంది!**

**- గజ్జెల మల్లారెడ్డి**

ఈ బాణిని, ఈ వాణిని వినిపించడంలో గజ్జెలవారు జగజ్జెట్టి. మల్లన్న నా వారసుడని శ్రీ శ్రీ ఒక సందర్భంలో ప్రకటించాడు కూడా. తదనంతర కాలంలో శ్రీ శ్రీ - మల్లకవి మధ్య సైద్ధాంతిక విభేదాలు వచ్చినా, శ్రీ శ్రీ కవిత్వానికి మల్లన్న ఎప్పుడూ దాసుడే. కడప జిల్లావాసిగా,గొప్పకవిగా, పండితుడిగా వాసికెక్కిన పుట్టపర్తి నారాయణాచార్యులంటే మల్లారెడ్డికి అమిత గౌరవం. "ఒరే మల్లుడూ !" అని పిలవగలిగే అధికారం పుట్టపర్తి వారొక్కరికే వుండేది. ఆయన అలా పిలుస్తుంటే? మల్లన్న ఆనంద 'శివతాండవం' చేసేవారు. తను ఏ గేయం రాసినా మొట్టమొదటగా నారాయణాచార్యులకు వినిపించేవారు. పుట్టపర్తి వారంటే మొదటి నుంచి అంత భక్తి. ఇందరి మహనీయుల సాంగత్యం, చిన్నప్పుడే పొదివిపట్టుకున్న కావ్య సాహిత్య సంస్కారం, ప్రజా జీవనంలో కలిసి మెలిసి తిరిగిన అనుభవం, రాజకీయాలను క్షేత్ర దర్శనం చేసిన వాస్తవిక జ్ఞాన సముదాయం మల్లన్న మాటకు మహత్తరమైన శక్తిని చేకూర్చి పెట్టాయి. నిక్కచ్చిగా ఉన్నదున్నట్టు మాట్లాడినా, ఆ వాక్కులో కవిత్వం పొంగి పొరలుతుంది కాబట్టి, వికర్షణ చెందక, అందరి ఆకర్షణను పొందింది. అసంఖ్యాకమైన పాఠకులకు అభిమాన పాత్రమైంది.

'సవ్యసాచి'కి రాస్తున్న దశలో, పంచాయతీరాజ్ ఉద్యోగ నియామకాలకు సంబంధించిన ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి. అభ్యర్థులు పడుతున్న పాట్లను గమనించి, ఇంటర్వ్యూహమా? పద్మవ్యూహమా? అంటూ విరుచుకుపడ్డారు. అది వ్యాసం. కానీ, కవిత్వమై కూర్చుంది. ఆత్రేయ మాట పాటైనట్లు, పాట మాటై నట్లు, మల్లన్న వచనం కవిత్వమవుతుంది. కవిత్వం మహా వచనమవుతుంది. అది అతి సహజంగా జరిగే హేల. ఆ కవితాత్మక వచన రచనం మల్లారెడ్డిని పాత్రికేయంలో విభిన్నంగా నిలబెట్టింది. ఈనాడులో 'పుణ్యభూమి' కంటే ముందుగా, 'కొత్త పాళీ' శీర్షికతో కొన్ని ప్రయోగాలు చేసినట్లు కూడా కొందరు చెబుతుంటారు. ప్రసిద్ధ ఇంగ్లీష్ పత్రిక 'ట్రిబ్యూన్'లో వచ్చే ఇంగ్లీష్ ఎడిటోరియల్స్‌ను కట్ చేయించి, తెలుగులో అనువాదం చేయించి, మల్లారెడ్డి దగ్గరకు రామోజీరావు పంపేవారు. తను ఎడిటోరియల్స్ రాసేప్పుడు వాటిని కూడా పరిగణలోకి తీసుకోమనే ఉద్దేశ్యంతో. కానీ, వాటిని మల్లన్న పట్టించుకున్న సందర్భాలు చాలా అరుదుగా వుండేవి. సొంతదనం, సొంతధనం పుష్కలంగా వున్న వ్యక్తి పరాన్నభుక్కుడుగా (పారసైట్) మారలేడు కదా! పదాలకు కొత్త గొంతుకనిచ్చి ఒక ఒరవడి సృష్టించడం, రాజకీయాలను క్షేత్రస్థాయి నుంచి చూసిన నేతగా ఆ మర్మమెరిగి వాతలు పెట్టడం, సిద్ధాంతాలు నచ్చకపోతే ఏ పార్టీనైనా చాకిరేవు పెట్టడం మొదలైనవి పాత్రికేయ యవనికపై మల్లారెడ్డి చేసిన వీర విన్యాసాలు.

రాంభట్ల కృష్ణమూర్తి, బూదరాజు రాధాకృష్ణ, పొత్తూరి వెంకటేశ్వరరావు వంటి వారితో మంచి స్నేహం ఉండేది. వారితో గడిపే సాయంకాలాలు రసమయంగా వుండేవి. చల్లసాని ప్రసాదరావు రచనలపై ప్రత్యేకమైన మక్కువ ఉండేది. కమ్యూనిజంతో జీవితం ప్రారంభమైనా, తర్వాత ప్రయాణంలో భౌతికవాదం నుంచి ఆధ్యాత్మికతలోకి వదిగిపోయారు. రామకృష్ణ పరమహంస ఆలోచనా విధానం, ఆచరణా శీలం తనను విశేషంగా ఆకర్షించాయి. ఆదిశంకరాచార్యుల అద్వైత సిద్ధాంతం పట్ల కూడా ప్రత్యేకమైన గౌరవాన్ని పెంచుకున్నారు. భౌద్ధమతంలోకి పూర్తిగా మారకపోయినా, ఆ భావాల పట్ల అనురాగాన్ని పోగు చేసుకున్నారు. ఈ విశాల విశ్వాన్ని ఏదో ఒక శక్తి నడిపిస్తోందనే విశ్వాసంలోకి వెళ్లారు. బౌద్ధానికి సంబంధించిన 'దమ్మపదం' తెలుగులోకి అనుసృజన చేశారు. బుద్ధిస్ట్ సొసైటీలో ఈ రచన చాలా ప్రాచుర్యం పొందింది. స్వామి వివేకానందుని కవితాత్మక రచనలను 'యతిగీతం' పేరుతో అనువాదం కూడా చేశారు. రాయలసీమ తత్త్వవేత్తల తత్వాల ప్రభావం కూడా మల్లన్నపై వుందని చెప్పవచ్చు. వేమన్న ఆటవెలదులంటే కూడా మల్లన్నకు చాలా ఇష్టం. శ్రీశ్రీ వంటి ఆధునిక కవులే కాక, శ్రీనాథుడు, అల్లసాని పెద్దన, భట్టుమూర్తి వంటి పూర్వ సంప్రదాయ పద్యకవులపై అమితమైన ఆరాధనా భావం వుండేది. మనుచరిత్ర, వసుచరిత్ర నుంచి వందలాది పద్యాలు చదివి వినిపించేవారు. "తెలుగునాట భక్తిరసం తెప్పలుగా పారుతోంది – డ్రెయినేజీ స్కీమ్ లేక దేంజరుగా మారుతోంది" గజ్జెల మల్లారెడ్డి వేసిన ఈ చురకలు చాలా ప్రసిద్ధం. ఇక్కడ 'భక్తి' అంటే ? ఆయన దృష్టిలో కపట భక్తి. స్వార్థంతో, అవసరాలతో దేవుడికి చేసే పూజలు, దేవుడితోనే బేరం పెట్టుకొనే మనిషి కుయుక్తులు నచ్చక.. ఇలా రాశారని ఆయన సన్నిహితులు చెబుతారు. మల్లారెడ్డి కుమారుడు అశోక్ కూడా అదే అంటారు.

1990 దశకంలో, మాగుంట సుబ్బరామిరెడ్డి యాజమాన్యంలో నడుస్తున్న 'ఉదయం'లో సంపాదకుడుగా పనిచేస్తున్నప్పుడు 'అధికార భాషా సంఘం' అధ్యక్షుడుగా నియమిస్తూ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆహ్వానం పలకడంతో, పాత్రికేయ జీవితానికి స్వస్తి పలికారు. అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి నుంచి ఈ ఆహ్వానం వచ్చింది. కవి, భాషావేత్త, తెలుగు వాడి నాడి ఎరిగిన వ్యక్తిగా 'అధికార భాషా సంఘం'లో తన శక్తి మేరకు ఉత్తమమైన సేవలు అందించి తన ప్రత్యేకతను చాటుకున్నారు. మల్లారెడ్డి గేయాలు, శంఖారావం, సత్యం వధ – ధర్మం చెర, పేరిగాని దర్బారు, సందేహడోల మొదలైన ఎన్నో రచనలు ప్రజల హృదయాలను కొల్లగొట్టాయి.

'మనస్సాక్షి' పేరుతో తన ఆత్మకథను అక్షరబద్ధం చేసి ప్రజకు అందించారు. ఆయన జీవితం తెరచిన పుస్తకం. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) పునర్నిర్మాణంలో మల్లారెడ్డి చేసిన కృషి సామాన్యమైనది కాదు.

వైఎస్ఆర్ కడప జిల్లా అంకాళమ్మ గూడూరులో 1925 లో జన్మించారు. 1997, జూలై 7వ తేదీన ఈ పూర్ణపురుషుడు ఈ 'పుణ్యభూమి'ని వీడి, 'అరుగుచున్నాడు శ్రీనాథుడు అమరపురికి' అన్న చందాన, అనంతవిశ్వంలో కలిసిపోయారు. లక్షలాది మందిని ఉర్రూతలూగించిన ఉపన్యాస విన్యాసకుడుగా, అసంఖ్యాక కవితాప్రియులను ఓలలాడించిన కవిమల్లుడుగా, తన పదకేళితో అనంతమైన పాఠకప్రజను చైతన్య స్రవంతుల్లో నడిపించిన పాత్రికేయుడుగా చిర యశస్సును పొందిన మాన్య చరితుడు. మల్లన్న, మల్లకవి, మల్లారెడ్డి అనే పెక్కు పేర్లతో పిలుచుకునే పెక్కు మందికి ప్రేమ పాత్రుడయ్యాడు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ సమర్పించి గౌరవాన్ని చాటుకుంది. మల్లారెడ్డి కుమారుడు అశోక్ కూడా కొద్దికాలం పాత్రికేయంతో ప్రయాణం చేశారు. సజ్జల రామ కృష్ణారెడ్డి, మందలపర్తి కిషోర్ వంటివారు ప్రియ శిష్యులుగా ఆయన పాత్రికేయ వారసత్వాన్ని నిలబెట్టారు. కవిత్వంలోనూ, పాత్రికేయంలోనూ కొత్త చారిత్రక దశకు ప్రతీకగా ఉద్భవించిన గజ్జెల మల్లారెడ్డి అన్నింటా గొప్పవాడు. ❑

# 'ప్రశ్న' ఒడుపు తెలిసి విసిరిన ఒడిశాల


**బంగారు ఆచార్యులు గారి 'ప్రశ్న' కవితా ఖండికపై పరామర్శ**

- వి.విజయ్‌కుమార్



ఒక కవితా ఖండికకు వినూత్నంగా "ప్రశ్న" అనే శీర్షిక కావడమే ఒక చైతన్యం. ప్రశ్నించడం అంటేనే చైతన్యం. బంగారు ఆచార్యులు గారు వామపక్షవాది. వామ పక్షీయుల దృక్కోణం ఎప్పుడూ సమాజ హితాన్ని కోరుతుంది. ఉద్యమ నేపథ్యంతో, ప్రజా సంబంధాలతో, క్షేత్రస్థాయిలో అనేక పోరాటాల్లో స్వయంగా పాల్గొని సోషలిస్టు మార్గంలో సమాజం నడవాలని ఆకాంక్షిస్తూ, నడుస్తున్న చరిత్రలోని అమానవీయ, అన్యాయపు ధోరణుల్ని ధైర్యంగా ప్రశ్నిస్తూ, సరళ సుందరమైన భాషలో, ఎంతో భావావేశంతో మరెంతో బాధ్యతాయుతంగా సామాజిక దౌష్ట్యాలనూ, స్త్రీ సమాజం పట్ల దౌర్జన్యాలనూ ప్రశ్నిస్తూ వస్తున్నారు. కష్టజీవికి అటూ ఇటూ నిలబడే వాడే కవి అని గాఢంగా నమ్మిన ఆచార్యులవారు బడుగు బతుకుల పట్ల సానుభూతితో, ముఖ్యంగా చిన్న, సన్న కారు రైతులు ఎదుర్కొనే సమస్యల పట్ల అవగాహనతో, తాను పరిశీలించిన సమస్యలని సమాజం ముందు పెడుతూ ఎలా పోరాడితే ఈ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందో చెప్పే ప్రయత్నం చేస్తూ వస్తున్నారు. సరళత్వం తన ఆయుధం. తన పాఠకులెవరో, తను ఎంచుకున్న కవితా వస్తువేమిటో, అది ఎవరి హృదయంలో చైతన్యపు నిప్పు కణికను రగల్చాలో ఎరిగిన వారు గనకే తెచ్చి పెట్టుకున్న కృతక భాషతో కాకుండా, పద బంధాల ఫీట్లతో పనిలేకుండా, శబ్దాల మోతతో, గాఢత్వపు పదాడంబరాల ముచ్చట లేకుండా ఏ ప్రజల కోసమైతే కలం పట్టారో వారికి చేరువ కావడమే లక్ష్యంగా రచనలు చేస్తూ వచ్చారు. యే రచన చేసినా సామాజిక ప్రయోజనం కోసమే తప్ప దానికి భిన్నంగా ఒక్క ముక్క కూడా రాసి ఎరుగని నిబద్ధత కలిగిన రచయిత ఆచార్యుల వారు. "ప్రశ్న" తడమని సామాజిక అంశం లేదు. ఆది నుంచి తుది దాకా ఒకటే లక్ష్యంతో ముందుకు సాగిన ఈ కవితా ఖండికలో కేవలం పరిశీలించటం మాత్రమే నేర్పకుండా ప్రశ్నించడం నేర్పి సమస్యను అధిగమించడానికి యేం చేయాలో కూడా సూచించే పరిష్కారాలను ప్రతిభావంతంగా ఆవిష్కరిం చారు. చాలా కవిత్వాలు ఉన్నదున్నట్టుగా చెప్పేసి తమ పని అయిపోయిందనుకుంటాయి. సమస్యని ప్రతిభావంతంగా వ్యక్తీకరించడం మంచి కవిత్వం అవుతుందేమో కానీ సామాజిక ప్రయోజనం దృష్ట్యా పరిష్కారం సూచించకపోతే అది గొప్ప కవిత్వం కానేరదు. కవిత్వానికి ఒక సామాజిక బాధ్యత ఉంటుందని విశ్వసించే వారికి ఇది తెలియని విషయం కాదు. మనసా, వాచా, కర్మణా కవిత్వ ప్రయోజనాన్ని ఆవాహన చేసుకున్న ఆచార్యులవారు తన రచనల్లో ఎక్కడా కూడా దీన్ని మర్చిపోకపోవడం ప్రశంసార్హం.






**ఈ కవితా ఖండిక కావలసిన వాళ్లు రచయితను నేరుగా సంప్రదించవచ్చు. మొబైల్ ఫోన్ 98495 79569**

నిజాలను ఎప్పుడూ ప్రశ్నలే నిగ్గు తేలుస్తాయి. అందుకే ప్రశ్న అంటే భయం అబద్ధాల్లోళ్ళకి - అంటారు ఆచారి గారు. ఎందుకు భయం? అబద్ధపు తలకిందుల ప్రపంచంలో "నిజాలు" ప్రపంచాన్ని కాళ్ళ మీద నిలబెట్టేలా డిమాండ్ చేస్తాయి కాబట్టే! ఇది ఎలాంటి దంటే హాయిగా భద్రంగా వేలాడే గబ్బిలాన్ని

తిన్నగా కొమ్మ మీద కూచోవడాన్ని ఆశించడం. వ్యవస్థ గబ్బిలమైనప్పుడు తలకిందుల అస్తిత్వంలో ఆల్ ఈజ్ వెల్ విత్ ద వరల్డ్ అనుకుంటూ భద్రతను వెతుక్కున్న దాన్ని ప్రశ్నించడం దానికి నచ్చదు. అందుకే ప్రశ్న దాని అస్తిత్వానికి భంగకరం. ఈ తలకిందుల ప్రపంచంకంటే నిటారుగా నిలబడి ఉండే ప్రపంచం చాలా మెరుగైనదనీ, భద్రమైనదనీ, మరింత ఆనందదాయకం అని చెప్పకపోతే ఈ గబ్బిలాల బతుకులు మారవనీ అందుకే ప్రశ్నించడం ప్రతి ఒక్కరి కర్తవ్యం అనీ కుండ బద్దలు కొడతారు ఈ కవితలో.


నేనో ప్రశ్నను కవితలో నిన్నేమైనా ఆస్తిలో వాటా కావాలని అడిగానా? పాండవుల్లా ఓడిన రాజ్యమడిగానా? గుడులడిగానా? గోపురాలడిగానా? నా నిలువెత్తు శిలా విగ్రహమడిగానా? అంటారు. మరి కవి ఏమడిగారు? రాకెట్ల మీద గ్రహాంతరాళాల్లో దూసుకెళ్ళే రోజుల్లో అడవి బిడ్డల అమ్మ తల్లులు బిడ్డని కనేందుకు మంచం సవారిపై వాగులు దాటే దయనీయ స్థితి నుంచి బిడ్డకు జన్మనివ్వడానికి ఒక చిన్నాసుపత్రి, నడిచెళ్ళే రోడ్డూ మాత్రమే అడిగారు! ఎంతటి హృదయ వేదన? 75 ఏళ్ల స్వాతంత్ర భూమిలో ఒక అడవి బిడ్డ ఆసుపత్రిలో ప్రసవం కోసం దేబిరించే పరిస్థితులు ఇంకా కొనసాగటం ! అబలలమే! అనే కవితలో, స్త్రీ స్వేచ్ఛలోని డొల్లతనాన్ని తూర్పార పడుతూ ఇది మకిలి పట్టిన తప్పుడు చరిత్ర – పుచ్చిన తాటాకు చరిత్ర పుటల్లో – రాసుకుంటూ వచ్చిన మలిన చరిత్ర – అంటూ మేము గనక ఏకకంఠంతో గర్జిస్తే – మేఘంలా ఉరిమితే – ఉప్పెనలా ఉప్పొంగితే – అగ్ని కీలలై చెలరేగితే... అబల సబలయ్యే జీవన సూత్రం పరిఢవిల్లడం న్యాయం అంటారు.

కృషితో నాస్తి దుర్భిక్షం కవితలో నీవు తలవంచి నన్నాళ్లూ... నీ బతుకు బలి చక్రవర్తీ! నీ భావదాస్యాన్ని విడనాడు – నీ సమాజానికి నీవే కర్తా, కర్మా, క్రియా... వాడు కాగితప్పులి – నువ్వు నిదురించే వ్యాఘ్రం. జనాభా రీత్యా బడుగులు కోట్ల మంది ఉన్నా ప్రభువర్గాల కోసం బతుకులు త్యాగం చేయడం తప్ప సొంతంగా ఎదిగే మార్గం ఏమిటన్న ఆలోచన లేకుండా బతుకీడ్చుకుంటూ పోయే భావదాస్యాన్ని ప్రశ్నిస్తున్నాడు కవి.


ఎవరీ దోపిడీ సమాజపు అంతస్థుల్ని వెన్నెముకలా దన్నుగా కాచుకుంటున్న అమాయకులెవ్వరు? ఒక్కసారి దులపరిస్తే కుప్పకూలిపోయే ఈ నిర్మాణాన్ని ఎందుకు మోస్తున్నారీ బడుగు ప్రజలు ? ఈ అజ్ఞానపు భావదాస్యాన్ని ఇంతగా రంగరించి పోసిన ఘనులెవ్వరు? మునులెవ్వరు? ఈ కాగితప్పులులు భరతాన్ని పట్టే ఆ నిదురించే సింహాన్ని నిద్రలేపే చైతన్యం ఎక్కడ?

నిస్సారమైన నేలలో నీరు పారించినట్టు, నిరాశా నిస్పృహల నిస్తేజపు మెదళ్ళలో చైతన్యపు నిప్పుకణికలు రగిలించాలి. కవి రుజుపథికుడు కావాలి! కవి నవయుగ వైతాళికుడు కావాలి! గొప్ప సమాజం వైపు కళ్ళు తిప్పేలా ప్రజా సమూహాలకు చైతన్యపు దివిటీలు ఎత్తి పట్టాలి! విప్లవ నగారాలు మోగించాలి!

ప్రశ్న ఆ పనే చేసింది. ఎవరో ఒకరు బస్ బ్రేక్ చేయకపోతే ఏమవుతుందో చరిత్ర రుజువు చేస్తూనే వచ్చింది. గడ్డకట్టి పేరుకుపోయిన ఈ కొవ్వెక్కిన ఈ మహా పర్వతాన్ని కరిగించడానికి, పెకిలించడానికి కాక పుట్టించే కలాలు కావాలి. కేక పుట్టించే గళాలు కావాలి. ప్రశ్న అదే పని చేసింది. బంగారు ఆచార్యుల వారి కలం నుంచి ఇలాంటి మరెన్నో ప్రశ్నలు వెల్లువెత్తాలని కోరుతూ. ❑




## కొత్త పుస్తకాల స్వీకారం







మాట వెనుక మర్మం

ఖాకీ.. న్యాయం









పెట్రో ఫీట్..

కార్టూన్స్ : సతీష్ ఆచార్య

**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**


Vol : 3 - Issue No : 2 November 2024




## కొత్త పుస్తకాల స్వీకారం




if undeliverd please return to:

**B.Ramesh Chandra Babu**

34-15-1, Doddipatla Vaari Thota

Veedhi, Tanuku - 534 211

West Godavari, Ap

Phone No : 93971 14495

Printed Matter - Book Post

To :

Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.